సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఎస్ఐఆర్ పిటిషన్లపై నేడు 'సుప్రీం' విచారణ
జ్ఞానంలేని హక్కుల వల్ల ఉపయోగం లేదు
రాజ్యాంగాన్ని గౌరవించేవారు రాష్ట్రాలను 'యుటిలు'గా మార్చరు
13 రాష్ట్రాలలో 50శాతం పిల్లలకు అంగన్‌వాడీ పోషకాహారం
లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 38 | సోమవారం | 28-07-2025 | హైదరాబాద్ — Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** — పేజీలు: 12 | వెల రూ. 5.00


## సరోగసి పేరుతో ట్రాఫికింగ్

- సంతానం పేరుతో మోసాలు
- అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న యూనివర్సల్ సృష్టి టెస్ట్‌ట్యూబ్ సెంటర్
- ఏడుగురు అరెస్ట్
- పిల్లల విక్రయాల రాకెట్ గుట్టురట్టు
- వివరాలు వెల్లడించిన హైదరాబాద్ నార్త్‌జోన్ డిసిపి



ప్రజాపక్షం/హైదరాబాద్

యూనివర్సల్ సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌ను సరైన అనుమతులు లేకపోయినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్నారని, 'సంతానం' పేరుతో దంపతులను మోసం చేస్తున్నారని, సరోగసి పేరుతో ట్రాఫికింగ్‌కు పాల్పడ్డారని హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. దంపతుల నుంచి 'సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్' మొత్తం రూ. 35 లక్షలకు పైగా వసూలు చేశారని, పిల్లల విక్రయాల రాకెట్ గుర్తు రట్టు చేశామని హైదరాబాద్ నార్త్ జోన్ డిసిపి ఎస్. రష్మీ పెరుమళ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డిసిపి రష్మి పెరుమళ్ తెలిపిన వివరాలు ప్రకారం...ఒక జంట 2024 ఆగస్టులో సంతాన సాఫల్యం తరువాయి 2లో

## కొండాపూర్‌లో రేవ్ పార్టీ

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు
9 మంది అరెస్ట్, డ్రగ్స్ స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ కొండాపూర్‌లో రేవ్ పార్టీ నిర్వహించడం కలకలం రేపింది. భారీ రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ చేసుకుంటున్న 9మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి భారీ ఎత్తున డ్రగ్స్, మద్యం బాటిళ్లు, ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం 11మందిపై కేసు నమోదు చేశారు. విజయవాడకు చెందిన నాయుడు అలియాస్ వాసు, శివం రాయుడు అనే ఇద్దరు మరి కొంతమందితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా వీకెండ్‌లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జల్సారాయుళ్లను తరువాయి 2లో

## సిఎం రమేష్ వ్యాఖ్యలు వాస్తవమే

బిజెపి ఎంపి సవాల్‌కు కెటిఆర్ సమాధానం చెప్పాలి
వారి ఇద్దరికీ ఓ వేదిక ఏర్పాటు చేస్తా
తేదీ, సమయం చెప్పాలి
బండి సంజయ్ సవాల్



ప్రజాపక్షం/కరీంనగర్

ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ కేసులు ఎత్తివేస్తే బిఆర్‌ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తామంటూ బిజెపి ఎంపి సిఎం రమేష్ ఎదుట బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన ప్రతిపాదన ముమ్మాటికీ వాస్తవమేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుండబద్దలుకొట్టారు. ఈ విషయం అవాస్తమని చెబుతున్న కెటిఆర్‌కు బండి సంజయ్ సవాల్ విసిరారు. తానే వేదిక ఏర్పాటు చేసి సిఎం రమేష్‌ను తీసుకొస్తానని, ఆధారాలతో సహా వివరిస్తానని, తేదీ, సమయం ఖరారు చేయాలని, దమ్ముంటే చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కరీంగనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతి, కుటుంబ పార్టీ అయిన బిఆర్‌ఎస్‌ను విలీనం చేసుకునే ప్రసక్తే లేదని బిజెపి అధిష్ఠానం తేల్చి చెప్పిందన్నారు. బిజెపి కుటుంబ, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని బండి పేర్కొన్నారు. తండ్రి, కొడుకు, కుమార్తె, మేనల్లుడితో నడిచే పార్టీ బిఆర్‌ఎస్ అని, అవినీతి, అక్రమాలు చేసి తెలంగాణను దోచుకుందని మండిపడ్డారు. అలాంటి పార్టీతో ఎందుకు తరువాయి 2లో

## కాళేశ్వరంపై పిసి ఘోష్
# నివేదిక సిద్ధం

నేడు ప్రభుత్వానికి అందజేత?
మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో లోపాలు, డిజైన్లపై విచారణ
కమిషన్ ముందు హాజరైన 116 మంది
ఈనెల 31తో ముగియనున్న కమిషన్ గడువు



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని న్యాయ విచారణ కమిషన్ తుది నివేదికను సిద్ధమైంది.. ఈ నివేదికను సోమవారం ప్రభుత్వానికి అందజేసే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు జరిగిన నష్టంపై దర్యాప్తు చేయడానికి జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ 2024 మార్చి 14న నియమించిన ప్రభుత్వం 2024 జూన్ 30 నాటికి నివేదిక సమర్పించడానికి గడువును విధించింది. దీంతో విచారణలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో ఉన్న లోపాలు, డిజైన్ లోపాలు, నిర్వహణ సమస్యలు వంటి అంశాలపై క దృష్టి సారించిన ఈ కమిషన్ 16 నెలల పాటు మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మొదల్కొని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి, ఈటల రాజేందర్, నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావుతోపాటు మాజీ ప్రభుత్వ కార్యదర్శి, సిఎంఓ అధికారులు, నీటిపారుదలశాఖ మాజీ ఇఎన్‌సి తదితర ఉన్నతాధికారులతో మొత్తం 116 మందిని విచారించింది. ఈ నెల 31వతేదీతో కమిషన్ గడువు తీరనుండడంతో జస్టిస్ పి.సి. ఘోష్ నేతృత్వంలోని ఏక సభ్య కమిషన్ సోమవారం తుది నివేదికను అందజేయనున్నట్లు సమాచారం. ఒకవేళ కమిషన్ నివేదికను అందజేస్తే తరువాయి 2లో

## నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కులగణనపై స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక, బిసి రాజర్వేషన్ల ప్రక్రియ, స్థానిక సంస్థల ఎన్నికలు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, భూముల తరువాయి 2లో



## హరిద్వార్‌లోని ఆలయంలో తొక్కిసలాట

ఆరుగురు మృతి, 28 మందికి గాయాలు
విద్యుత్ ప్రవహిస్తుందనే పుకార్లతో భక్తుల్లో భయాందోళనలు

**హరిద్వార్ :** ఉత్తరాఖండ్‌లో తీవ్ర విషాద ఘటన జరిగింది. హరిద్వార్‌లోని కొండపై ఉన్న మానసా దేవి ఆలయం ఆదివారం వందలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఈ నేపథ్యంలో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 28 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఆలయానికి వెళ్లే మెట్లు ప్రారంభమయ్యే చోట విద్యుత్ ప్రవాహం వచ్చిందనే పుకార్లు ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించాయి. ఇది తొక్కిసలాటకు దారితీసిందని హరిద్వార్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) తరువాయి 12లో




## ఇబ్బందుల్లేకుండా యూరియా సరఫరాకు
# చర్యలు తీసుకుంటున్నాం

వరద ముప్పును ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలి
ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి
ఇందిరమ్మ ఇళ్ల నిర్ణయం చరిత్రాత్మకం
మంత్రులు భట్టి, వాకాటి, తుమ్మల, పొంగులేటి స్పష్టీకరణ

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని, వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు రైతులు, అధికారులు సిద్ధంగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు వాకాటి శ్రీహరి, తుమ్మల, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు స్పష్టం చేశారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా అధికారులతో పాల్వంచలోని ఐడిఒసిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకాటి శ్రీహరి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకాగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి తరువాయి 12లో


## దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార బ్యాంకులు కీలకం

దేశవ్యాప్తంగా 8.5 కోట్ల మందికి సేవలందించాయి
మొత్తం డిపాజిట్లు, రుణాలు రూ.5.5 లక్షల కోట్ల మార్క్‌ను దాటాయి
అగ్రసేన్ బ్యాంక్ అమీర్‌పేట బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్



'దేశార్థిక వ్యవస్థలో సహకార బ్యాంకుల పాత్ర చాల కీలకమని, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు ఆర్థిక సేవలను అందించడంలో ఇవి ముందున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆర్‌బిఐ వార్షిక నివేదిక 2024 ప్రకారం దేశవ్యాప్తంగా 8.5 కోట్ల మందికి సేవలను అందించడం ద్వారా మొత్తం డిపాజిట్లు, రుణాలు రూ. 5.5 లక్షల కోట్ల మార్కును దాటాయి మంత్రి తెలిపారు. ఆదివారం అగ్రసేన్ బ్యాంక్ అమీర్ పేట్ బ్రాంచ్ ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఒకప్పుడు బ్యాంకులంటే కేవలం డబ్బుల డిపాజిట్, విత్‌డ్రా మాత్రమే అనుకునేవారు అన్నారు. కానీ.. ఇప్పుడా ఆ నిర్వచనం పూర్తిగా మారిపోయిందని ఖాతాదారుల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా టెక్నాలజీని మిళితం చేస్తూ మార్పులను అందిపుచ్చుకుంటూ వివిధ రకాల సేవలను అందిస్తున్నాయని వివరించారు. 'తెలంగాణలో 48 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు 321 శాఖల ద్వారా అర్బన్, సెమీ – అర్బన్ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నాయని, గత ఆర్థిక సంవత్సరంలో తరువాయి 2లో



## సీనియర్ జర్నలిస్టు సుమిత్ చక్రవర్తి మృతి

- సిపిఐ సంతాపం
- దృఢమైన వామపక్ష ఉద్యమ, ప్రగతిశీల గొంతుక అని నివాళి

**న్యూఢిల్లీ:** సీనియర్ జర్నలిస్టు, మెయిన్‌స్ట్రీమ్ వారపత్రిక సంపాదకులు సుమిత్ చక్రవర్తి మృతి చెందారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో శనివారం రాత్రి 10.45 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. తీవ్ర అనారోగ్యంతో ఢిల్లీలో చికిత్స పొందుతున్న ఆయనను కోల్‌కతాకు తరలించగా, అక్కడి ఆసుపత్రిలో సుమిత్ చక్రవర్తి మరణించినట్టు ఆయన కుటుంబానికి సన్నిహితులు వెల్లడించారు. సిపిఐ పూర్వ నాయకులు రేణు చక్రవర్తి, నిఖిల్ చక్రవర్తి కుమారుడు సుమిత్... సిద్ధాంతాలకు కట్టుబడి జర్నలిజం చేశారు. సిపిఐకు నిబద్ధతగల నాయకుడిగా తరువాయి 2లో

## కాలేజీలు ఇక్కడ.. తరగతులు ఎక్కడ?

ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు
ప్రైవేట్ ఐఐటి, నీట్ కోచింగ్ అకాడమీల్లో క్లాసులు
రూ.కోట్లలో దందా నిర్వహిస్తున్న నిర్వాహకులు



ప్రజాపక్షం/కరీంనగర్

విద్యారంగంలో జరుగుతున్న ఇష్టారాజ్యంపై సర్కారు నియంత్రణ కరువయ్యింది. కరీంనగర్ వేదికగా జరుగుతున్న ఓ దందా అమాయక తల్లి దండ్రులు, విద్యార్థులను మోసాలకు గురిచేస్తోంది. కాలేజీలు ఒక చోట అయితే తరగతులు మరో చోట నిర్వహిస్తూ కొందరు ప్రైవేట్ విద్యా సంస్థల నిర్వాహకులు కాసులు దండుకుంటున్నారు. ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్ పేరిట కార్పోరేట్ల అకాడమీలు పేరుతో నిర్వహిస్తుండగా అందులో చేరిన విద్యార్థులకు మరో జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ తీసుకుని ఊరు పేరు లేని కాలేజీ నుంచే పరీక్ష రాయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యహరిస్తున్నప్పటికీ ఇంటర్‌బోర్డు తరువాయి 2లో

## నేటి నుంచి పార్లమెంట్‌లో
# మాటల యుద్ధం!


పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌పై ఉభయసభల్లోనూ 16 గంటల పాటు చర్చ



**న్యూఢిల్లీ :** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో తొలివారం ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ముగిసిన విషయం తెలిసిందే. అయితే సోమవారం నుంచి పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌పై తీవ్ర చర్చ జరగనుంది. జాతీయ భద్రత, విదేశాంగ విధాన ఆవశ్యకతల చుట్టూ ఉన్న రెండు అంశాలపై పాలక కూటమి, ప్రతిపక్షాలు మధ్య మాటల యుద్ధం జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభలో చర్చ సందర్భంగా బిజెపి నేతృత్వంలోని పాలక ఎన్‌డిఎ, ప్రతిపక్ష పార్టీలు ఒకదానిపై ఒకటి మాటల తూటాలను ఎక్కుపెట్టనున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ భద్రతపై తన ప్రభుత్వం బలమైన వైఖరిని తెలియజేయడానికి జోక్యం చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ అంశాలపై మాట్లాడతారని వర్గాలు తెలిపాయి. ఉభయ సభల్లోని ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు తరువాయి 12లో

## డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య బెదిరింపులు

చర్చలకు థాయ్–కాంబోడియా సమ్మతి, ఉల్లంఘన



**కౌలాలంపూర్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్యం పేరుచెప్పి, థాయ్‌లాండ్–కాంబోడియా దేశాలమధ్య వివాదంలో కూడా జోక్యం చేసుకున్నారు. దీంతో ఆ రెండు దేశాలూ కాల్పుల విరమణపై సంప్రదింపులకు అంగీకరించాయి. కానీ తర్వాత కొద్ది గంటలకే రెండు దేశాలూ సరిహద్దుల్లో ఆదివారం నాలుగోరోజు పరస్పరం దాడులు చేసుకున్నాయి. దీంతో ఒక రకంగా ట్రంప్ వాణిజ్య స్తంభన బెదిరింపులు విఫలమైనట్టు కనిపించింది. ఇరు దేశాల ప్రధానమంత్రులూ ట్రంప్‌కు తొలుత కృతజ్ఞతలు తెలియజేశారు. కాల్పుల విరమణపై కలిసి కృషి చేసేందుకు రెండు దేశాలు అంగీకరించాయని ట్రంప్ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## సూడాన్‌లో ఆర్‌ఎస్‌ఎఫ్ సమాంతర ప్రభుత్వం



**ఖార్టూమ్ :** సూడాన్‌లో సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్ ఎస్ ఎఫ్‌కు చెందిన పారామిలిటరీ ఆదివారంనాడు ప్రకటించింది. రాజధాని ఖార్టూమ్‌లో ప్రభుత్వ మిలిటరీ పరిపాలనను సవాలు చేస్తూ సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకుడు మహ్మద్ హమ్దాన్ హెమెడితి దగలో ప్రకటించారు. ఈ సమాంతర ప్రభుత్వంలో హమ్దాన్ నాయకత్వాన 15 మంది సభ్యులతో కూడిన కౌన్సిల్ పరిపాలన చేస్తుంది. సూడాన్‌లో రెండు సైనికవర్గాల మధ్య మూడు సంవత్సరాలుగా దారుణమైన ఘర్షణ కొనసాగుతోంది. ఈ ఘర్షణ కారణంగా వేలాదిమంది ప్రజలు మరణించారు. లక్షలాదిమంది ప్రజలు దేశం వదలిపోయారు.

## కాంగోలో చర్చిపై ఉగ్రవాదుల కాల్పులు

### 21 మంది మృతి : అనేక దుకాణాలు దగ్ధం



**బ్రజవిల్లే :** కాంగోలో పెను విషాదం చోటుచేసుకుంది. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదుల మద్దతుతో ఎడిఎఫ్ (అల్లైడ్ డెమొక్రటిక్ ఫోర్స్) తిరుగుబాటుదారులు ఒక చర్చిపై కాల్పులు దాడికి తెగ బడటంతో 21 మంది మరణించారు. చర్చిలో ఆదివారంనాడు ప్రార్థనలు జరుగుతున్న సమయంలో చర్చి లోపల, వెలుపల తిరుగుబాటుదారులు కాల్పులు జరిపారు. తూర్పు కాంగో కోమందలోని క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో, చర్చి లోపల మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఉగ్రవాదులు దాడి చేశారు. దాడి సమయంలో అనేక దుకాణాలు, ఇళ్ళు ఆ పరిసరాల్లో అగ్నికి ఆహుతి చేశారు. సజీవదహనమైన మూడు మృతదేహాలను చర్చి లోపలి నుండి స్వాధీనం చేసుకున్నారు. సజీవదహనమైన మృతదేహాలు ఇంకేమైనా ఉన్నాయా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ముమ్మర గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని కోమందలోని పౌర సమాజ సమన్వయకర్త డియోడోనే దురంత జోన్ చెప్పారు. ఐతే ఈ మృతుల సంఖ్యను కాంగో సైన్యం తక్కువ చేసి చూపించింది. చర్చిలో పదిమంది మాత్రమే మరణించారని ఇటూరి రాష్ట్రంలోని ఆర్మీ అధిపతి లెఫ్టినెంట్ జూల్స్ ఎన్‌గోంగో చెప్పారు. గడచిన పది సంవత్సరాలుగా ఉగాండా—కాంగో సరిహద్దుల్లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల తరఫున వారికి అనుబంధంగా ఉన్న ఎడిఎఫ్ తరఫు ఉగ్రవాద దాడులు కొనసాగిస్తూ హింసను సృష్టిస్తున్నది. స్వేచ్ఛా ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థ కంటే ఇస్లాం మతరాజ్య స్థాపన అత్యున్నతమైనదిగా భావిస్తున్న ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు ఉగాండా, కాంగోలలో రాజకీయ వ్యవస్థపై ఆధిపత్యం సాధించేందుకు హింసాత్మక పోరాటం చేస్తున్నారు. ఐఎస్ తరఫున ఎడిఎఫ్ ఈ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. బగాండా, జసోగాలలో నివసిస్తున్న బంటూ తెగ ముస్లింలను ఎడిఎఫ్ ఉగ్రవాదులుగా తయారుచేసి దాడులు కొనసాగిస్తోంది. తూర్పు కివూ ప్రాంతాన్ని ప్రధానస్థావరంగా చేసుకుని ఎడిఎఫ్ రెండు దేశాలలో హింసాత్మక కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

## గాజాలోని మూడు రద్దీ ప్రాంతాల్లో..

# రోజుకు 10 గంటలు కాల్పుల విరమణ

**డైర్ అల్ బలాహ్ :** ఇజ్రాయెల్ ఎట్టకేలకు గాజాలోని పాలస్తినా ప్రజలపై కొద్దిమేరకు జాలి ప్రదర్శించింది. గాజాలో రద్దీగా ఉండే మూడు జనావాస ప్రాంతాల్లో రోజుకు 10 గంటలపాటు మానవతాదృక్పథంతో కాల్పుల విరామం పాటించాలని నిర్ణయించింది. అదేవిధంగా ఆహారాన్ని భద్రంగా లోపలికి సరఫరా చేసేందుకు సురక్షితమైన మార్గాలను ఏర్పాటుచేస్తున్నట్లు కూడా ఇజ్రాయెల్ ప్రకటించింది. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ కాల్పుల ఉపశమనం పాలస్తినా ప్రజలకు లభిస్తుంది. ఆదివారం నుండే ఈ కాల్పుల ఉపశమనం ప్రారంభమైంది. అల్ మవసి, అల్ బలాహ్, గాజా సిటీలలో ఈ కాల్పుల ఉపశమనం అందుబాటులోకి వచ్చింది. ఐడిఎఫ్ తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ ఈ కాల్పుల ఉపశమనాన్ని అమలుచేస్తుంది. ఇజ్రాయెల్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం గాజాలో యుద్ధం మొదలై ఆదివారంనాటికి 660 రోజులు పూర్తయ్యాయి. 21 నెలల కాలంలో మొదటిసారి ఇజ్రాయెల్ అంతర్జాతీయ ఒత్తిడిని తట్టుకోలేక ఈ కంటి తుడుపు చర్య తీసుకుంది. గాజాలో పాలస్తినా ప్రజలను ఉద్దేశపూర్వకంగా పస్తులుపెట్టి చంపేస్తున్నారని, దీనిని ఒక యుద్ధ తంత్రంగా మార్చుకున్నారని ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలదాడి ఇటీవల పదిరోజులుగా ఉధృతం కావడంతో నేతన్యాహూ ప్రభుత్వం ఒక్క అడుగు వెనక్కు వేసింది. గడచిన



మూడు నెలలుగా ఆహార పంపిణీ కేంద్రాలవద్ద వేచి ఉన్న ప్రజలపై కాల్పులు విరామం లేకుండా కొనసాగడంతో కనీసం 1000 మందిపైగా మరణించారు.

ఈ కాల్పుల విరామం వల్ల గాజాలోకి ఆహార సరఫరా కూడా గణనీయంగా పెరుగుతుందని ఐక్యరాజ్యసమితి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యుఎఫ్‌పి) విభాగం ఆశాభావం వ్యక్తం చేసింది. తక్షణం గాజాలో లక్షమంది పిల్లలు, మహిళలు పోషకాహారలోపంతో బాధపడుతున్నారని, వారికి మంచి ఆహారాన్ని అందుబాటులోకి తేవాలని డబ్ల్యుఎఫ్‌పి చాలా రోజులుగా కోరుతున్నది. గాజాలో ఇక కరువు కాటకాలు తాండవించే పరిస్థితి వచ్చిందని ఆహార నిపుణులు కూడా హెచ్చరికలు చేస్తున్న తరుణంలో ఈ కాల్పుల ఉపశమనం గాజా ప్రజలకు లభించింది. అదేవిధంగా వచ్చిన ఆహారాన్ని అందరికీ సమానంగా పంచలేకపోతున్నామని, ఎందుకంటే అనేక ముఠాలు ముందుగానే దాడులు చేసి వాటిని తీసుకుపోతున్నాయని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

కాగా ఇజ్రాయెల్ సైన్యం కూడా ఆహారం మోసుకొచ్చే ట్రక్కులను ఈజిప్టు వైపు నుండి గాజాలోకి వచ్చేందుకు అనుమతించింది. గాజాలోకి పుష్కలంగా ఆహారాన్ని అనుమతిస్తే, హమాస్ ఉగ్రవాదులు ఈ ఆహారాన్ని తీసుకుపోయి నెలలపాటు అందుబాటులో ఉండేవిధంగా నిల్వచేసుకుని ఎంజాయ్ చేస్తున్నారని, అందువల్ల ఆహారాన్ని వారికి అందకుండా కట్టడి చేస్తున్నామని, సొరంగాల్లో దాక్కున్న హమాస్ ఉగ్రవాదులు ఆహార నిల్వలు పెట్టుకుని హాయిగా కాలం గడుపుతున్నారని ఇజ్రాయెల్ సైన్యం ఆరోపిస్తున్నది. ఈ నెపంతోనే ఆహార కేంద్రాలవద్ద ఎదురుచూస్తున్న సామాన్యులపై కాల్పులు జరుపుతున్నది.

**53 మంది కాల్చివేత**


గాజాలో ఆదివారం నుండి కొత్త పద్ధతుల్లో మూడు రద్దీ ప్రాంతాల్లో 10గంటలసేపు కాల్పుల ఉపశమనం ఉంటుందని ఇజ్రాయెల్ ప్రకటించినప్పటికీ వేరువేరు దాడుల్లో 53 మంది పాలస్తినా ప్రజలను ఐడిఎఫ్ సైన్యం కాల్చి చంపింది.

ఎన్ని మాటలు వల్లించినప్పటికీ సామాన్యులపై మారణహోమం యథాతథంగా కొనసాగింది. ఆదివారం తెల్లవారకముందే ఈ కాల్చివేతలు జరిగాయి. అదేవిధంగా సరైన ఆహారం లభించక ఆకలితో అలమటించి మరో ఆరుగురు పాలస్తినా ప్రజలు మరణించారు. ఇజ్రాయెల్ ప్రదర్శిస్తున్న కాల్పుల ఉపశమన మానవతా దృక్పథం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, పాలస్తినా ప్రజల ప్రాణాలు కాపాడటానికి ఇది నిజమైన అవకాశం ఇచ్చినట్లు కాదని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మునీర్ అల్ బౌర్ష్ విమర్శించారు. 21నెలలుగా గాజాలో ఐడిఎఫ్ చేస్తున్న యుద్ధంలో ఇప్పటివరకూ 59,733 మంది మరణించారు. మరో 1,44,477 మంది గాయపడ్డారు.

## ఈసారి నీ మీదే దాడి చేస్తాం జాగ్రత్త

### ఖమేనీకి ఇజ్రాయెల్ హెచ్చరిక

**మిట్జ్‌పే రామోన్ :** ఇరాన్‌కు ఇజ్రాయెల్ మరోసారి తాజా హెచ్చరిక జారీ చేసింది. ''మీరు ఇదేవిధంగా మమ్మల్ని బెదిరిస్తూ ఉంటే మా చేతులు మళ్ళీ టెహ్రాన్ వరకూ ముందుకు చాచుకొస్తాయి, దాడి చేస్తాం జాగ్రత్త'' అని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెలీ కట్జ్ హెచ్చరించారు. ప్రత్యేకించి ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా అలీ ఖమేనీకి ఆయన నేరుగా ఈ హెచ్చరిక చేశారు. నెగెవ్ ఎడారి నడిబొడ్డున ఉన్న ఇజ్రాయెలీ వైమానికస్థావరాన్ని మంత్రి కట్జ్ ఆదివారంనాడు సందర్శించిన సందర్భంగా ఈ హెచ్చరిక చేశారు. 12 రోజులపాటు ఇరాన్‌తో ఇజ్రాయెల్ యుద్ధం చేసింది. ఈ యుద్ధం తర్వాత కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన నెలరోజులకే కట్జ్ తిరిగి ఖమేనీకి ఈ హెచ్చరిక చేశారు. ''మమ్మల్ని తరచు బెదిరిస్తున్నారు, ఇంతకుముందు మిమ్మల్ని వదిలేశాం, కానీ ఈసారి ఈ చేతులు చాలా పొడుగ్గా టెహ్రాన్ దాకా చాచుకుని వస్తాయి, వ్యక్తిగతంగా మిమ్మల్ని పట్టుకుం



టాయి జాగ్రత్త'' అని ఖమేనీకి కట్జ్ హెచ్చరిక జారీ చేశారు.

## గాజా ఆహార నౌకను అడ్డుకున్న ఇజ్రాయెల్

### 21 మంది నిర్బంధం

**టెల్‌అవీవ్ :** గాజాకు మానవతా సహాయాన్ని తీసుకువస్తున్న ఒక నౌకను ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం అర్థరాత్రి అంతర్జాతీయ సముద్ర జలాల్లో అడ్డుకుంది. ఈ నౌకలో ఆహార వస్తువులతోపాటు ప్రయాణం చేసి వస్తున్న 21 మంది అంతర్జాతీయ సహాయకుల బృందాన్ని కూడా నిర్బంధంలోకి తీసుకుంది.గాజాలోకి ఎలాంటి ఆహార సరఫరాలు తమ అనుమతి లేకుండా తీసుకురాకూడదన్న నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఈ ఆహారాన్ని, మానవతా సహాయాన్ని తరలిస్తున్నారన్న ఆరోపణలపై నౌకను ఇజ్రాయెల్ అడ్డుకుంది. అందులో ఉన్న సహాయ బృందాలను కూడా కదలకుండా చేశారు. ఈ నౌకలో గాజాలో ప్రజలకు అవసరమైన ఔషధాలు, వైద్య పరికరాలు, ఆహార వస్తువులు ఉన్నాయని ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కొయిలేషన్ ఆదివారంనాడు తెలియజేసింది. హండాలా నౌకను ఈ కొయిలేషన్ నడుపుతున్నది. గాజాకు 40 నాటికల్ మైళ్ళ దూరంలో ఇజ్రాయెల్ సైన్యం ఈ నౌకను గుర్తించి ముందుకు కదలకుండా అడ్డుకుంది. ఈ నౌకలో ఎలాంటి ఆయుధాలూ లేవు. ఉన్నవన్నీ మానవతా సహాయమేనని కొయిలేషన్ చెప్పింది. దీనిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం వెంటనే ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు.

## సుమిత్ చక్రవర్తి మృతి

(మొదటి పేజీ తరువాయి)

సేవలు అందించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూకు తోడ్పాటు అందించారు. సుమిత్ భార్య, విద్యావేత్త, డాక్టర్ గార్గి చక్రవర్తి ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాలు. సుమిత్‌గార్గీ దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు.

**ప్రగతిశీలవాదిని కోల్పోయాం: సిపిఐ**

ప్రముఖ జర్నలిస్టు, నిబద్ధతగల మేధావి, విలువలకు, సిద్ధాంతాలకు, సత్యం, న్యాయం, లౌకికవాదానికి కట్టుబడే వ్యక్తి సుమిత్ చక్రవర్తి మరణంతో దృఢమైన ప్రగతిశీల గళాన్ని కోల్పోయామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి వేర్వేరుగా సంతాపం ప్రకటించారు. తమతో, పార్టీతో సుమిత్‌కు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమాకు ఆయన గణనీయమైన తోడ్పాటు అందించారని, సీపీఐ నాయకులు, మాజీ ఎంపి రేణు చక్రవర్తి, దిగ్గజ జర్నలిస్టు, మెయిన్ స్ట్రీమ్ వీక్లీ వ్యవస్థాపకులు నిఖిల్ చక్రవర్తి సంతానంగా వారి వారసత్వాన్ని హుందాగా కొనసాగించారని రాజా శ్లాఘించారు. సుమిత్ మరణంతో వామపక్ష, ప్రగతిశీల, ప్రజాస్వామ్యబద్ధమైన సుస్థిర స్వరాన్ని కోల్పోయామని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సుమిత్ ఏ చర్చలో పాల్గొన్నా సమగ్రతతో, అంతర్దృష్టితో వ్యవహరించేవారని గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశతో తమకు పరిచయం ఏర్పడిందని, తరచూ సమస్యలు, ఉద్యమాలపై చర్చించేవారని ఆయనతో తనకున్న జ్ఞాపకాలను సుధాకర్ రెడ్డి నెమరవేసుకున్నారు. సుమిత్ మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటుగా పేర్కొన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం కూడా వేరొక ప్రకటనలో సంతాపం ప్రకటించింది. భయం తెలియని జర్నలిస్టుగా విలువలకు, ప్రగతిశీల మార్పునకు కట్టుబడిన వ్యక్తిగా సుమిత్ చక్రవర్తి సేవలు మరవలేనివని, ఆయన మరణం తీరని లోటని పేర్కొంది. సుమిత్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించింది.

## సహకార బ్యాంకులు కీలకం

(మొదటి పేజీ తరువాయి)

వీటి బిజినెస్ టర్నోవర్ రూ.17వేల కోట్లు కాగా, క్రెడిట్, డిపాజిట్ నిష్పత్తి 66.7 శాతంగా ఉందన్నారు. 'సహకార బ్యాంకులు లాభాపేక్షతో కాకుండా, ఖాతాదారుల ప్రయోజనాల కోసం కమ్యూనిటీ ఆధారిత సేవలను అందిస్తున్నాయని తెలిపారు.కేర్(కమ్యూనిటీ ఫోకస్డ్ అఫర్డబుల్ అండ్ యాక్సెసిబుల్ క్రెడిట్, రిలేషన్‌షిప్ బేస్డ్ బ్యాంకింగ్, ఎంపవరింగ్ లోకల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) మోడల్‌లో పని చేస్తున్నాయని తెలిపారు. యువత, వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు, మహిళా స్వయం సహాయక బృందాలకు రుణ అనుసంధానాలు, గ్రీన్ లోన్స్ వంటి పథకాలను ప్రోత్సహిస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రెసిడెంట్ అనిరుధ్ గుప్తా, టిబారుమల్ జ్యూవెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రాంభరోసే గుప్తా, సోమాని ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అశోక్ కుమార్ సోమాని, అగ్రసేన్ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్ కుమార్ ఖేడియా, సీనియర్ వైస్ ఛైర్మన్ నవీన్ కుమార్ అగర్వాల్, వైస్ ఛైర్మన్ సురేష్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## సరోగసి పేరుతో ట్రాఫికింగ్

(మొదటి పేజీ తరువాయి)

కోసం యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రదించారు. ఐవిఎఫ్ సాధ్యం కాదని, సరోగసీ ద్వారా బిడ్డను పొందవచ్చని, ఇందుకు రూ.30లక్షలు ఖర్చు అవుతుందని, వారిని సరోగసీ కోసం నమ్రత ఒప్పించారు. ఆ క్లినిక్ ద్వారా సరోగసీ తల్లిని ఏర్పాటు చేస్తామని ఆ దంపతులని నమ్మించారు. ఆ తర్వాత దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి, విశాఖలోని ఒక గర్భిణిని 'సరోగసీ మదర్'గా చూపించారు. తొమ్మిది నెలల పాటు ఆ జంట క్లినిక్‌కు డబ్బులు చెల్లించారు. 2025 జూన్‌లో సరోగసీ తల్లికి విశాఖపట్నంలో అబ్బాయి పుట్టాడని, డెలివరీ ఛార్జీలను చెల్లించి ఆ శిశువును తీసుకెళ్లాలని ఆదంపతులకు సమాచారం అందించారు.

హాస్పిటల్‌లో ఒక శిశువును విశాఖ దంపతులకు అప్పగించారు. అయితే సరోగసీకి అంగీకరించిన సదరు మహిళ అదనంగా డబ్బును అడుగుతున్నారని డాక్టర్ నమ్రత సదరు సరోగతి దంపతులకు తెలియజేయడంతో వారు అడిగినంత అదనపు డబ్బులను కూడా ఇచ్చారు.

**డిఎన్ఎ పరీక్షతో వెలుగులోకి....**

విశాఖ దంపతులకు అనుమానం వచ్చి తమ శిశువుకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో ఆ శివువు డిఎన్ఎ ఈ దంపుతులతో కలువలేదు, తమ శిశవు కాదని, తమను మోసం చేశారని వారు గుర్తించారు. దీంతో వారు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రదించగా వారిని డాక్టర్ నమ్రత కొడుకు బెదిరించారు. దీంతో ఆ దంపతులు హైదరాబాద్‌లోని గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు మొదులుపెట్టగా, ఈ కేసులో నమ్రత అసలు సరోగసినే చేయలేదని పోలీసులు గుర్తించారు. శిశువు వద్దనుకున్న అసోంకు చెందిన ఒక మహిళకు డాక్టర్ నమ్రత రూ.90వేలను చెల్లించారు. ఆమెకు శిశువు పుట్టగానే తీసుకున్నారు. ఆ శిశువునే విశాఖ దంపతులకు అప్పగించారు.

**సంతానం లేని దంపుతులను మోసం చేస్తున్న డాక్టర్ నమ్రత : డిసిపి**

సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు చాలా నిబంధనలను ఉల్లంఘించారని, ఆ హాస్పిటల్‌కు సరైన అనుమతులు లేవని, దీనిపైన అనేక ఫిర్యాదులు ఉన్నాయని డిసిపి రష్మి పెరుమాళ్ తెలిపారు. ఈ సెంటర్‌లో డాక్టర్, సిబ్బంది ఎవరూ సరైన నిపుణులు కాదని, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ గడువు 2021లోనే ముగిసిందని వివరించారు. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. ఇది వరకే న్యాయస్థానంలో కేసులు కూడా కొనసాగుతున్నామయని, అందుకే హాస్పిటల్‌ను చాటుమాటుగా నిర్వహిస్తున్నారని, దీంతో వైద్య అధికారులు కూడా ఈ సెంటర్‌ణు గుర్తించలేకపోయారని డిసిపి చెప్పారు. సంతానం లేని దంపతులను గుర్తించి, వారిని డాక్టర్ నమ్రత మోసగిస్తున్నారని, ఇది సరోగసీ కాదని, అందుకే చైల్డ్ ట్రాఫికింగ్ కేసు నమోదు చేశామని రష్మి తెలిపారు. డాక్టర్ నమ్రత పెద్దఎత్తున అక్రమ సరోగసీ నిర్వహిస్తున్నారన్నారు. విజయవాడ,సికింద్రాబాద్, విశాఖపట్నం, కొండాపూర్‌లో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లను నిర్వహిస్తున్నామని చెబుతూనే దంపతుల నుంచి డాక్టర్ నమ్రత రూ.20 నుంచి రూ.30లక్షల వరకు వసూలు చేసి, వారిని మోసం చేస్తుందని తమ దర్యాపులో తేలిందని డిసిపి వెల్లడించారు.

## తరగతులు ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు అవినీతి మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఐఐటి, నీట్ కోచింగ్ పేరిట ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నిర్వాకంతో ప్రభుత్వం, ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం స్పష్టమవుతోంది. కరీంనగర్‌లోని గణేష్ నగర్ బైపాస్ రోడ్డులో ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ ఉంది. కాలేజీ బోర్డు కనిపిస్తుండగా ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కలిపి వెయ్యికిపైగా అడ్మిషన్లు జరిగాయి. కాగా ఆ కళాశాలలో బోర్డు, బిల్డింగ్ తప్ప విద్యార్థులు కనిపించరు. కాగితాల్లోనే సదరు కళాశాల కనిపిస్తోంది. తరగతులు, ప్రాక్టికల్స్ అక్కడే జరుగుతున్నట్లు కాలేజీ యాజమాన్యం చూపుతోంది. అయితే అడ్మిషన్లు పొందిన ఆ వెయ్యి మంది విద్యార్థులకు ఎక్కడ క్లాసులు నిర్వహిస్తున్నారనే విషయాన్ని ఆరా తీస్తే ..కరీంనగర్‌లోని ప్రముఖ ఐఐటి, నీట్ అకాడమీ నిర్వాహకులు తమ అకాడమీలో చేరే విద్యార్థులను ఇంటర్మీడియట్‌లో ఎన్‌రోల్ చేసుకునేందుకు ఈ కాలేజీని వినియోగించుకున్నట్లు తెలిసింది. తద్వారా రూ.కోట్లలో దందా నడిపిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో క్లాసులు నడుపుతూ ఐఐటి, జెఇఇ అడ్వాన్స్, నీట్ పేరిట ఆకర్షణీయమైన హోర్డింగ్‌లతో జనాన్ని బుట్టలో వేసుకుంటున్నారు. ఐఐటి, ఎన్ఐటి, టాప్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీటు గ్యారంటీ అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మాయ చేస్తూ మభ్యపెడుతూ ఒక్కో విద్యార్థి నుంచి రెండేళ్లకు రూ.3లక్షలకు పైగా వసూలు చేస్తుండడం విశేషం.

**నిబంధనలు బేఖాతరు..** కరీంనగర్‌లో కోటా, ఆకాష్, బన్సాల్ క్లాసెస్ లాంటి పేర్లతో దాదాపు 5కు పైగా ఐఐటి, జెఇఇ, నీట్ అకాడమీలున్నాయి. వీటిలో టెన్త్ పూర్తయిన విద్యార్థులకు ఇంటర్ అడ్మిషన్‌తో పాటు ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్ ఇస్తున్నారు. వాస్తవానికి నగరంలోని ఇలాంటి ఏ అకాడమీకి ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులు లేవు. ఇవి జూనియర్ కాలేజీలు కాకపోయినా వీటి నిర్వాహకులు ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ తీసుకుని వారి పేర్లను అడ్మిషన్లు తక్కువగా ఉన్న ఇతర ప్రైవేట్ జూనియర్ కాలేజీల నుంచి ఎన్‌రోల్ చేయిస్తున్నారు. ఆ కాలేజీల నుంచే పరీక్ష రాయిస్తున్నారు. తమ అకాడమీ పేరుతో విద్యార్థులను చేర్పించుకుని మరో జూనియర్ కాలేజీ నుంచి అడ్మిషన్లు చేయిస్తూ తమ కోచింగ్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

**కఠిన చర్యలు తీసుకోవాలి**

**మచ్చ రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి**

ఐఐటి నీట్ అకాడమీ పేరుతో ప్రచారం నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ తరగతుల నిర్వహణ చేస్తూ, అనుమతి ఒకచోట తరగతులు మరోచోట నిర్వహిస్తున్న ఇంటర్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇంటర్ బోర్డు అధికారుల అండదండలతోనే యజమాన్యాలు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయి. అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న కళాశాల యాజమాన్యాలపై చీటింగ్ కేసు నమోదు చేయాలి.

## నివేదిక సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

నేడు మధ్యాహ్నం రెండు గంటలకు జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో దీనిని పై చర్చించే అవకాశం సైతం ఉంది.

**కమిషన్ విచారణ సాగింది ఇలా...**

2014 మార్చి 14న ఇంజినీర్లు, నిపుణుల కమిటీలు, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సిడివో) ప్రతినిధులు, హైడ్రాలజీ విభాగం ఇంజినీర్లు తదితరులను విచారించింది. కమిషన్ విచారణలో భాగంగా నీటి పారుదల శాఖ ఇఎన్‌సి మురళీధర రావుతోపాటు ఐఎఎస్ అధికారులు రాహుల్ బొజ్జా, వికాస్ రాజ్, స్మిత సభర్వాల్, కె రామకృష్ణారావు, రిటైర్డ్ అధికారులు ఎస్.కె.జోషి, వి.నాగిరెడ్డి, రజత్ కుమార్, సోమేశ్ కుమార్‌లను కమిషన్ ముందు హాజరై అఫిడవిట్లు సమర్పించారు. ప్రభుత్వం గడువు విధించిన నాటికి విచారణ పూర్తి కాకపోవడంతో ఇదే క్రమంలో జస్టిస్ పిసి ఘోష్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం కమిషన్ పదవీకాలాన్ని ఆగస్టు 31వరకు పొడిగించింది. దీంతో విచారణను వేగవంతం చేసిన కమిషన్ నీటిపారుదల శాఖలోని మరింత అధికారులు,రిటైర్డ్ ఇంజనీర్లను క్రాస్ ఎగ్జామిన్ చేసింది. విచారణలో పలు అంశాలు వెలుగులోకి రావడంతో ప్రాజెక్ట్ మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎన్.వెంకటేశ్వర్లును కమిషన్ మరోసారి విచారించింది. ఇదే క్రమంలో కమిషన్ గడువును ప్రభుత్వం మూడోసారి మరో నెలలు పొడిగించగా, నీటిపారుదల శాఖకు చెందిన 18 మంది ఇంజనీర్లను కమిషన్ బ్యారేజీల ప్రాజెక్ట్ డిజైన్, కార్యకలాపాలు, నిర్వహణపై వారిని క్రాస్ఎగ్జామిన్ చేసింది. అయితే విచారణ మరింత కొనసాగించాల్సిన అవసరం ఏర్పడడంతో కమిషన్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం మూడోసారి కమిషన్ గడువును డిసెంబర్ 31 వరకు మళ్లీ పొడిగించింది. ఈసారి కమిషన్ ముందు హాజరై అప్పటికే అఫిడవిట్లను సమర్పించిన పలువురిని విచారించింది. అప్పటికి విచారణ పూర్తికాకపోవడంతో కమిషన్ పదవీకాలాన్ని 4వ సారి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు మళ్లీ పొడిగించారు.

విచారణ సమయంలో లేవనెత్తిన ప్రశ్నలకు సంబంధించి స్పష్టత కోసం మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, మాజీ నీటిపారుదల కార్యదర్శి స్మితా సభర్వాల్ కమిషన్ మరోసారి విచారించింది. ఈసారి కేంద్ర నిధుల సంస్థల నుండి తీసుకున్న నిధులు, రుణాల సమీకరణపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతోపాటు పలువురిని కమిషన్ విచారించింది. అయితే అప్పటికి విచారణ పూర్తి కాకపోవడం కమిషన్ గడువును ప్రభుత్వం మళ్ళీ ఐదవసారి ఏప్రిల్ 30వరకు పొడిగించారు. ఈసారి మరింత లోతుగావిచారించిన కమిషన్ అధికారుల నుంచి మరింత విషయాలను రాబట్టి ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది. దీంతో అధికారుల విచారణను దాదాపుగా పూర్తిచేసిన ప్రభుత్వం మరింత విచారణకు గాను సమయం కోరడంతో కమిషన్ గడువును జూన్ 30వరకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తుది దశగా జూన్ 5న మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, 6వ తేదీ మాజీ నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావునుల విచారించిన కమిషన్ జూన్ 11వ తేదీన మాజీ ముఖ్యమంత్రిని కమిషన్ విచారించింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి అన్ని నిర్ణయాలు మంత్రివర్గ సమావేశాల ఆమోదంతో తీసుకున్నట్లు వారంతా వెల్లడించడంతో కమిషన్ ఇందుకు సంబంధించి మినిట్స్‌ను అందజేయాలంటూ ప్రభుత్వానికి కమిషన్ లేఖ రాసింది.

దీంతో గత జూన్ 30వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం గత బిఆర్ఎస్ ప్రభుత్వహాయంలో జరిగిన మంత్రివర్గ సమావేశాలకు సంబంధించి మినిట్స్‌ను కమిషన్‌కు అందజేయడంతో వీటి పరిశీలనకు మరింత గడువు కోరడంతో కమిషన్ గడువును ఈనెల 31వరకు పొడిగించింది. ఇదే క్రమంలో తుది నివేదికను సిద్ధం చేసిన ఏకసభ్య కమిషన్ నేడు ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సమాచారం.

## రేవ్ పార్టీ (మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ కొండాపూర్‌కి తీసుకువచ్చి సర్వీస్ అపార్ట్‌మెంట్‌లలో రేవ్ పార్టీ నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం నాడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన కొంతమంది వ్యక్తులను అలాగే యువతులను తీసుకువచ్చి రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదరు అమ్మాయిలతో అసభ్యకర నృత్యాలు చేయిస్తూ, మందు, చిందు, డ్రగ్స్‌లలో మునిగిపోయారు. అయితే రేవ్ పార్టీ విషయమై శనివారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎక్సైజ్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ బిటీమ్ ఎస్ఐ సంధ్య బాలరాజు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో మొత్తం 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 2.080కేజీల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయిని, 11.57 గ్రాముల మ్యాజిక్ ముష్రూమ్, 1.91 గ్రాముల చెరస్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కార్లు, 11 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ప్రధాన నిందితులను ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వాసు, శివం రాయుడుగా పోలీసులు గుర్తించారు. వీరంతా ముఠాగా ఏర్పడి గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం సాగుస్తున్నారని ఎస్ఐ సంధ్య బాలరాజు తెలిపారు. డబ్బులుండి సరదాగా గడపాలని అనుకునే వారిని నిందితులు వారానికి రెండు రోజులపాటు హైదరాబాద్‌కు తీసుకువచ్చి ఎంజాయ్ చేయించి తీసుకెళ్తుంటారని చెప్పారు. పక్కా సమాచారం మేరకు వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేయగా 9 మందిని అరెస్ట్ చేశారు. కింగ్ కెన్ షేర్ రాహుల్ అనే వ్యక్తి డ్రగ్స్ తెప్పించే వాడన్నారు. పట్టుపడిన వారిలో నిర్వాహకుడు ప్రవీణ్ కుమార్ అలియాస్ మనెన, అశోక్ కుమార్, సమ్మెల సాయికృష్ణ, హిట్ జోసఫ్, తోట కుమారస్వామి, అడపా యశ్వంత్ శ్రీ దత్, నంద, సమతా, తేజ ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు మరో ముగ్గురిపైనా కేసు నమోదు చేశామని ఎస్ఐ సంధ్యా బాలరాజు చెప్పారు. నిందితులను పట్టుకున్న అనంతరం శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

## వ్యాఖ్యలు వాస్తవమే (మొదటి పేజీ తరువాయి)

సంబంధం పెట్టుకుంటామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికలకు ముందు నిజామాబాద్ సభలో మాట్లాడుతూ తాము వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని, వాటిని ప్రోత్సహించమని స్పష్టం చేశారన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం డిక్లరేషన్ బిల్లును తీసుకొచ్చిందని అన్నారు. రాష్ట్రంలో 27 శాతం రిజర్వేషన్లు బిసిలకు అమలవుతున్నాయని, అదనంగా వారికి 5 శాతం రిజర్వేషన్లు ఇస్తూ ఆ ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, అంటే తెలంగాణలో ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించబోతున్నారని అన్నారు. అలాంటప్పుడు అది బిసి డిక్లరేషన్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అది ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనే అని స్పష్టం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం తాము మత రిజర్వేషన్లకు విరుద్ధమన్నారు. నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌కు నిధులన్నీ కేంద్ర ప్రభుత్వానివేనని అన్నారు. రూ.23.75 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు.

## నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ధరలు పెంపు, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ తుది నివేదికను సిద్ధం చేసి సోమవారం ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందని సమాచారం. అయితే కమిషన్ నివేదికను సమర్పిస్తే ఆ నివేదికపై కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వవర్గాల సమాచారం. మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సిన పలు అంశాలపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ప్రభుత్వ కార్యదర్శులు అజెండా అంశాలను సాధారణ పరిపాలన విభాగానికి (జిఎడి)కి పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ రామకృష్ణరావు గత బుధవారం సర్క్యూలర్ జారీ చేశారు.

తొలుత నిర్ణయించిన ప్రకారం మంత్రివర్గ సమావేశం ఈ నెల 25వ తేదీనే జరగాల్సి ఉంది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పలువురు మంత్రులు వివిధ అధికారిక, పార్టీ కార్యక్రమాల నిమిత్తం రెండు రోజులపాటు ఢిల్లీలో పర్యటించడం వల్ల మంత్రివర్గ సమావేశం ఈ నెల 28వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసిన విషయం తెలిసిందే.



# జనరల్
STATE & REGIONAL NEWS

## స్వామికి 'గ్రీన్ అచీవ్‌మెంట్ అవార్డు-2025'



ప్రజాపక్షం/హైదరాబాద్: 'దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు చిలుక స్వామికి అమెరికా యూనివర్సిటీ 'గ్రీన్ అచీవ్ మెంట్ అవార్డు 2025 హానర్ ఆఫ్ డాక్టరేట్‌'ను ప్రదానం చేసింది. గోవాలో ఆదివారం యుఎస్ యూనివర్సిటీ పురస్కారోత్సవ కార్యక్రమంలో స్వామికి 'డాక్టరేట్'ను అందజేశారు. ఆలేరు మండలం షారాజిపేట గ్రామానికి చెంది న స్వామి రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే, గ్రామంలో ఎయిడ్స్ పట్ల అవ గాహన రక్తదానం, శ్రమదాన శిబి రాలు నిర్వహిస్తూ గ్రామ యువకులను చైతన్య పరుస్తు న్నారు. ఆయన సేవలను గుర్తించిన 'యుఎస్ యూని వర్సిటీ 'గ్రీన్ అచీవ్ మెంట్ అవార్డు 2025 హానర్ ఆఫ్ డాక్టరేట్ అందజేసింది. చిలుక స్వామి డాక్టరేట్ లభించడం పట్ల పలువురు రైల్వే ఉద్యోగులు, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో రాగల రెండు రోజులు భారీ వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాగల రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పలుచోట్ల బలమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు.

## సమాజాభివృద్ధి ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత

ప్రజలు బాధ్యతలను నిర్వర్తించకుండా హక్కులను అనుభవించలేరు
'హెచ్ఎన్ఎస్ చికిత్సాలయ్' ప్రారంభోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ప్రజాపక్షం/హైదరాబాద్: సమాజాన్ని అభివృద్ధి చేయడం సమాజంలోని ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. అందులో భాగంగా వివిధ వర్గాల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఎవరి శక్తి మేరకు వారు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. హర్యానా నాగరిక సంఘ్ (హెచ్ఎన్ఎస్) ప్రజలకు కనీస ఫీజులతో వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లో హర్యానా నాగరిక సంఘ్ (హెచ్ఎన్ఎస్) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'హెచ్ఎన్ఎస్ చికిత్సాలయ్'ను గవర్నర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ చికిత్సాలయ్ చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎంపి ఈటల రాజేందర్, హెచ్ఎన్ఎస్ అధ్యక్షులు పదమ్ జైన్, సలహాదారులు రామ్ గోయల్, హెచ్ఎన్ఎస్ చికిత్సాలయ్ అధ్యక్షులు పురుషోత్తం అగర్వాల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ సభ్యురాలు బి.నర్మద మల్లికార్జున్ తదితరులు ప్రసంగించారు. సభలో గవర్నర్ ప్రసంగిస్తూ సమాజం లేకుండా మానవుని మనుగడ అసాధ్యమని, సమాజం శక్తివంతంగా ఉంటే ప్రజలు శక్తివంతంగా ఉంటారన్నారు. దేశ ప్రగతికి వైద్య సేవలు పునాది లాంటివని, కులం, మతం, ప్రాంతం, భాష అనే బేధాలు లేకుండా ప్రజలందరికి వైద్య సేవలు అందాలన్నారు. రాజ్యాంగం ప్రకారం పౌరులందరికీ హక్కులు, విధులు ఉంటాయని, కానీ సమాజంలోని కొంత మంది తాము నిర్వర్తించే విధులను విస్మరిస్తూ హక్కులను మాత్రమే అడుగుతున్నారన్నారు. సమాజంలో ప్రజలు తమ విధులు, బాధ్యతలను నిర్వర్తించకుండా హక్కులను అనుభవించలేరని గవర్నర్ స్పష్టం చేశారు. అంజనీకుమార్ అగర్వాల్ మాట్లాడుతూ చికిత్సాలయ్‌లో హెచ్ఎన్ఎస్ సొసైటీ సభ్యులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారికి కనీస చార్జీలతో వైద్య పరీక్షలు, సేవలను అందించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం జారీచేసిన తెల్ల రేషన్ కార్డుదారులకు తమ చికిత్సాలయ్ ఉచితంగా వైద్య సేవలను అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. పురుషోత్తం అగర్వాల్ మాట్లాడుతూ భవిష్యత్తులో చికిత్సాలయ్‌లో మరిన్ని ఆధునాతన వైద్య సేవలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్.ఎన్.ఎస్ చికిత్సాలయ్ ప్రధాన కార్యదర్శి దీపక్ బింద్రాజ్ ఉపాధ్యక్షులు సుశీల్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి సందీప్ మిట్టల్, కోశాధికారి నారాయణ్ చౌదరి, హర్యాణా సేవా సంఘం అధ్యక్షులు రాజేందర్ అగర్వాల్ పాల్గొన్నారు.

## మానవ హక్కుల ఉల్లంఘన కేసులపై నేడు, రేపు విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో 109 మానవ హక్కుల ఉల్లంఘన కేసులను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి) సోమ, మంగళవారం రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ఆర్‌డిలో ప్రత్యేక బహిరంగ విచారణ చేపట్టనుంది. ఎన్‌హెచ్ఆర్‌సి ఛైర్‌పర్సన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్, సభ్యులు జస్టిస్ విద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సయానిలు సంబంధిత రాష్ట్ర అధికారుల సమక్షంలో కేసులను విచారించనున్నారు. ఈ విచారణకు ఎన్‌హెచ్ఆర్‌సి ప్రధాన కార్యదర్శి భరత్ లాల్, డైరెక్టర్ జనరల్(దర్యాప్తు) ఆర్‌పి మీనా, రిజిస్ట్రార్ (లా), జోగిందర్ సింగ్‌తో పాటు సీనియర్ అధికారులు హాజరుకానున్నారు. ప్రత్యేక విచారణ సందర్భంగా కేసుల్లో పోలీసుల అధికార దుర్వినియోగం, ప్రభుత్వం ఇచ్చే వివిధ సామాజిక సంక్షేమ పథకాల కింద ప్రయోజనాలను తిరస్కరించడం, జైలులో అక్రమాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన మానవ హక్కులను పరిరక్షించడంలో నిర్లక్ష్యం, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల హక్కులు ముఖ్యంగా గర్భిణులు, పాలు ఇచ్చే తల్లులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, అక్రమ రవాణా లాంటి పలు కేసులు ఉన్నాయి. అనంతరం ఈనెల 29న రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో ఎన్‌హెచ్ఆర్‌సి సమావేశం కానుంది. మానవ హక్కులకు సంబంధించిన వివిధ సమస్యలు, మానవ హక్కుల ఉల్లంఘన బాధితులకు త్వరిత గత న్యాయం అందించేందుకు ఉన్న ప్రాముఖ్యతపై వారికి అవగాహన కల్పించనుంది. అలాగే సమాజంలోని వివిధ వర్గాల సంక్షేమం ఎన్‌హెచ్ఆర్‌సి ఇచ్చిన వివిధ సలహాలపై రాష్ట్ర ప్రభుత్వం, అనుబంధ సంస్థలు తీసుకున్న క్రీయాశీల చర్యలను కూడా కమిషన్ సమీక్షించనుంది. అనంతరం మానవ హక్కుల సమస్యల విషయంలో పౌర సమాజ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో భేటీ కానుంది. గత వారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో విచారణ చేపట్టగా, గతంలో ఉత్తరప్రదేశ్, బీహార్, కర్నాటక, గుజరాత్, అస్సాం, మేఘాలయ, ఛత్తీస్‌ఘఢ్, మణిపూర్, మధ్యప్రదేశ్, పంజాబ్, కేరళ, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, అండమాన్‌నికోబార్, నాగాలాండ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మహారాష్ట్రలలో ఈ కార్యక్రమాలను నిర్వహించింది.

## వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి ఉత్తర తెలంగాణ అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలి

పౌర సమాజం, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్



ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపి ఒకే వరంగల్ జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఆదివారం హనుమకొండ నక్కలగుట్ట హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన చర్చా వేదికలో జాతీయ పార్టీల జిల్లాల నాయకులు, పుర ప్రముఖులు మేధావులు పాల్గొన్నారు. సభకు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అధ్యక్షత వహించగా పుల్లూరు సుధాకర్ ప్రారంభ ఉపన్యాసం చేస్తూ వరంగల్,హనుమకొండ రెండు పరస్పరం కలవాలని, రాజకీయ నాయకులు చొరవ చూపాలని అన్నారు. వరంగల్, హనుమకొండలు ఒకదాని అభివృద్ధితో మరొకటి ముడిపడి ఉన్నాయని చెప్పారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాను అభివృద్ధి కాకుండా రాజకీయ చైతన్యం ఎదగకుండా గత పాలకులు విభజించారని అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి వరంగల్ జిల్లాగా మార్చాలని ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వాలని మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వాసులు వరంగల్ జిల్లా గతం, వర్తమానం, భవిష్యత్తును గుర్తుంచుకోవాలని దాని రాజకీయ చైతన్యాన్ని ఉనికిని చరిత్రను అభివృద్ధి గతిని కాపాడుకోవాలని గత పాలకులు జిల్లాను ఆశాస్త్రీయంగా విభజించి అభివృద్ధిని అడ్డు కున్నారన్నారు. సీనియర్ రాజకీయ నాయకులు, సామాజిక విశ్లేషకులు కన్నెబోయిన రాజయ్య యాదవ్ మాట్లాడుతూ గత పాలకులు కొంటెతనంతో కుట్రబుద్ధితో వరంగల్ ఉమ్మడి జిల్లాను అశాస్త్రీయంగా విభజించి దీని సమగ్ర అభివృద్ధిని అడ్డుకున్నారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ పరిసరాల ప్రాంతాల్లో వివిధ రకాల పరిశ్రమలను అభివృద్ధి చేయాలని రెండు జిల్లాలను కలపాలని అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తున్నదని వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపడం ప్రజల కోరిక అని భాజపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్‌రెడ్డి అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలని న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు నూనె అప్పారావు అన్నారు. తెలంగాణ ఉద్యమ నాయకులు అడ్వకేట్ చిల్ల రాజేంద్రప్రసాద్, ప్రముఖ రచయిత తెలంగాణ మేధావి పొట్టపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరంగల్ జిల్లా ప్రాధాన్యతను పునరుద్ధరించాలనీ అన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ రెడ్ క్రాస్ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, సీపీఎం నాయకులు ఎం.చుక్కయ్య, ప్రముఖ విద్యావేత్త గంటా రామ్ రెడ్డి,రిటైర్డ్ అధ్యాపకులు బాబురావు, చరిత్రకారుడు ప్రొఫెసర్ విజయ బాబు, సామాజికవేత్తలు సోమ రామమూర్తి, సాయిని నరేందర్, చాపర్తి కుమార్, సీనియర్ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు అబూబకర్, డాక్టర్ చింతం ప్రవీణ్, రైతు సంఘం నాయకులు సోమిడి శ్రీనివాస్‌తో పాటు అనేకమంది ఉద్యమకారులు సామాజికవేత్తలు పాల్గొన్నారు.

## బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం
సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సమాజ మార్పు యువత వల్లే సాధ్యమని, నేటి యువత రేపటి రాజకీయ భవిష్యత్‌కు ఎంతైనా అవసరం అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. కేంద్రంలో అధికారాన్ని చెలాయిస్తున్న బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో గల శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ (మియా జానీ నగర్)లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభలు రెండో రోజు ఉత్తేజపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చీలికలు తెచ్చి హిందుత్వ ఎజెండాను దేశప్రజలపై బలంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రాజకీయాలను మోదీ సర్కార్ భ్రష్టు పట్టిస్తోందని, రాజకీయ పబ్బం గడుపుకునేందుకు స్వతంత్ర ప్రతిపత్తిగల ఎన్నికల సంఘాన్ని సైతం పావుగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థను కాపాడుకునేందుకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి వల్ల కమ్యూనిస్టులకు కూడా ప్రమాదం పొంచి ఉందని, అయినప్పటికీ దేనికీ భయపడకుండా అమరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని, పేదలు, కర్షకులు, కార్మికుల అభ్యున్నతి కోసం పుట్టిన కమ్యూనిస్టు పార్టీని, ఎర్రజెండాలను అంతమొందించడం ఎవరి తరం కాదని, నేడు ప్రపంచం మొత్తం కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తెరుగుతోందని చెప్పారు. రాజకీయాల్లో కూడా శాస్త్రసాంకేతిక రంగ పోకడలు పెరిగిపోయాయని, ఏఐ ప్రభావం విద్యా, వైద్యంతో పాటు తదితర అంశాల్లో ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. సోషల్ మీడియా ద్వారా బిజెపి వ్యూహాత్మకంగా అబద్దాలను నిజాలుగా ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చాలని చెప్పారు. జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఎకరాకు నీరందించాలన్నారు. పార్టీ ప్రజా సంఘాల నిర్మాణానికి ప్రజలతో మమేకమైన ముందుకు సాగాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా వ్యూహాలు రచించాలన్నారు.

**ప్రతీ కమ్యూనిస్టు సైనికునిగా పని చేయాలి**

ప్రతీ కమ్యూనిస్టు సైనికునిలా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బల్లోజు అయోధ్య అన్నారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో పునీతమైన పార్టీ సిపిఐ అన్నారు. ఆనాటి రోజుల్లో పార్టీని విస్తరించే క్రమంలో ప్రాణాలకు సైతం తెగించి పోరాటాలు చేశామని, భూస్వాములు, జమీందార్లకు వ్యతిరేకంగా నిలిచి పేదలకు భూములు పంచామని చెప్పారు. పార్టీ మండల కార్యదర్శులు, ప్రజాసంఘాల బాధ్యులు చర్చల్లో పాల్గొనగా తీర్మానాలు ఆమోదించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బలోజు అయోధ్య, ముత్యాల విశ్వనాథంతో పాటు కల్లూరి వెంకటేశ్వరావు, మున్నా లక్ష్మీకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సలీం, ఏపి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి మునీర్, దారయ్య, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, రావులపల్లి రవికుమార్, నరాటి ప్రసాద్ చంద్రా నరేంద్ర, చలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్, కమటం వెంకటేశ్వరావు, దుర్గరాశి వెంకన్న, గన్నెని రామకృష్ణ, విజయ్, సాయిబాబు, పూర్ణచంద్రరావు, రాహుల్, హరీష్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శిగా ఎస్‌కె.సాబీర్ పాషా తిరిగి ఎన్నిక



ప్రజాపక్షం/అశ్వారావుపేట : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా ఎస్‌కే సాబీర్ పాషా ఎన్నికయ్యారు. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హల్ (మియాజానీ నగర్)లో రెండవ రోజు ఆదివారం జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ 3వ మహాసభల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య సమక్షంలో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మహాసభలో సిపిఐ నూతన జిల్లా కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. 79 మంది కౌన్సిల్ సభ్యులు, 27 మంది కార్యవర్గ సభ్యులు మరో ముగ్గురు ఆహ్వానితులుగా 30 మందితో కార్యవర్గం మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

## కాంగ్రెస్ వైఖరితో తరలుతున్న కంపెనీలు

ప్రభుత్వ తీరుపై కెటిఆర్ ధ్వజం



ప్రజాపక్షం/పరకాల : దేశానికి తలమానికంగా ఉన్న వరంగల్‌లోని ఆజంజాహీ వస్త్ర పరిశ్రమలు దివాలా తీయించి అక్కడి భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అమ్ముకున్న కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం పరకాల పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలోని ఎంతోమంది చేనేత తయారీ కార్మికులు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు పొట్టచేత పట్టుకొని వలస వెళ్లిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధలను తీర్చడంలో భాగంగానే తెలంగాణలోని చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించి దేశం గర్వించదగ్గ రీతిలో పరకాల నియోజకవర్గంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వేలాది ఎకరాల భూమిని సేకరించి ఎన్నో విదేశీ కంపెనీలను కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు తీసుకురావడం జరిగిందని అన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు విరక్తి చెంది ఎన్నో కంపెనీలు తరలిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలోని ఐదువేల మంది మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి స్వశక్తితో ఉపాధి పొందేలా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఎంతోమంది రైతులు యూరియా బస్తాలు లేక ఇబ్బంది పడుతున్న విధానాన్ని చూసిన తరువాతనైనా బుద్ధి తెచ్చుకొని రైతులకు సకాలంలో యూరియాను అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

**ప్రజలు తిరగబడతారు జాగ్రత్త**

పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చేస్తున్న విధానాలతో ఆ పార్టీపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, వివిధ కార్పొరేషన్ల చెందిన మాజీ కార్పొరేషన్లు పాల్గొన్నారు.

### ఇంటికి వెళ్తే తప్పేంటి?



సిఎం రమేష్ ఇంటికి కెటిఆర్ లేదా తాను వెళ్తే తప్పు ఏమిటని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. తాను ఒక మిత్రునిగా సిఎం రమేష్ ఇంటికి వెళ్ళానని అన్నారు. సిసి టివి ఫుటేజ్‌లు తీస్తే సిఎం రమేష్ తన జీవితకాలంలో ఎక్కువగా చంద్రబాబు, సిఎం రేవంత్ రెడ్డి ఇంట్లోనే ఉంటారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, ఫైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, బూడిద భిక్షమయ్య గౌడ్, బిఆర్ఎస్ నేత చింతల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ తమను భయపెడితేనే బిజెపిలోకి వెళ్లామని, తాము ఎప్పటికీ చంద్రబాబు మనుషులమేనని స్వయాన సిఎం రమేష్ చెప్పినట్టు వివరించారు. కవిత జైలుకు వెళ్తే బెయిల్ ఇవ్వాల్సింది కోర్టు అని, అలాంటప్పుడు కవిత అరెస్ట్ విషయంలో బిజెపిలో బిఆర్ఎస్‌ను విలీనం చేస్తామని కెటిఆర్ ఎలా చెబుతారని జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో బిజెపి ఎంపి మధ్యవర్తిత్వం వహించిన విషయాన్ని కెటిఆర్ ముందే చెప్పారన్నారు. ఒక పథకం ప్రకారమే బిజెపి, చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి కలిసి డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. జైపాల్ రెడ్డికి ఉన్న మంచిపేరును తన ఖాతాలో వేసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్రానికి పనికొచ్చే పార్టీ కాదని, బిఆర్ఎస్, బిజెపి భావజాలం వేర్వేరుగా ఉంటుందన్నారు.

## కేటాయింపులు ఘనం - ఖర్చు పాక్షికం

గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి నాయక్
ఘనంగా ఖమ్మం జిల్లా ఏడవ మహాసభ



ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చేస్తున్నా ఖర్చు మాత్రం చేయలేకపోతున్నారని చాలా సందర్భాల్లో గిరిజన బడ్జెట్‌ను ఇతర శాఖలకు మళ్లిస్తున్నారని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్ ఆరోపించారు. ఆది నుంచి గిరిజనులకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో ఖర్చు చేయకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య ఏడవ జిల్లా మహాసభ ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. బోనోత్ భరత్, తేజావత్ కృష్ణ, అమరయ్య, బానోత్ జగన్, ఇర్పా సురేష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి గిరిజనులకు ఏదో ఒక రూపంలో అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక వర్గాలు వివక్ష ప్రదర్శిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పించాలని రామ్మూర్తి డిమాండ్ చేశారు. ఇప్పటికీ మౌలిక వసతులకు నోచుకోని అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయని వెంటనే మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించాలన్నారు. గిరిజనులు పోడు నరికి సాగు చేసుకుంటున్నారని పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ భూ హక్కు పత్రాలు అందజేయాలని, పాసు పుస్తకాలు జారీ చేసి రుణ సౌకర్యం కల్పించాలని రామ్మూర్తి కోరారు. మహాసభలో పేర్కొన్న డిమాండ్లకు అనుగుణంగా భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, జాగర్లమూడి రంజిత్, రామ్మూర్తి, బానోత్ బచ్చారావు, రిటైర్డ్ ఆర్డివో నునావత్ పాండురంగా, బానోత్ రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :**



ఏడవ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నునావత్ పాండురంగా, అధ్యక్షులుగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోడా వీరన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాంబాబులు ఎన్నికయ్యారు.

## బిఆర్ఎస్ నాయకులు డ్రామాలు ఆపండి

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బిఆర్ఎస్ నేతలు రాజకీయంగా ఎదుర్కొలేకనే ధైర్యం లేక డ్రామాలు ఆడుతున్నారని, ఇలాంటి డ్రామాలు ఆపాలని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ నేతలు ముఖ్యంగా మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డిలు క్యారెక్టర్ ఆర్టిస్టుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కృషి చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారని, రేవంత్‌రెడ్డితో మాజీ సిఎం కెసిఆర్‌ను పోల్చలేమన్నారు. కెసిఆర్ కంటే అనేక రెట్లు సిఎం రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం కోసం తెలంగాణ అభివృద్ధి కోసం పోరాడుతున్న నాయకుడని దేశమంతా గుర్తించిందన్నారు. కెటిఆర్‌కు స్వతంత్రంగా గుర్తింపు లేదని, గోబెల్స్ ప్రచారం చేయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మంత్రుల ఫోన్లు టాప్ చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించడంలో అర్థం లేదన్నారు.

## ఇంటికి వెళ్లారో లేదో? కెటిఆర్ చెప్పాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/హైదరాబాద్: బిజెపిలో బిఆర్ఎస్ పార్టీ విలీనం కోసం సిఎం రమేశ్ ఇంటికి వెళ్లారో లేదో కెటిఆర్ చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ ఎలాంటి వ్యక్తి అనేది రాష్ట్ర ప్రజలు గమనించాలని అన్నారు. బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేసేందుకు సిఎం రమేశ్ ఇంటికి వెళ్లారా, లేదా? అనే విషయంపై కెటిఆర్ స్పష్టంగా సమాధానం చెప్పాలన్నారు. 'కవితపై ఉన్న కేసులు ఎత్తివేస్తే బిజెపిలో బిఆర్ఎస్‌ను విలీనం చేస్తామని చెప్పారా, లేదా? బిఆర్ఎస్ ఒక అవినీతి పార్టీ అని, ఆ పార్టీని కలుపుకునేది లేదని బిజెపి అధజష్టానం చెప్పింది నిజం కాదా? పలు సామాజిక వర్గాలపై కెటిఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేయలేదా? అని ఆయన నిలదీశారు. ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించకుండా సిఎం రమేశ్ అడిగిన ప్రశ్నలకు కెటిఆర్ సమాధానం చెప్పాలన్నారు.

## ఉప్పొంగిన గోదారమ్మ..!

ప్రమాదకర స్థాయిలో ప్రవాహం, భక్తులకు హెచ్చరికలు..



ప్రజాపక్షం/బాసర : నిర్మల్ జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం బాసర వద్ద గోదావరి నది ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తోంది. గత వారం రోజులుగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో శనివారం నుంచి గోదావరి ప్రవాహం గణనీయంగా పెరిగింది. ఆదివారం నాటికి నది నిండుకుండలా మారి, అత్యంత వేగంగా ప్రవహిస్తోంది. ఈ పరిణామంతో బాసర సరస్వతి ఆలయానికి తరలివచ్చే భక్తులు, యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని ఆలయ అధికారులు సూచించారు. నిర్మల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సూచనల మేరకు,అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటికి రావద్దని, లోతట్టు ప్రాంతాలు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## పేకాట గుట్టురట్టు

### ఏడుగురు అరెస్ట్, నగదు, వాహనాలు స్వాధీనం

**ప్రజాపక్షం / మందమర్రి :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నామని పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం అందిన పక్కా సమాచారంతో శాంతినగర్ కాలనీలో గల శివ అనే వ్యక్తి ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.38,150 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పేకాట ఆడేందుకు స్థలాన్ని అనుమతించి కమీషన్ వసూలు చేస్తున్న ఇంటి యజమాని శివపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. పేకాటదారులైన కట్టా దుర్గారావు, దాసరి నర్సయ్య, పుదమ శివ, గరిక కుమార్, మేకల రాజశేఖర్, కట్టా రమణ, తన్నీరు రవిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. ఎస్ఐ రాజశేఖర్‌తో పాటు, ఎఎస్ఐ మిలింద్ కుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్, విశ్వనాథ్, కృష్ణ, చైతన్యలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి అభినందించారు.

## హెచ్ఐసిసిలో కిడ్స్ ఫ్యాషన్ వీక్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇండియా కిడ్స్ ఫ్యాషన్ వీక్ (ఐకెఎఫ్‌డబ్ల్యూ) ఆదివారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హెచ్ఐసిసిలో కిడ్స్ ఫ్యాషన్ షోను నిర్వహించింది. ఎనిమిది మంది డిజైనర్లు ఆరు వేర్వేరు స్లాట్‌లలో ఈ షోలో పాల్గొన్నారు. ఇండియా కిడ్స్ ఫ్యాషన్ వీక్ ఐకెఎఫ్‌డబ్ల్యూలో ప్రదర్శించారు. లక్ష్మి రెడ్డి డిజైనర్ కలెక్షన్ నిజంగా అత్యుత్తమ కలెక్షన్‌గా ఉందని పలువురు అభినందించారు. ఈ ఈవెంట్‌లో అహానా రెడ్డి మందుముల, ధీరన్ రెడ్డి రొక్కం షోస్టాపర్‌లుగా పాల్గొన్నారు.

## యూరియా సరఫరాలపై

# రామచంద్రరావువి అర్థం లేని మాటలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూరియా సరఫరాలపై రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచంద్రరావువి అర్థం లేని మాటలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక రాష్ట్రానికి పార్టీ అధ్యక్షుడుగా ఉంటూ వ్యవసాయరంగంపై కనీసం అవగాహన లేకుండా, ఎలాంటి నిజనిజాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల సరఫరాకు సంబంధించిన పూర్తి వివరాలతో ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు లేఖ రాశారు. కేంద్రం రాష్ట్రానికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసిందని చెప్పడం వారికి, వారి పార్టీకి తెలంగాణ రాష్ట్ర రైతాంగం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. రైతుల విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదని ఎన్నిసార్లు తాను విన్నవించిన, వారి వైఖరి మారకపోవడం సిగ్గుచేటాన్నారు. రాష్ట్ర ప్రజలు యూరియా కోసం తిప్పలు పడుతుంటే, వీరేమో చేయని గొప్పలు చేసినట్టుగా చెప్పుకుంటున్నారని, అది వారి అవివేకమని తెలిపారు. నిజానికి మన రాష్ట్రానికి కేంద్రం ఈ ఖరీఫ్ సీజన్ మొత్తానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయింపులు చేసిందని, ఇది కూడా తెలియకుండా 12లక్షలమెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసిందని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితువు పలికారు. ఇప్పటికే అనేక సార్లు లెక్కలతో సహా కేంద్ర రసాయన మంత్రికి, రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌లకు లేఖలు రాసిన విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

## దుబాయ్‌కి ఉద్యోగం కోసం వెళ్లితే..

## డ్రగ్స్ వలలో చిక్కిన మహిళ

### హైదరాబాద్‌లో కుటుంబ సభ్యుల ఆందోళన

### తమ కుమార్తెను సురక్షితంగా రప్పించాలని వేడుకోలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్యూటిపార్లర్‌లో ఉద్యోగం కోసం వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళా దుబాయి అంతర్జాతీయ విమానాశ్రాయంలో కస్టమ్స్ అధికారులకు డ్రగ్స్‌తో పట్టుబడింది. 65 రోజుల నుంచి ఆమె అక్కడి జైల్లోనే ఉది. ఈ విషయం హైదరాబాద్‌లో ఉన్న ఆమె కుటుంబ సభ్యులకు ఆదివారం తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కిషంబాగ్‌కు చెందిన అమీనా బేగం (24)కు దుబాయ్‌లోని బ్యూటీ పార్లర్‌లో ఉద్యోగం లభిస్తుందని హైదరాబాద్‌కు చెందిన ఒక ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ఆమె అంగీకారంతో మే 18న ఆమె దుబాయ్‌కి బయలుదేరింది. ప్రయాణ సమయంలో మరో వ్యక్తి ఇచ్చిన బ్యాగ్‌ను ఆమె తీసుకొని వెళ్లింది. అదే ఆమె చేసిన అతి పెద్ద తప్పు. అక్కడ కస్టమ్స్ అధికారులు ఆ బ్యాగ్‌లో డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించారు. ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్‌కు ఈ విషయాన్ని దృష్టికి తీసుకెళ్లారు. ఆమెకి డ్రగ్స్ గురించి అవగాహన లేకుండా బ్యాగ్ ఇచ్చారని అమీనా బేగం తల్లి పేర్కొంది. ఆమెకు ఉన్న 5 సంవత్సరాల కుమారుడు మొహమ్మద్ జీషాన్ ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తల్లీ చెప్పింది. తమ కూతురిని రక్షించి, ఎలాగైనా భరత్‌కు రప్పించాలని ఆమె తల్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది.

## అమ్మకానికి 'గౌరవ డాక్టరేట్లు'!

### రౌడీ షీటర్ల నుంచి ఉపాధ్యాయుల వరకూ కొనుగోలు దందా



**ప్రజాపక్షం/ మంచిర్యాల :** గౌరవ డాక్టరేట్ అనే పదానికి ఓ గౌరవం ఉంది. ఇది సాధారణంగా సాహిత్యం, కళలు, ప్రజాసేవ, విజ్ఞాన శాస్త్రం వంటి రంగాల్లో గొప్ప కృషి చేసిన వారిని గుర్తించి యూనివర్సిటీలు ప్రత్యేకంగా ప్రదానం చేసే పతకం. ఇది సంపాదించే పదవి కాదు, సంపాదించిన గౌరవం. నిజంగా సేవ చేసినవారికి ఇది అందితే ఆ గౌరవం పదిలంగా నిలుస్తుంది. కానీ ప్రస్తుతం గౌరవ డాక్టరేట్ విలువను కొన్ని సంస్థలు నాశనం చేస్తున్నాయి. కిందటి రెండు ఏళ్లగా జిల్లాలో గౌరవ డాక్టరేట్ పతకాలు అమ్మకానికి మారాయి. చాలా మంది పేరు చెప్పుకోలేని యూనివర్సిటీల పేరిట డాక్టరేట్ పట్టాలనుకొంటున్నారు. ఎంతటివారైనా సులువుగా డాక్టర్ అనే పదాన్ని ముందు పెట్టుకోవచ్చు. ఇందులో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఓ రౌడీ షీటర్ కూడా డాక్టరేట్ పట్టా పొందడం జరిగింది. అతనిని చూసి ఓ రాజకీయ నేత కూడా అదే రూట్ లో డాక్టర్ అయిపోయాడు. ప్రస్తుతం ఈ ట్రెండ్ పాఠశాలల యాజమాన్యాలు,ఉపాధ్యాయులు వైపు కూడా పాకుతోంది. తమ పేరుకు ముందు డాక్టర్ అన్న పదం ఉండాలని, తాము అందరికంటే గొప్పవారని చెప్పుకోవాలనే ఆలోచనతో కొందరు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇప్పుడు డాక్టరేట్ పట్టాల కోసం పోటీ పడుతున్నారు. కొన్ని సంస్థలు ఈ అవకాశాన్ని వాణిజ్యంగా మలుచుకుని 1.5 లక్షల నుంచి 3 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నాయి. ఇక ఉత్సాహంగా పెట్టుబడి పెట్టి డాక్టరేట్ పట్టా కొన్నవారు సోషల్ మీడియాలో డాక్టర్ పేరిట ప్రకటనలు పెడుతున్నారు.

### డాక్టర్ అనే పదానికి విలువ లేకుండా..?

గౌరవ డాక్టరేట్ అనేది నిజమైన ప్రజాసేవకులకు ఇవ్వాల్సిన గౌరవం. దాన్ని వ్యాపారంగా మార్చడం వల్ల పట్టాకు విలువ పోతోందని విద్యావేత్తలు మండిపడుతున్నారు. ఒరిజినల్ యూనివర్సిటీలను మోసం చేసే విధంగా ప్రైవేట్ సంస్థలు తనిఖీలకు గురికాకుండా నకిలీ గౌరవ డాక్టరేట్ పతకాలు పంపిణీ చేస్తున్నాయి. వాస్తవంగా గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలు ఇలాంటి వ్యవహారానికి పాల్పడవు. జిల్లాలో ఇప్పుడు డాక్టరేట్ కొనుగోలు దందా వేగంగా పెరుగుతోంది. ఇది ఆగకపోతే, నిజమైన కృషి చేసినవారికి ఇచ్చే గౌరవం నశించిపోతుందన్నది విద్యావర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.

### డాక్టరేట్ వెనక అసలు వాస్తవాలు..

గౌరవ డాక్టరేట్ అనేది పేద, ధనిక భేదం లేకుండా అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ఇవ్వాల్సిన గౌరవం. ప్రస్తుతం రూ. 1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ కొన్ని సంస్థలు డబ్బు తీసుకుని పట్టాలను ఇస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే ఒక్క రౌడీ షీటర్, ఒకరు రాజకీయ నాయకుడు, పలువురు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు గౌరవ డాక్టరేట్‌లు పొందారు. కొన్ని సంస్థలు ఆన్‌లైన్‌లోసర్టిఫికెట్‌లు పంపించడమే కాకుండా, ప్రత్యేక సభలు నిర్వహించి డాక్టరేట్ పట్టాలను పంపిణీ చేస్తున్నాయి. ఇది ఆగకపోతే, గౌరవ పతకాలకు మరింత అవమానం తప్పదు. విద్యా సంస్థలు, ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకోవాలన్నది విద్యావేత్తల డిమాండ్. గౌరవాన్ని డబ్బుతో కొనే ఈ పద్ధతిని ఇప్పుడు ఆపకపోతే, నిజమైన విలువలకు మరింత నష్టం జరుగుతుందని స్పష్టంగా చెబుతున్నారు.

## వాహనదారుడికి సహాయం చేసిన..

## కానిస్టేబుళ్లను సన్మానించిన ఎసిపి శంకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మానవతా సేవలో మెరిసిన మహంకాళి ట్రాఫిక్ పోలీస్ అధికారులను తెలియజేసిన నార్త్ జోన్ ట్రాఫిక్ ఎసిపి జి. శంకర్ రాజు ఆదివారం తన కార్యాలయంలో సన్మానించారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 25వ తేది సాయంత్రం సుమారు 19:30 గంటల ప్రాంతంలో గ్యాస్‌మండి ఎక్స్ రోడ్స్ వద్ద ఒక కారుకు అకస్మాత్తుగా టైర్లు పంక్చర్ అయ్యింది. అప్పుడు కుండపోత వర్షం పడుతుండగా, ఆ కుటుంబం సడెన్‌గా ఆపదలో చిక్కుకుంది. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మహంకాళి నుంచి ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉన్న ఇద్దరు అధికారులు ఎఆర్‌పిసిలు జకీర్ ఉద్దీన్, నవీన్ వెంటనే స్పందించి, వర్షాన్ని పట్టించుకోకుండా ఆ కుటుంబానికి సహాయంగా నిలిచారు. వారు స్వయంగా టైరు మార్చి ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా పరిస్థితిని నియంత్రించారు.



వారు చేసిన ఈ సేవ కేవలం విధి నిర్వహణ మాత్రమే కాకుండా మానవత్వంతో కూడిన స్పందన. ఈ సంఘటనను ప్రజాపక్షంలో ఫోటోలతో ప్రచురించిన విషయం తెల్సిందే. పోలీసింగ్‌లోని మానవతా ముద్రను ప్రజల ముందుంచింది. వీరి నిస్వార్థ సేవను గౌరవిస్తూ, ట్రాఫిక్I, నార్త్ జోన్‌కి చెందిన రాజు, ఆర్ ఎస్ఐ మహేశ్, జకీర్ ఉద్దీన్, నవీన్‌లను మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మహంకాళి పోలీస్ సిబ్బంది సమక్షంలో ఎసిపి శంకర్ సన్మానించారు. వీరి ధైర్యవంతమైన చర్యలు ప్రతి అధికారి, సిబ్బందికి ప్రేరణగా నిలుస్తాయని ఎసిపి శంకర్ అన్నారు.

## బిజెపి అధికార మదంతోనే

## ఢిల్లీలో ఇళ్ళ కూల్చివేతలు : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో పేదల ఇళ్ళు కూల్చివేత చర్యలపై కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.బిజెపి ప్రభుత్వానికి పేదల బాధలు, వారి ఆవేదన అర్థంచేసుకునే మనస్తత్వం లేదని, వారి సమస్యలు, ఆందోళన బిజెపి పాలకులకు పట్టడంలేదని విమర్శించారు. ఇళ్ళు కోల్పోతామని పేదలు ఎంతో ఆవేదన చెందుతుంటే ఇతరులబాధలుపట్టించుకోవాలని అధికారపార్టీకి ఎంతమాత్రం ఆలోచన లేదని, అధికారమదంతో నే వారు పేదల ఇళ్ళు కూల్చివేస్తున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. ఇటీవల ఢిల్లీలోని అశోక్ విహార్ ప్రాంతంలో రాహుల్‌గాంధీ పర్యటించారు. అక్కడ అనేకమంది ఇళ్ళను అధికారులు కూల్చివేశారు. ఆ దృశ్యాల వీడియోను రాహుల్‌గాంధీ షేర్ చేశారు. ''ఒక్కసారి ఊహించండి, తల్లిదండ్రులు, పిల్లలు,అన్నదమ్ములు ఉంటున్న ఇంటి పైకప్పును ఒక్కసారిగా కూల్చివేస్తే ఆ కుటుంబం ఎంతగాకలతచెందుతుందోఆలోచించండి,యావత్ కుటుంబం ఒక్క క్షణంలో నిరాశ్రయమైపోతుంది, ఆ బాధ వారికి (బిజెపి) తెలియడంలేదు, వందలాది పేద కుటుంబాలు ఢిల్లీలోని ఝుగ్గిస్ ప్రాంతంలో నివసిస్తున్నాయి,''అనిఎక్స్ వేదికగా ఆవేదనవ్యక్తం చేశారు. చిన్న చిన్న ఇళ్ళల్లో వాళ్ళు ఉంటున్నారనీ, యావత్ జీవితమంతా వారు ఆ ఇళ్ళల్లోనే గడుపుతుంటే,ఎంతమాత్రం మానవత్వంలేకుండా నిర్దాక్ష్యణ్యంగా వారి నివాసాలను కూల్చివేస్తున్నారనీ, వారు కూల్చివేసేది కేవలం ఇళ్ళను మాత్రమే కాదనీ, వారి కలలను కూల్చివేస్తున్నారని విమర్శించారు. ''ఇలాంటి పరిస్థితుల్లో మేంపేదలపక్షానగట్టిగానిలబడతాం,వారికి మద్ద తు ఇస్తాం, పోరాటం ఇళ్ళకోసం మాత్రమే కాదు, న్యాయం కోసం,మానవత్వంకోసంపోరాటం, మేం ముందు నిలబడి వారికోసం పోరాడతాం'' అని అన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?

# తక్షణమే రూ.6వేల కోట్ల ఫీజులు చెల్లించాలి

### విద్యార్థుల భారీ ప్రదర్శనలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** రాష్ట్రంలో 14లక్షల మంది కాలేజీ విద్యార్థులకు రూ.6వేల కోట్ల స్కాలర్ షిప్‌లు, ఫీజు బకాయిలు చెల్లించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఆదివారం రాష్ట్ర యువజన సంఘం నేతలు జిల్లపల్లి అంజి, నీలం వెంకటేశ్ అధ్యక్షతన వేలాది మంది విద్యార్థులు హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య హాజరై, మాట్లాడారు. ఎస్‌సి,ఎస్‌టి, బిసి విద్యార్థులకు విద్య అందించడం ప్రభుత్వాల రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 20 నెలలు కావొస్తున్నా ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంకు ఒక్క పైసా విదల్చలేదన్నారు. ఎపిలో ఫీజులకు రూ.3వేల కోట్లు రెండు దఫాలుగా విడుదల చేశారని గుర్తుచేశారు. కానీ, మన రాష్ట్రంలో ప్రభుత్వం విద్యార్థులకు ఫీజులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలాగాటమాడుతున్నదని మండిపడ్డారు. కాం ట్రాక్టర్లకు వందల కోట్లు కమీషన్లు ఇస్తున్న ప్రభుత్వం పేద పిల్లల చదువులకు డబ్బులు లేవా అని నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఫీజులకు రూ.6వేల కోట్లు అప్పు తెస్తే ఎవరైనా అడ్డుకొంటారా? అని ప్రశ్నించారు. ఫీజులు చెల్లించకొంటే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు నిలదీయాలన్నారు.కొత్తగా 100 బిసికాలేజీహాస్టళ్లు మంజూరు చేయాలని, 20 శాతం సీట్లు పెంచాలన్నారు.యువజన సంఘం నేతలు పగిళ్ల సతీశ్, మోడీ రామ్‌దేవ్, అనంతయ్య, నందగోపాల్, రాజేందర్, శివ, ఆశిష్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియాలో భారత సంతతి యువకుడిపై

# కత్తులతో దాడి

**మెల్‌బోర్న్ :** ఆస్ట్రేలియాలో భారత సంతతిపై జాత్యాహంకార దాడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. మెల్‌బోర్న్ నగరంలో సౌరభ్ ఆనంద్ అనే టీనేజ్ బోయ్‌పై ఐదుగురు వ్యక్తులు కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో సౌరభ్ ఆనంద్ ఎడమ చెయ్యి తెగి కింద పడింది. ఐతే తర్వాత ఆనంద్‌కు ఆసుపత్రిలో చికిత్స జరిగింది. తెగిపడిన అతడిచేతిని వైద్యులు అత్యవసర శస్త్రచికిత్సద్వారా తిరిగి అతికించారు. ఈ దాడికి సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 19వ తేదీన ఈ ఘటన జరిగింది. మెల్‌బోర్న్ సెంట్రల్ స్క్వేర్ షాపింగ్ సెంటర్‌లో ఉన్న ఆల్టోనా మెడౌస్ వద్ద ఒక ఫార్మసీలో మందులు తీసుకున్న ఆనంద్ ఇంటికి తిరిగి వెళుతుండగా ఐదుగురు దుండగులు అతడిపై కత్తులతో దాడి చేశారు. ఒకవైపు అతడిపై దాడిచేసుంటే, మరికొందరు ఆనంద్ జేబుల్లో చేతులుపెట్టి డబ్బుకోసం, ఇతర వస్తువులకోసం బాగా వెతికారు. అతడి ఫోన్ దొంగిలించుకుపోయారు. అతడి గొంతు కోసి చంపేందుకు ప్రయత్నం చేశారు. కానీ ఆనంద్ తీవ్రంగా ప్రతిఘటించడంతో అది సాధ్యం కాలేదు. అతడి తలకు పెద్ద గాయాలు తగిలాయి. ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో ఒక భారతీయ విద్యార్థిపై జాత్యాహంకార దాడి జరిగిన రోజునే సౌరభ్ ఆనంద్‌పై కూడా కత్తి దాడి జరిగింది. ఆనంద్‌పై దాడి కేసులో అనేకమంది యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో 14 ఏళ్ళ బాలుడు కూడా ఉన్నాడు. ఆనంద్‌పై దాడి కేసులో ఈ బాలుడికి వచ్చేనెల 15 వరకూ రిమాండ్ విధించారు. అదేవిధంగా 15 ఏళ్ళు వయసుగల మరో ఇద్దరు యువకులపై కూడా కేసులు నమోదు చేశారు. వీరందరినీ చిల్డ్రన్స్ కోర్టులో ప్రవేశపెట్టి విచారణ జరిపారు.

## 42శాతం బిసి రిజర్వేషన్లలో

# 10 శాతం ముస్లింలకు కేటాయిస్తే యుద్ధమే

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, ఎంపి డి.కె. అరుణ





**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేలాది మంది చదువుకున్న యువత నిరుద్యోగులుగా నోటిఫికేషన్ల కొరకు జాబ్ మేళాల కొరకై పట్టాలు చేత పట్టుకొని తిరుగుతున్నారని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హమీ జాబ్ క్యాలెండర్ ఏమైందని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి దాకా ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేత పత్రం విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు డిమాండు చేశారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ టీఆర్ఎస్ పార్టీల జాగీర్ కాదని పార్లమెంట్ లో తెలంగాణ బిల్లు సమయంలో టీఆర్ఎస్ పార్టీ కున్న ఇద్దరి ఎంపీలు కూడా ఓటింగ్‌లో పాల్గొనలేదని కాంగ్రెస్ పార్టీకి మెజార్టీలేకున్నా బీజేపీ పార్టీసంపూర్ణ మద్దతుతోనే బిల్లు పాస్ అయి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిందనే వి,యాన్ని గుర్తించుకోవాలని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆదివారం లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ మెంటేపల్లి పురుషోత్తరెడ్డి సమన్వయంతో వనపర్తి నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గద్వాల మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావుకి మర్రికుంట ఎకో పార్కు దగ్గర జిల్లా అధ్యక్షులు డి. నారాయణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ తీస్తూ ఛత్రపతి శివాజీ చౌరస్తాలో పట్టణ ప్రధాన కార్యదర్శి అరవింద్ నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, ఎంపీ డి.కె. అరుణమ్మ, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, ఎంపీ అభ్యర్థి శరత్ ప్రసాద్ , జిల్లా అధ్యక్షులు నారాయణను భారీ క్రేన్ ద్వారా గజమాలతో స్వాగతం పలికారు. రామచంద్రరావు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బీజేపీ కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తుందని , బీసీల 42 శాతం రిజర్వేషన్లలో ముస్లింలకు 10 శాతం ఇవ్వడం బీజేపీ పార్టీ వ్యతిరేకిస్తుందని, గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రిజర్వేషన్ ఇస్తేనే హైకోర్టు కొట్టి వేసిందని రాబోయే డబుల్ ఇంజన్ బీజేపీ ప్రభుత్వంలో ముస్లింలను కలపకుండా 42 శాతం రిజర్వేషన్ కేవలం బీసీలకే అమలు చేస్తామని హమీనిచ్చారు. ఎంపీ డి.కె. అరుణ మాట్లాడుతూ పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలని ఆర్థికంగా ఎదిగిన రోజే పేదరికం పోయి ఆర్థిక సమానత్వం సాధ్యమవుతుందని , ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వికసిద్భారత్ లక్ష్యంతో పేదలకు మహిళలకు యువకులకు రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విద్యారంగం వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పట్టణాలతో సమానంగా గ్రామాల అభివృద్ధిని కూడా అత్యధిక కేటాయిస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ పోతుగంటి రాములు, జాతీయ ఓబీసీ కమిషన్ , మాజీ సభ్యులు తల్లోజు ఆచారి , గత ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## గగనమార్గంలో పాలస్తీనియన్లకు

# జోర్డాన్, అరబ్ ఎమిరేట్స్ ఆహార సహాయం




**టెల్‌అవీవ్:** ఆకలితో అలమటించిపోతున్న గాజా ప్రజలకు జోర్డాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు గగనతల మార్గంలో గగనతల మార్గంలో ఆహార సరఫరాలు చేయడం ప్రారంభించాయి. రాయల్ జోర్డాన్ ఎయిర్‌ఫోర్స్ విభాగం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో కలిసి 25 టన్నుల ఆహారాన్ని, ఇతర మానవతా సహాయ సామాగ్రిని గాజాలో జారవిడిచే కార్యక్రమం ప్రారంభించిందని జోర్డాన్ ప్రభుత్వ టీవీ ఆదివారం నాడు ప్రకటించింది. అదేవిధంగా జోర్డాన్ నుండి 60 లారీలలో భూమార్గంలో నిత్యావసరాలు, ఆహారం కూడా సరఫరా కానున్నది. ఏ దేశమైనా గాజాలో బాధితులకోసం ఆహారాన్ని గగన మార్గం ద్వారా అందించవచ్చునని ఇజ్రాయెల్ శనివారం మధ్యాహ్నం ప్రకటించింది. దీంతో ఇంకా చుట్టుపక్కల పలు దేశాలు గాజాలో ప్రజలకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉంది. జోర్డాన్‌కు చెందిన సి–130 విమానాలు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యాయి. దీంతో గాజా ప్రజలు ఎంతో ఆసక్తితో, ఆశతో ఆకాశంకేసి చూస్తూ సహాయంకోసం పరుగులు తీస్తున్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలోకి సహాయాన్ని పంపిణీ చేసేందుకు కొత్త మార్గాలను కూడా అనుమతించడంతో ప్రజలు మానవతాసహాయాన్ని తీసుకువచ్చే లారీల కోసం వీధుల్లో పడిగాపులు పడుతున్నారు. వారిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఐతే గత ఏడాది కూడా ఇదే విధంగా సి–130 విమానాలు ఆహారాన్ని తెచ్చి గాజాలో వదిలిపెట్టాయి. ఒక ట్రిప్పుకు ఈ విమానాలు 12,500 మందికి సరిపడ భోజనాలను సరఫరా చేయగలుగుతాయి. గాజాలో మొత్తం 20 లక్షలమంది ప్రజలు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం విదేశాల నుండి వచ్చే ఆహార సహాయంపైనే ఆధారపడి బతుకుతున్నారు. ఈ విధంగా లెక్కవేస్తే ఒక్కరోజు గాజా ప్రజలకు భోజనం సమకూర్చడానికి 160 విమానాలలో ఆహారాన్ని తరలించాల్సి వస్తుంది. అదేవిధంగా గాజాలో ఉన్న ప్జలకు స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా చేయడం కోసం ఈజిప్టు నుండి ఒక కొత్త వాటర్ పైపులైను కూడా వేస్తారు. ఐతే ఈ నిర్మాణ కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సైన్యం తనిఖీ చేస్తుంది. ఆరు లక్షలమంది ప్రజలకు త్రాగునీరు సరఫరా చేయడానికి ఈ కొత్త పైపులైను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం జరిగింది. ఈ ఏర్పాట్లపట్ల గాజా ప్రజలు హర్షం ప్రకటిస్తున్నారు. వారంతా ప్రస్తుతం కొద్దిపాటి ఆనందంలో ఉన్నారు. ఈ ఆనందం శాశ్వతం కావాలని వారు కోరుకుంటున్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ధన్‌ఖడ్ రాజీనామాపై మాకేమీ తెలియదు : ఖర్గే



**న్యూఢిల్లీ :** జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడానికి అసలు కారణం ఏమిటో తనకు తెలియదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు.రాజీనామా విషయం ధన్‌ఖడ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మధ్యే ఉన్నందున నిజంగా ఏమి జరిగిందో మాజీ ఉపరాష్ట్రపతే చెప్పాల్సి ఉందని ఆయన అన్నారు. ఆదివారం ఖర్గే కర్నాటకలోని విజయ్‌పురలో మీడియాతో మాట్లాడారు. ధన్‌ఖడ్ ఎల్లప్పుడూ ప్రభుత్వం వైపు ఉండేవారని పేర్కొంటూ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ప్రతిపక్షం రైతులు, పేదల గురించి, విదేశాంగ విధాన సమస్యలపై, ఇతర అంశాలు లేవనెత్తడానికి ప్రయత్నించినప్పుడల్లా ఆయన ఎప్పుడూ అనుమతించలేదని అన్నారు. రైతులకు అనుకూలంగా మాట్లాడినందున ధన్‌ఖడ్ రాజీనామా చేయవలసి వచ్చిందా అనే ప్రశ్నకు సమాధానంగా ఖర్గే స్పందించారు. 'రైతులు, పేదలు, అంతర్జాతీయ సమస్యలు లేదా విదేశాంగ విధానానికి సంబంధించిన అనేక అంశాలను మేము లేవనెత్తినప్పుడు, ఆయన మాకు (రాజ్యసభలో దాని చైర్మన్‌గా) ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదు' అని అన్నారు.



## 13 ఏళ్ల తర్వాత.. తొలిసారి మాతోశ్రీలోకి అడుగుపెట్టిన రాజ్ థాక్రే

**ముంబయి :** మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) చీఫ్ రాజ్ థాక్రే 13 ఏళ్ల తర్వాత ఆదివారం తొలిసారి ముంబయిలోని మాతోశ్రీలోకి అడుగుపెట్టారు. శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సోదరులైన ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలు బాలాసాహెబ్ చిత్రం ముందు ఫొటో దిగారు. 'నా అన్నయ్య శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే పుట్టినరోజు సందర్భంగా, దివంగత గౌరవనీయ బాలాసాహెబ్ థాక్రే నివాసం అయిన మాతోశ్రీని సందర్శించా. శుభాకాంక్షలు తెలియజేశా' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎంఎస్‌ఎస్ నేతలు బాలా నందగావ్కర్, నితిన్ సర్దేశాయ్ కూడా రాజ్ థాక్రే వెంట ఉన్నారు. కాగా, రాజకీయ విభేదాల కారణంగా 2006లో మాతోశ్రీని రాజ్ థాక్రే వీడారు. ఆ తర్వాత మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) పార్టీని ఏర్పాటు చేశారు. 2012లో బాలాసాహెబ్ థాక్రే మరణించినప్పుడు చివరిసారి మాతోశ్రీకి ఆయన వచ్చారు. 13 ఏళ్ల తర్వాత తొలిసారి మాతోశ్రీని ఆయన సందర్శించారు. మరోవైపు మహారాష్ట్రలోని ప్రాథమిక స్కూళ్లలో తప్పనిసరిగా హిందీ భాషను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వివాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో మరాఠీ గుర్తింపు కోసం పోరాటంలో భాగంగా ఉద్ధవ్, రాజ్ థాక్రేలు రెండు దశాబ్దాల తర్వాత తొలిసారి ఒకే రాజకీయ వేదిక పైకి వచ్చారు. వర్లిలో జరిగిన విజయోత్సవ ర్యాలీలో కలిసి ప్రసంగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని వారిద్దరూ నిర్ణయించారు.

# అంతరిక్షరంగంలోకి 200 అంకుర సంస్థల ప్రవేశం

### శుభాంశు శుక్లా యాత్రతో పిల్లల్లో ఆసక్తి పెరిగింది
### 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంస



**న్యూఢిల్లీ:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్ళి వచ్చిన తర్వాత దేశంలోని విద్యార్థుల్లో విశ్వాంతరాళంపట్ల ఆసక్తి బాగా పెరిగిందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. అదేవిధంగా ఒక్క అంతరిక్షరంగంలోనే 200 పైగా అంకుర సంస్థలు వచ్చాయని అన్నారు. ఆకాశవాణి,దూరదర్శన్ నిర్వహిస్తున్న నెలవారీ మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారంనాడు ప్రసారమైంది. నెలవారీ ప్రసారమయ్యే ఈ 124వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ భారత్ గురించి తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా స్వయంసమృద్ధి సాధించే దిశగా ముందుకు ప్రయాణం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా దేశీయ పరిశ్రమలను అభివృద్ధి చేసుకుని, దేశీయ అవసరాలకోసం ఎవరిమీదా ఆధారపడకుండా దేశంలోనే అన్ని ఉత్పత్తులు తయారు చేసుకునేందుకు, ఆ దిశగా ఆలోచించి ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళే ఆత్మనిర్భర్ భారత్ ప్రాతిపదికపై ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున కొనసాగిస్తున్నామని చెప్పారు. గడచిన కొద్దివారాలుగా క్రీడలు, సంస్కృతి, శాస్త్రసాంకేతికరంగం ఏదైనా కావచ్చు ఈ రంగాలలో చాలా చాలా ఘటనలు జరిగాయని, భారతదేశం గర్వించదగిన పరిణామాలు సంభవించాయని చెప్పారు.

''ఇటీవలికాలంలో శుభాంశు శుక్లా రోదసీ యాత్ర గురించి యావత్ దేశం ఎడతెరపిలేకుండా మాట్లాడుకుంటున్నది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్ళిన శుక్లా తిరిగి సురక్షితంగా భూమికి చేరుకోగానే దేశ ప్రజలు సంతోషంలో ఓలలాడారు. ఎంతో స్ఫూర్తిని పొందారు. ముఖ్యంగా విద్యార్థులు విశ్వాంతరాళం గురించి తెలుసుకోవడానికి దృష్టి సారించారు. యావత్ దేశం శుక్లా యాత్రను గర్వకారణంగా భావించింది. ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నా, 2023 ఆగస్టునెలలో చంద్రయాన్–3 ఎంతో సురక్షితంగా చంద్రుడిపై దిగింది. దీంతో దేశంలో కొత్త ఆశలు చిగురించాయి. కొత్త ఆలోచనలకు రూపం దిద్దుకుంది. రోదసీ గురించి, శాస్త్రసాంకేతిక రంగాల గురించి కొత్తరకమైన ఆసక్తి విద్యార్థుల్లో పుట్టుకువచ్చింది, చిన్న చిన్న పిల్లలు కూడా ఇప్పుడు చెబుతున్నారు, మేం అంతరిక్షంలోకి వెళతాం అని. మేం కూడా చందమామ మీద కాలు మోపుతాం, మేం కూడా రోదసీ శాస్త్రవేత్తలమవుతాం'' అని పిల్లలు చెబుతున్నారు'' అని ప్రధానమంత్రి అన్నారు. 6 నుండి 12 వ తరగతి వరకూ చదుకునే విద్యార్థులకు ప్రేరణ కలిగించేందుకు కేంద్ర డిఎస్‌టి విభాగం ఏర్పాటు చేసిన ''ఇన్‌స్పైర్–మానక్ (లక్షలాదిమంది జాతి జనుల ఆలోచనల్లో ఉమ్మడి ఆశయాలను, ఉమ్మడి లక్ష్యాలను పెంపొందించే విజ్ఞాన కార్యక్రమం) అభియాన్ గురించి ప్రధానమంత్రి మోదీ ప్రస్తావిస్తూ, పిల్లల్లో ప్రచారం చేయడానికి, దేశ లక్ష్యాలను వారిలో నాటేందుకు ఇదొక ప్రచారంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ ఇన్‌స్పైర్–మానక్ కార్యక్రమం కింద ప్రతి పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి, ప్రతి విద్యార్థిలో సరికొత్త ఆలోచనలను పాదుగొల్పుతారని, చంద్రయాన్–3 తర్వాత ఇప్పటివరకూ లక్షలమంది పిల్లలు ఈ కార్యక్రమంలో చేరారని మోదీ చెప్పారు.

అదేవిధంగా రోదసీ విజ్ఞానంపై దేశంలో రోజు రోజుకూ ఆసక్తి పెరుగుతోందని, ఎంతోమంది ముందుకు వస్తున్నారని, అంతరిక్షరంగాన్ని జల్లెడపట్టేందుకు అనేక అంకుర సంస్థలు శరవేగంగా దేశంలో ఉద్భవిస్తున్నాయని చెప్పారు. గతంలో కేవలం 50 అంకుర సంస్థలు మాత్రమే అంతరిక్ష రంగంలో ఉండేవని, కానీ ఇప్పుడు 200కు పైగా అంకుర సంస్థలు వచ్చాయన్నారు. 21వ శతాబ్దం భారతదేశానిదేనని, సరికొత్త శక్తితో విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందుతోందని అన్నారు.

''కొద్దిరోజుల క్రితం మన విద్యార్థులు అంతర్జాతీయ రసాయన శాస్త్ర ఒలింపియాడ్‌లో పతకాలు గెలుచుకున్నారు, దేవేశ్ పంకజ్, కూచీ, దేవ్‌దత్ ప్రియదర్శి, ఉజ్వల్ కేసరి నలుగురూ భారత్‌కు కీర్తిప్రతిష్ఠలు తీసుకువచ్చారన్నారు. వచ్చేనెల ముంబైలో ఖగోళశాస్త్రంపై ఒలింపియాడ్ జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా యునెస్కో మనదేశంలోని 12 మరాఠా, తమిళనాడులలో ఫోర్టులను ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తించిందన్నారు. దేశంలో ఆగస్టు నెల విప్లవాలకు నిలయంగా ఉందన్నారు. 1908 ఆగస్టు 11న ఖుదీరామ్ బోస్ తన 18 ఏళ్ళ వయసులో బ్రిటిష్ వారిని ఎదిరించి ధైర్యంగా ఉరిశిక్షను అనుభవించాడని, అతడి ధైర్యానికి యావత్ దేశం దిగ్భ్రాంతి చెందిందనీ, అదేవిధంగా ఆగస్టు 1న లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వర్ధంతి జరుగుతుందని, ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవంకాగా, ఆగస్టు 8వ తేదీన మహాత్మాగాంధీ నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైందని గుర్తుచేశారు.

**జార్ఖండ్‌లో రైతులుగా మారిన నక్సలైట్లు**

మాజీ నక్సలైట్లు రైతులుగా పరివర్తన చెందడాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు. జార్ఖండ్‌లోని గుమ్లాజిల్లాలో ఒకప్పటి నక్సలైట్ తీవ్రవాదులు ఈనాడు రైతులుగా పరివర్తన చెందారని, హింసా మార్గాన్ని వారు వదిలిపెట్టి వ్యవసాయం చేస్తున్నారని, అభివృద్ధి అనే దీపం ఎన్నో సంక్లిష్టమైన సందర్భాలలో కూడా వెలుగుతుందనడానికి ఇదే ఒక పెద్ద ఉదాహరణ అని అన్నారు. పిటిఐ వార్తాసంస్థ జూన్ 27న ప్రచురించిన ''గన్స్ టూ గ్రిల్స్'' అనే ఈ కథనాన్ని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంగా ప్రముఖంగా ప్రస్తావించారు.హింసా మార్గాన్ని వదిలిపెట్టి జనజీవన స్రవంతిలోకి ప్రవేశించిన స్ఫూర్తిమంతమైన మాజీ నక్సలైటు ఓం ప్రకాశ్ సాహూ కథనాన్ని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. జార్ఖండ్ గుల్మాలని బసియా బ్లాక్ మావోయిస్టుల హింసాకాండకు ఒకప్పుడు ఎంతో ప్రసిద్ధి చెందిందని, భయంతో ఒకనాడు ప్రజలు గ్రామాలను వదిలి పారిపోయేవారని, ఉద్యోగాలు లేక యువకులు ఆ ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలిపోయేవారని అన్నారు. హింసా మార్గాన్ని వదిలిపెట్టాలని ఓం ప్రకాశ్ సాహూ నిర్ణయించుకున్న తర్వాత పరిస్థితులన్నీ మారిపోయాయన్నారు. ఒకప్పుడు తుపాకులు పట్టుకున్న సాహూ ఈనాడు జాలరి వలలు పట్టుకున్నాడన్నారు. 2002లో మాజీ నక్సలైటు జ్యోతి లక్రా కూడా ఆయుధాలు వదిలేసి ఈనాడు చేపల ఆహారం తయారు చేసే మిల్లు పెట్టుకుందని, ఏటా రూ.8 లక్షలు లాభాలు ఆమె సంపాదిస్తోందని చెప్పారు. ఈశ్వర్ గోప్ కూడా జనజీవన స్రవంతిలోకి వచ్చి చేపల చెరువుల ద్వారా ఏటా రూ.2.50 లక్షలు విలువైన ఎనిమిది క్వింటాళ్ళ చేపలు పండిస్తున్నారన్నారు.

# ఎస్‌ఐఆర్ పిటిషన్లపై నేడు 'సుప్రీం' విచారణ

**న్యూఢిల్లీ :** త్వరలోనే ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) చేపట్టాలన్న ఎన్నికల సంఘం (ఇసి)నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్ల బ్యాచ్‌పై సోమవారం (నేడు) సుప్రీంకోర్టు విచారణ జరుపనుంది. బిహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ఎస్‌ఐఆర్‌ను ఇసి సమర్థించుకున్న జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చీ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఈ విషయమై విచారణ చేపట్టనుంది. ఎస్‌ఐఆర్ ఓటర్ల జాబితా నుంచి అనర్హులైన వ్యక్తులను తొలగించడం ద్వారా ఎన్నికల స్వచ్ఛతను పెంచుతుందని ఎన్నికల సంఘం పేర్కొన్నది.జూన్ 24న ఎస్‌ఐఆర్‌ను నిర్దేశిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించుకుంటూ అన్ని ప్రధాన రాజకీయపార్టీలు పాల్గొన్నాయి అని, అర్హులైన ఓటర్లను చేరుకోవడానికి 1.5లక్షలకు పైగా బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించాయని పోల్ ప్యానెల్ పేర్కొంది. కానీ సుప్రీంకోర్టులో దానిని వ్యతిరేకిస్తున్నాయి. ఓటర్ల జాబితా నుంచి అనర్హులైన వ్యక్తులను తొలగించడవం ద్వార ఎన్నికల స్వచ్ఛతను స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పెంచుతున్నదని పలువురు రాజకీయ నాయకులు, పౌర సమాజం సభ్యులు, ఆర్గనైజేషన్లు సహా పిటిషనర్ల ఆరోపణలను ఎదుర్కోవడానికి దాఖలుచేసిన వివరణాత్మక అఫిడవిట్‌లో భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) పేర్కొన్నది. ఈ కేసులో ప్రధాన పిటిషనర్ అయిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) అనే ఎన్‌జిఓ తన రీజాయిండర్ అఫిడవిట్‌లో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఇఆర్‌ఓలు) విస్తృత, అనియంత్రిత విచక్షణతో ఉన్నారని, పర్యవసానంగా బిహార్ జనాభాలో గణనీయమైన భాగం ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని ఆరోపించింది. 2025 జూన్ 24న నాటి ఎస్‌ఐఆర్ ఉత్తర్వును రద్దుచేయలేదని, ఏకపక్షంగా, తగిన ప్రక్రియ లేకుండా



పౌరులు తమ ప్రతినిధులను ఎన్నుకోకుండా హక్కును కోల్పోతారని, తద్వారా దేశంలో స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలు ప్రజాస్వామ్యానికి అంతరాయం కలిగిస్తుందని పిటిషన్ దాఖలు చేసింది. 'ఇది రాజ్యాంగ నిర్మాణంలోని ప్రాథమిక అంశంలో భాగం' అని ఎన్‌జిఓ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తెలిపింది.

# జ్ఞానంలేని హక్కుల వల్ల ఉపయోగం లేదు

### భారత ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్



శ్రీనగర్ : జ్ఞానంలేని హక్కులు ప్రయోజనం లేనివని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ ఉద్ఘాటించారు. పౌరులకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించాల్సిన ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఆదివారం ఆయన ఇక్కడ జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) నార్త్‌జోన్ రీజియనల్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించారు. సిజెఐ ప్రసంగిస్తూ గతంలోని అసమానతలను సరిదిద్దాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అన్ని సమాజాలు సామరస్యంగా నివసించే పాత కశ్మీర్‌ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఈ దిశగా పనిచేస్తోందన్నారు. మేం 'నల్సా' పనిని దేశంలోని మారుమూల ప్రాంతాలకూ అది లడఖ్ కావచ్చు, ఈశాన్య లేదా రాజస్థాన్ కావచ్చని 'నల్సా' పని విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిజెఐ తెలిపారు. బాబాసాహెబ్ బిఆర్.అంబేద్కర్ ఒక వ్యక్తిఒక ఓటు ద్వారా రాజకీయ న్యాయాన్ని తీసుకొచ్చారని, రాజ్యాంగ రచయిత సామాజిక విభజన, ఒక కంపార్ట్‌మెంట్ నుంచి మరొక కంపార్ట్‌మెంట్‌కు వెళ్లడం ఎంత కష్టం అనే విషయం గురించి మాట్లాడారని సిజెఐ చెప్పారు. నేను నా స్థలానికి వచ్చినట్లు అనిపిస్తోంది. నాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలకు నేను కృతజ్ఞుడిని. నేను జమ్ము కశ్మీర్ లడఖ్‌లోని అన్ని ప్రాంతాలకూ వెళ్లాను. ఇక్కడి సూఫీ సాంప్రదాయం భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన లౌకికతను ప్రోత్సహిస్తోంది. అన్ని మతాల ప్రజలు ఇక్కడి దర్గాలు, దేవాలయాలు, ఇతర మతపరమైన స్థలాలను సందర్శిస్తుంటారని గవాయ్ చెప్పారు. లడఖ్, కశ్మీర్, జమ్ము నుంచి బార్ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై సిజెఐ మాట్లాడుతూ వీటిని పరిష్కరించే అధికారం తనకు లేనప్పటికీ కొలీజియం సహా సంబంధిత అధికారులకు తాను అదే విషయాన్ని తెలియజేస్తానని గవాయ్ భరోసా ఇచ్చారు.

# రాజ్యాంగాన్ని గౌరవించేవారు రాష్ట్రాలను 'యుటి'లుగా మార్చరు

### ఆర్టికల్ 370ని రద్దు చేసి బిజెపి సర్కార్ ఏం సాధించింది?



**న్యూఢిల్లీ :** దేశ రాజ్యాంగం గౌరవించబడాలంటే జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని, స్థానిక ప్రభుత్వం భద్రతా బాధ్యతలను నిర్వహిస్తే ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడిని నివారించవచ్చని ప్రముఖ రాజకీయ నాయకుడు, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఇది ఆశాజనకమైన ప్రశ్న కాదన్నారు. కేంద్ర పాలిత ప్రాంతంలో రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం పెరుగుతున్న డిమాండ్ గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా అబ్దుల్లా అన్నారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించేవారు రాష్ట్రాలను ఎప్పుడూ కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చరని, ఒక కేంద్రపాలిత ప్రాంతాన్ని రాష్ట్రంగా మారుస్తారని అన్నారు. ఇక్కడ విషాదం ఏమిటంటే బిజెపి సర్కార్ ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చిందని, దీంతో ఏమి సాధించిందని ప్రశ్నించారు. ఇటీవల ఫరూక్ అబ్దుల్లా పిటిఐతో మాట్లాడారు. ఆరు సంవత్సరాల క్రితం ఆగస్టు 5, 2019న ఆర్టికల్ 370 రద్దు చేయబడినప్పుడు ఉగ్రవాదం కనుమరుగవుతుందని వాగ్దానాలు చేశారని అబ్దుల్లా గుర్తు చేశారు. మరి ఉగ్రవాదం అదృశ్యమైందా లేదా అది పెరిగిందా అని నిలదీశారు. కేంద్రం పార్లమెంటులో దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జమ్ముకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా ప్రకటించబడుతుందని ప్రజలు ఆశిస్తున్నారని అబ్దుల్లా అన్నారు. ఇప్పటికే, అన్ని ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటులో కూడా తమ కోసం పోరాడుతున్నాయని, రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కోరుతూ ఖర్గే, రాహుల్ గాంధీ ఇటీవల ప్రధానమంత్రి (నరేంద్ర మోడీ)కి లేఖ రాయడం తెలిసిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తమకు వాగ్దానాలు చేసిందన్నారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా కూడా పనిచేసిన అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు రాష్ట్రాన్ని దిగజారుడు చేయడం వెనుక కేంద్రం ఉద్దేశ్యాన్ని ప్రశ్నించారు. జమ్ముకశ్మీర్‌ను విభజించి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా చేసి ఏమి సాధించారని, ఆర్టికల్ 370ని రద్దు చేసే సమయంలో ఉగ్రవాదం అంతమవుతుందని చెప్పారని, మరి అయిందా అని విమర్శించారు. ఇక ప్రస్తుత పరిస్థితిని తెలియజేస్తూ ఎన్నికైన ప్రభుత్వానికి భద్రత, పరిపాలనా విషయాలపై నియంత్రణ లేకపోవడం పట్ల అబ్దుల్లా విచారం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వం భద్రతా బాధ్యత వహించి ఉంటే ఇటీవలి పహల్గామ్ ఉగ్రవాద దాడిని నివారించవచ్చని అన్నారు. పహల్గామ్‌కు భద్రతా వైఫల్యాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ అంగీకరించడాన్ని ప్రస్తావిస్తూ, లెఫ్టినెంట్ గవర్నర్ తన వైఫల్యాన్ని అంగీకరించినందుకు సంతోషంగా ఉంది, అయితే ఆయన రాజీనామా చేసే ధైర్యం చేసి ఉండాలని సూచించారు. జమ్ముకశ్మీర్‌కు రాజ్యసభకు ఎన్నికను ఎందుకు నిరాకరించారని, అసెంబ్లీలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నా ఎన్నికల కమిషన్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. పార్టీలో అంతర్గత విభేదాల గురించి మాట్లాడటాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ తోసిపుచ్చారు. 'ఈ పార్టీ ప్రజాస్వామ్య పార్టీ. ఇది నిరంకుశ పార్టీగా మారిన బిజెపి లాంటిది కాదు. ఇక్కడ ప్రజలు తమకు కావలసినది మాట్లాడే హక్కు ఉంది' అని పార్టీ, శ్రీనగర్ ఎంపి అగా రుహుల్లా మెహదీ మధ్య అభిప్రాయ భేదం గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన అన్నారు. వేర్పాటువాద నాయకుడు బిలాల్ లోన్ ప్రధాన స్రవంతిలో చేరుతున్నట్లు ప్రకటించిన విషయం గురించి అడిగిన ప్రశ్నకు, జెకె భారతదేశంలో ఒక భాగమని వారు గ్రహించినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను అని ఆయన అన్నారు. సంవత్సరాల తరబడి అరణ్యంలో గడిపిన తర్వాత ఆ నాయకుడు ఇప్పుడు ప్రజల సంక్షేమానికి దోహదపడగలడని ఆశాభావం వ్యక్తం చేశారు.





# 'ఆపరేషన్ సిందూర్' తరువాత ఏమైంది!

### జరిగిన పరిణామాలను ఎత్తి చూపిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో సోమవారం నుంచి చర్చ జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఆదివారం చర్చకు నేపథ్యంగా మారిన ఘటనలను తిరిగి ప్రస్తావించింది. వాటిలో ముఖ్యమైనవి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంతో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని బెదిరించడం ద్వారా ఆపరేషన్ సిందూర్‌ను ఆపివేసినట్లు మే 10 నుండి 26 సార్లు పేర్కొన్నారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నామని, అయితే దీనిపై ఆలస్యం చేయకపోవడమే మంచిదని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ అకస్మాత్తుగా నిలిపివేసిన వెంటనే రెండు రోజులు పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరిచి చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. అయినా తమ డిమాండ్‌ను కేంద్ర సర్కార్ విస్మరించిందని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి ఏప్రిల్ 22న జరిగితే, ప్రత్యక్షంగా బాధ్యత వహించిన ఉగ్రవాదులపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ముష్కరులు పూంచ్ (డిసెంబర్ 2023), గంగాగిర్, గుల్మార్గ్ (అక్టోబర్ 2024) లలో గతంలో జరిగిన ఉగ్రవాద దాడులలో పాల్గొన్నట్లు నివేదికలు చెబుతున్నాయని రమేశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థన మేరకు ఏప్రిల్ 24నఖిలపక్ష సమావేశం ఏర్పాటు కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాకుండా, రక్షణ మంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగిందని, ఈ భేటీల ప్రతిపక్షాలు నిఘా లోపాలపై ప్రశ్నలు లేవనెత్తాయన్నారు. మే 30న, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఆపరేషన్ సిందూర్‌లో జరిగిన వ్యూహాత్మక తప్పిదాలపై సింగపూర్‌లో వెల్లడించారన్నారు. జూన్ 29, ఇండోనేషియాలోని భారత డిఫెన్స్ అటాచ్, గ్రూప్ కెప్టెన్ శివ్ కుమార్ మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ సమయంలో రాజకీయ నిర్ణయాలు సైనిక కార్యకలాపాలకు ఆటంకం కలిగించాయని చెప్పినట్లు జైరామ్ గుర్తుచేశారు. ఈనెల 4న, డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ పరంగా చైనాతో పోరాడిందన్నారు. 14న, పహల్గామ్ ఉగ్రవాద దాడులు నిస్సందేహంగా భద్రతా వైఫల్యమేనని జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బహిరంగంగా అంగీకరించారన్నారు. ఇక ట్రంప్ భారతదేశంతో వాణిజ్యాన్ని తెగతెంపులు చేసుకుంటానని బెదిరించడం ద్వారా ఆపరేషన్ సిందూర్‌ను ఆపివేసినట్లు మే 10 నుండి 26 సార్లు పేర్కొన్నారని రమేష్ ఎత్తి చూపారు. ఐదు ఫైటర్ జెట్‌లు కూలిపోయి ఉండవచ్చని కూడా ట్రంప్ పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు.

# గంగైకొండ చోళపురం ఆలయాన్ని సందర్శించిన ప్రధాని





**చెన్నై :** ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడు పర్యటనలో భాగంగా గంగైకొండ చోళపురం ఆలయాన్ని సందర్శించారు. ఆదివారం రాజేంద్ర చోళుడి జయంతి సందర్భంగా ఈ పర్యటన జరగడం విశేషం. మాల్దీవుల పర్యటన ముగించుకున్న ఆయన శనివారం రాత్రి తమిళనాడులోని తూత్తుకూడికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద శివాలయాల్లో ఒకటి గంగైకొండ చోళపురం ఆలయం. ఆదివారం ఉదయం స్వామి దర్శనానికి సంప్రదాయ పంచెకట్టులో ప్రధాని మోదీ వచ్చారు. ఆలయ పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి మోదీ హారతి ఇచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆది తిరువతైరై ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. తమిళనాడు పర్యటన సందర్భంగా రూ.450 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తూత్తుకూడి విమానాశ్రయంలో విస్తరించిన కొత్త టెర్మినల్‌ను కూడా శనివారం ప్రధాని మోదీ ప్రారంభించారు. రాష్ట్రంలో రూ.4,900 కోట్లతో పూర్తిచేసిన వివిధ రహదారులు, రైల్వే మార్గాలను ఆయన జాతికి అంకితం చేశారు.

# 13 రాష్ట్రాలలో 50 శాతం పిల్లలకు అంగన్‌వాడీ పోషకాహారం



న్యూఢిల్లీ: దేశంలోని 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉన్న 63 జిల్లాలలో 50 శాతం పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పోషకాహారాన్ని అందజేశారు. పార్లమెంటుకు సమర్పించిన పలు పత్రాల విశ్లేషణలో ఈ విషయం వెల్లడైంది. దేశంలో అనేక సంవత్సరాలపాటు పిల్లలకు సరైన పోషకాహారం గనుక లభించకపోతే స్టంటింగ్ సమస్య వస్తుంది. స్టంటింగ్ అనేది ఒకరకమైన అతి తీవ్రమైన పోషకాహార లోపం. చాలా తక్కువస్థాయిలో ఇలాంటి పిల్లల్లో పోషకాలు ఉంటాయి. ఇలాంటి పిల్లల్లో 30 నుండి 40 శాతం మేరకు అతి తీవ్రమైన పోషకాహార లోపం ఉన్నట్లు 199 జిల్లాలలో గుర్తించారు. అంగన్ వాడీలలలో ఇలాంటి తీవ్ర పోషకాహారలోపం ఉన్న 50 శాతం పిల్లల పేర్లు నమోదయ్యాయి. ఉత్తర ప్రదేశ్‌లోని 34 జిల్లాలలో కూడా ఈ తీవ్ర పోషకాహార లోపం పిల్లలు నమోదయ్యారు. ఈ విధంగా అతి తీవ్రస్థాయిలో పోషకాహారలోపం ఉన్న పిల్లలు మహారాష్ట్రలోని నందర్‌బార్‌లో 68.12 శాతం మంది అంగన్‌వాడీలలో నమోదయ్యారు. జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్భూంలో 66.27 శాతం పిల్లలు, ఉత్తర ప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో 59.48 శాతం పిల్లలు, మధ్యప్రదేశ్‌లోని శివపురిలో 58.20 శాతం, అసోంలోని బంగైగాఓన్‌లో 54.76 శాతం పిల్లలు అంగన్‌వాడీలలో పేర్లు నమోదు చేసుకున్నారని 2025 జూన్ నాటి స్త్రీ శిశు సంక్షేమాభివృద్ధి పోషణ్ ట్రాకర్ డేటా వెల్లడించింది. పైన పేర్కొన్న ఈ ప్రాంతాలలో పిల్లలు చాలా దారుణంగా పోషకాహారలోపంతో బాధపడుతున్నావారే. వారందరికి అంగన్‌వాడీల ద్వారా పోషకాహారాన్ని సమకూర్చారు.

ఉత్తర ప్రదేశ్‌లోని 34 జిల్లాలలో 50 శాతం పిల్లలకు ఈ అతి తీవ్రమైన పోషకాహారలోపం ఉంది. దేశంలోని ఈ జాబితాలో ఈ లోపం ఉన్న పిల్లలు ఎక్కువగా ఉన్నది ఈ ప్రాంతంలోనే.దేశవ్యాప్తంగా అంగన్‌వాడీల ద్వారా 8.19 కోట్లమంది ఆరేళ్ళలోపు పిల్లలను గుర్తించారు. వీరిలో 35.91 శాతం మంది అతితీవ్రమైన పోషకాహారలోపంతో బాధపడుతున్నవారే. అదేవిధంగా 6.5 శాతం మంది చాలా తక్కువ బరువుతో ఉన్న పిల్లలు ఉన్నారు. వీరిలో అతి తీవ్ర పోషకాహారలోపం ఎక్కువగా ఉందని స్త్రీశిశు సంక్షేమాభివృద్ధిశాఖ పత్రాలు తెలియజేశాయి.




# సాహిత్యంలో విప్లవాత్మక శక్తి.. మహాశ్వేతా దేవి


భారతీయ సాహిత్య చరిత్రలో మహాశ్వేతా దేవిది ముమ్మాటికీ తిరుగులేని స్థానమే. రాజకీయ చైతన్యాన్ని, వాస్తవిక చిత్రణను, సాహిత్య నైపుణ్యాన్ని ఒకే రేఖలో మలచి, ఒక విచిత్ర సంధానాన్ని సొంతం చేసుకుంది కాబట్టి, ఆమె పేరును సామాన్యంగా పేర్కొనడం అసాధ్యం. భారతీయ సాహిత్యంలో ఆమె ఓ విప్లవాత్మక శక్తి. రాజకీయ వైరుధ్యాలను... సైద్ధాంతిక విభేదాలను పక్కకుపెడితే, రచయిత్రిగా నవ సమాజ నిర్మాణాన్ని ఆమె చిత్తశుద్ధితో ఆకాంక్షించిన విషయం నిజం. అన్యాయపు నిశ్శబ్దాన్ని ఛేదించిన అక్షర శబ్దంగా మారిందనేది కూడా వాస్తవమే. మహాశ్వేతాదేవి రచనలలో శోషిత వర్గాల ప్రతిఘటన, సాహిత్య ప్రకటన విస్పష్టంగా వినిపిస్తాయి. సాధారణంగా సాహిత్యం అనేది సమాజానికి దర్పణమని అంటారు. కానీ, మహాశవ్వేతా దేవి రచనలు కేవలం ఒక అద్దం మాదిరికాకుండా, ఆయుధంగా మారుతాయి. ఆమె కలం నుంచి జాలువారిన ప్రతి పదం ఒక శస్త్రంగా రూపుదిద్దుకుంటుంది. సామాజిక చైతన్యానికి సాహిత్య స్వరూపం ఆమె. ఒక రకంగా, మహాశ్వేతాదేవి రచనలు ఒక నిర్దిష్ట సామాజిక పరిణామానికి స్పందనగా పుట్టాయి. 20వ శతాబ్దం మధ్య నాటి బెంగాల్ రాజకీయ, సామాజిక సంక్షోభం, ముఖ్యంగా నక్సల్బరీ ఉద్యమం, ఆదివాసీ ప్రతిఘటనలు, భూమి స్వాధీన పోరాటాలు ప్రేరణలయ్యాయి. అందుకే, ఆమె రచనలు విముక్తి వేదికలుగా, వంచిత వర్గాల జీవిత శబ్దాలుగా మారాయి. మహాశ్వేతా దేవి కేవలం వాస్తవికత పరిస్థితులను చిత్రించడంతో బాధ్యత తీరినట్టు భావించలేదు. ఆయా పరిస్థితులను ఆమె విశ్లేషించింది. స్వయంగా అనుభవిస్తున్నట్టు పాఠకుల మనస్సుల్లోకి జొప్పించగలిగింది. ఉదాహరణకు, 'ద్రౌపది' కథలోని దోప్డీపై పోలీసులు అత్యాచారం చేస్తారు. ఆ సందర్భాన్ని వివరిస్తూ, 'ఆమె నగ్నంగా ఉంది. కానీ, తలెత్తుకొని నిటారుగా నిల్చుంది' అంటూ, ఒక మహిళ తన శరీరం మీద జరిగిన హింసను ప్రతిఘటన శక్తిగా ఎలా మార్చుకుంటుందో వివరిస్తుంది. దోప్డీ నగ్న శరీరాన్ని దాస్యానికి సంకేతంగా కాకుండా, నిరాకరణకు నిలువెత్తు రూపంగా ఆవిష్కరిస్తుంది. అలాగే 'హజార్ చురాశిర్ మా' నవలలో, తల్లి పాత్ర ద్వారా విప్లవం కుటుంబ సంబంధాలను ఎలా ధ్వంసం చేస్తుందో, తల్లి ప్రేమ ఎలా విప్లవ బలిదానానికి మాధ్యమమవుతుందో రచయిత్రి మనకు చూపిస్తుంది. ఈ కోణంలో చూస్తే, మహాశ్వేతాదేవి ఆదివాసీలకు ప్రతినిధి మాదిరి కాకుండా, వారిలో ఒకరిగా కనిపిస్తుంది. బిర్సా ముండా, సిదూ కానూ, బషాయి టుడూ వంటి పాత్రలు... చరిత్రకు మిగిలిపోయిన శబ్దరహిత గాథలకు స్వరమిచ్చిన ఉదాహరణలు. 'అరణ్యేర్ అధికార్' నవలలో బిర్సా ముండా జీవిత కథను వర్ణిస్తూ, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొన్న ఆదివాసీ ప్రజా శక్తి ఎలా తయారైందో, చరిత్రను రాజకీయంగా తిరగరాసింది. మహాశ్వేతా దేవి రచనా శైలిని 'అశ్లీలతను తిరుగుబాటుగా మలచిన విప్లవ సాహిత్యం'గా పేర్కోవచ్చు. ఆమె రచనా విధానం మక్కువ కలిగించే మాధుర్యాన్ని కాక, క్రూరమైన నిజాన్ని తేలికగా చెప్పే శక్తితో నిండి ఉంటుంది. ఆమె వాక్య నిర్మాణం సహజమైనదైనా, అంతర్యం మాత్రం వధ్యశిలపై క్షణాలు లెక్కించే బలి పశువు ఆవేదనను ప్రకటిస్తునే ఉంటుంది. ఆమె సామాజిక యథార్థాన్ని అశ్లీలంగా చెప్పిందనే అపవాదును ఎదుర్కొంది. అయితే, శూలాల్లాంటి పదాల్లో బాధితుల మనోవేదనను, విముక్తి ప్రేరణను చూడాలి. మహిళలపై, ప్రత్యేకించి ఆదివాసీల మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, పెరుగుతున్న దమనకాండను పరిశీలించి, పరిశోధించింది కాబట్టే ఆమె రచనా శైలి మృదుత్వానికి విరుద్ధంగా, సమ్మెట పోటులా ఉంటుంది. కాబట్టే, మహాశ్వేతాదేవి రచనల్లో మహిళ పాత్రలను, బాధలోంచి బయలుదేరిన రౌద్ర శక్తులుగా వీక్షించవచ్చు. ఆమె కథలు మృదువుగా పలికే పల్లవులు కాదు.. అవి ఆక్రోశ పూరితమైన నినాదాలు. ఆమె తన రచనల ద్వారా, భాష, శబ్దం, శబ్దరహితత అన్నింటినీ ఒక ఆర్థిక రాజకీయ వ్యవస్థగా అన్వయించే ప్రయత్నం చేసింది. ఆదివాసీ ఉద్యమాల్లో ఆమె రచనలు ఆత్మగౌరవ ప్రతీకలు గా... పాత్రలు పాఠ్యాంశాలుగా మారాయి. ఆమె జీవిత మే ఒక సాహిత్య ఉద్యమం. 1926, జనవరి 14న జన్మించిన మహాశ్వేతా దేవి, 2016 జులై 28న తుదిశ్వాస విడిచింది. కానీ, నేటికీ ఆమె రచనలు శ్వాసిస్తునే ఉన్నాయి. ఆమె రచనలు కృతకంగా కాకుండా, ప్రజల నడుమ జీవించే పాత్రలతో సహజత్వానికి దగ్గరగా ఉంటాయి. ప్రజల నడుమ జీవించిన రచయిత్రి కాబట్టే, ఆమెకు ఉత్కృష్ట సాహిత్య సృష్టి సాధ్యమైంది. మహాశ్వేతాదేవి రచనలు శోభన పదాలతో అలంకరించబడిన కళాత్మక సాహిత్యం కాదు. అవి పేదరికపు శబ్దం.. శ్రమికుడి కేక.. మహిళ ధ్వని.. మానవాధికారాల బలవంతపు మౌనాన్ని ధ్వంసించే అస్త్రం. ఆమె రచనలు చదవడమంటే, చరిత్రను కొత్త కోణంలో చూడడం. ఆమె పాత్రలను అర్థం చేసుకోవడమంటే, విప్లవాన్ని మనసులో ఆవహించుకోవడం. మహాశ్వేతాదేవి భారతీయ సాహిత్యంలో ఓ విప్లవాత్మక శక్తి. ఆమె రచనలు సామాజిక న్యాయం, దళిత హక్కులు, ఆదివాసీల జీవితాలు, విప్లవ మార్గాలపై దృష్టి మరల్చాయి. నిజ జీవిత స్ఫూర్తితో, అనుభవాలతో కూడిన ఆమె రచనలు భారతీయ సామాజిక అవస్థలను ప్రశ్నించే ధైర్యాన్ని ఇస్తాయి. మహాశ్వేతా దేవి రచయిత్రిగా మాత్రమేగాక, సామాజిక కార్యకర్తగా, రాజకీయ న్యాయ ఉద్యమకారిణిగా బహుముఖ పాత్రలు పోషించింది. ఆమె రచనలు, ముఖ్యంగా నవలలు, కథలు, నాటకాలు, సమాజంలోని మౌలిక వర్గాల జీవితాలను కళ్ల ముందు ఉంచుతాయి. పాత్రలను చిత్రీకరించడంలో ఆమె చూపిన అద్భుత నైపుణ్యం పాఠకులను ఇట్టే ఆకట్టుకుంటుంది. ఆమె కథనాల్లోని యథార్థత, ఆవేశం, సమాజపట్ల విమర్శనాత్మక దృష్టికోణం తార్కిక చింతన చదువులకు కొత్త కోణాన్ని పరిచయం చేస్తాయి. వాస్తవాలను వెల్లడిస్తాయి. కర్తవ్యబోధ చేస్తాయి.


అణచివేతపై గళమెత్తిన రచయిత్రి జయంతి నేడు

### సామాజిక రచయిత్రి..

భారతీయ సాహిత్యంలో రచయిత్రులు వేలు.. లక్షల్లో ఉండవచ్చు. కానీ, బాధిత ప్రజలతో మమేకమై, వారి బాధగాథలను ప్రత్యక్షంగా చూసి... స్పందించి... అనుభవాలను అక్షరబద్ధం చేసిన లేదా చేస్తున్నవారు అతి కొద్దిమంది మాత్రమే. అలాంటి అరుదైన సామాజిక రచయిత్రుల్లో మహాశ్వేతా దేవిది గౌరవ ప్రదమైన స్థానం. జీవితానుభవాలే ఆమె రచనలకు బలమైన ఆధారాలు. ఆదివాసీల జీవితాన్ని స్వయంగా అనుభవించడం, వారి పోరాటాలను అక్షర బద్ధం చేయడం ఆమెకు సామాజిక రచయిత్రిగా ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఆమె రాసిన 'హజార్ చురాశిర్ మా' అనేది నక్సలైట్ ఉద్యమంలో మరణించిన యువకుడి తల్లి దృష్టికోణంలో సాగే నవల. ఆదివాసీలపై నిరాటంకంగా కొనసాగుతున్న దౌర్జన్యాలు.. తత్ఫలితంగా తలెత్తిన విప్లవం.. ఆ పంథాపట్టిన పిల్లల తల్లి పడే బాధ.. రాజ్యహింస వంటి కీలకాంశాలను అన్వయిస్తూ రచన కొనసాగుతుంది. అదే విధంగా 'ద్రౌపది' అనే రచన ఆదివాసీ యువతిగా ఉన్న దోప్డీ మెజెన్ అనే పాత్ర ద్వారా, సైనిక హింస, బలాత్కారం, మరియు తిరుగుబాటు శక్తిని ప్రతిబింబిస్తుంది. 'అరణ్యేర్ అధికార్' అంటూ 'ఎవరిది అడవి' అని ప్రశ్నిస్తుంది. ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా జీవితం ఆధారంగా మహాశ్వేతా దేవి ఈ నవల రాసింది. దీనికి 1979లో జ్ఞానపీఠ్ అవార్డు లభించింది. ఆమె రచనలు మితిమీరిన భావుకతను కాకుండా, మట్టి వాసనలతో కూడిన నిశిత వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. జాతి, వర్గ, లింగ వివక్షల దయనీయ రూపాన్ని తేటతెల్లం చేస్తాయి. ఆదివాసీ, శ్రమజీవి, మహిళల జీవన యథార్థం పరిస్థితులు.. ఘటనలు.. సమస్యలు.. కన్నీళ్లు.. అస్తిత్వ పోరాటాలు ఆమె రచనల్లో ప్రధాన వస్తువులు. నిర్లక్ష్యానికి గురైన, అణగారిన వర్గాల గురించి ఇంతలోతుగా అధ్యయనం చేసినవారు చాలా అరుదు. ఆ అధ్యయన సారాంశాన్ని అక్షరబద్ధం చేసిన వారు మరీ అరుదు. ఆమె పాత్రలు నిస్సహాయంగా కనపడినా, ఆఖరికి వారు తిరుగుబాటును ఎన్నుకుంటాయి. 'ద్రౌపది'లో నాయిక బాధితురాలు మాత్రమేకాదు. ప్రతికారేచ్ఛతో రగిలిపోయే నెగడుగా నిలబడే శక్తిమంతురాలిగా కూడా సాక్షాత్కరిస్తుంది. భారతీయ విద్యావ్యవస్థ, న్యాయ వ్యవస్థ, పోలీసు వ్యవస్థల శోషణాత్మక స్వరూపాన్ని ఆమె తన రచనల్లో సాధికారికంగా విశ్లేషిస్తుంది. లోపాలను ఎండగడుతుంది. సాహిత్యాన్ని సామాజిక మార్పు సాధనంగా మార్చిన మహాశ్వేతాదేవి రచనలు సామాజిక ఉద్యమాలలో ప్రేరణగా నిలుస్తాయి. ఆమె ప్రతి రచనలోనూ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సామాజిక రుగ్మతులు, దోపిడీ, అణచివేతలపై తిరుగుబాటు తప్పదనే సందేశం ఉంటుంది. ఆదివాసీ జీవితాలు, భాషలు, సంస్కృతి ఒకదానితో ఒకటి ఎలా ముడిపడుతున్నాయో చెప్పడంలో, సమకాలీన పరిస్థితులను వాటికి అన్వయించడంలో ఆమె నైపుణ్యం అనితర సాధ్యం. సాహిత్య రంగంలో ఉద్యమకారిణిగా పేరుపొందిన మహాశ్వేతా దేవికి పద్మశ్రీ (1986), పద్మవిభూషణ్ (2006), జ్ఞానపీఠ్ అవార్డు (1996) లభించాయి.

> మహాశ్వేతా దేవి కథలు చాలా విశిష్టమైనవి. భారతీయ సమాజంలో కుల, వర్గ దోపిడీ పీడనలకు ప్రత్యక్ష ప్రామాణికాలు. పిడికెడు సత్తు పిండి కోసం.. గుప్పెడు మెతుకుల కోసం.. కాసింత గంజి కోసం.. జానెడు నేల కోసం... తమను తాము వేలానికి పెట్టుకునే మనుషుల దైన్యానికి ప్రతీకలు. వీళ్లంతా బతకడం కోసం నిత్యం చస్తూ ఉంటారు. చస్తూ చస్తూ బతుకుతుంటారు.అస్తిత్వ పోరాటం సాగిస్తునే ఉంటారు. ఈ దుస్థితిని మహాశ్వేతా దేవి తన రచనల్లో కళ్లకుకడతారు. ఆమె సృష్టించిన పాత్రలు అన్యాయాన్ని ప్రతిఘటిస్తాయి. స్వేచ్ఛను చాటుతాయి. పోరాటాలకు సిద్ధమవుతాయి.




## చదవాల్సిన పుస్తకం


# 'అల్పజీవి' విశ్వరూపం

రావి శాస్త్రిగా లబ్ధప్రతిష్టుడైన అందరి వాడు... ఒక గాడికి కట్టాలంటే అందని వాడు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి కథకుడిగానేకాదు.. నవలా రచయితగా కూడా అద్భుతాలు సృష్టించగలడని 'అల్పజీవి' రుజువు చేస్తుంది. కథా రచయితగా ఎనలేని పేరుప్రఖ్యాతులు ఆర్జించిన రావి శాస్త్రి చాలా తక్కువ సంఖ్యలో నవలలు రాశారు. వాటిలో, నిస్సందేహంగా 'అల్పజీవి' అత్యద్భుతమైనది. తెలుగు సాహితీ రంగంలో విశ్వరూపమై వెలుగొందుతున్నది. 1952లో రచించిన ఈ నవలలో రావి శాస్త్రి దార్శనికత అడుగడుగునా కనిపిస్తునే ఉంటుంది. ఇందులోని కథానాయకుడు సుబ్బయ్య 'అల్పజీవి'. కొందరికి అతను ఏమీ చేతగాని చవటలా కనిపిస్తాడు. మరికొందరికి అమాయకుడిలా గోచరిస్తాడు. వెర్రిబాగులవాడన్న ముద్ర కూడా వేయించుకుంటాడు. 'లౌక్యం'గా పేర్కొనే 'బతకనేర్చినతనం' అతనికి లేదు. ప్రభుత్వ ఉద్యోగం... మంచి సీటు... కానీ, బల్లకింద చేయిపెట్టి సంపాదించడం తెలియదు. తోటి ఉద్యోగులు 'పిరికివాడు' అనే బిరుదు కూడా ఇచ్చేస్తారు. పుస్తకం చదువుతున్నంత సేపూ, మంచివాడికీ, పిరికివాడికీ మధ్య తేడా ఏమిటనే ప్రశ్న పాఠకుల మెదళ్లను తొలిచివేస్తునే ఉంటుంది. సుబ్బయ్య బావమరిది వెంకట్రావు మహాఘటికుడు. ఆస్తులు పోగొట్టుకున్నా 'గీర' తగ్గలేదు. అతను గురువయ్య దగ్గర అప్పు తీసుకోని, తిరిగి చెల్లించడు. వెంకట్రావు నుంచి డబ్బు రావన్న నిర్ధారణకు వచ్చిన గురువయ్య, బాకీ వసులు చేసుకోవడానికి 'అల్పజీవి' సుబ్బయ్యను వేధించడం మొదలు పెడతాడు. ఈ పరిణామంతో సుబ్బయ్యలో జరిగే సంఘర్షణే ఈ నవలకు ప్రాణం. 'చైతన్య స్రవంతి' ప్రక్రియలో కొనసాగే ఈ నవల పేరే కొత్తగానూ, ఆలోచనాత్మకంగానూ ఉంది. ఈ నవల గొప్పతనమంతా సుబ్బయ్య అంతర్మథనమే. ఒక్కొక్కసారి ఈ సుబ్బయ్య మీద మనకి జాలి కలుగుతుంది. అలాగే ఇంకొకసారి ఇతని చేత కాని తనం చూసి కోపం వస్తుంది. 'మంచితనం, పిరికితనం ఒకచోట ఉండలేవు' అంటాడు రచయిత. ఈ నవల మనుషుల జీవితాల్లోని వివిధ కోణాలను స్పృశిస్తుంది. పుస్తకం మొత్తం చదివిన తర్వాత మనకు ఎదురయ్యే ప్రశ్న 'అల్పజీవి' ఎవరు? ఈ ప్రశ్న సమాధానం వెతుక్కునే పని పాఠకుడిదే. పాఠకుడి మీదే వదిలేస్తారు రచయిత. ఒక మంచి పుస్తకాన్ని చదివిన అనుభూతిని మిగిల్చే 'అల్పజీవి' తప్పనిసరిగా చదాల్సిన పుస్తకాల్లో ఒకటి. ఇది మనిషి నైజాలను, జీవిత నిజాలను ఎత్తిచూపే కవాటం. దీని ద్వారా సమాజం మీద, మనషుల మనస్తత్వాల మీద రావి శాస్త్రి తక్కువ మాటల్లో గంభీరమైన ప్రశ్నలు సంధించారు. ఈ పుస్తకం చదువుతున్నప్పుడు, ఏదో ఒక దశలో కథానాయకుడి స్థానంలోకి చొచ్చుకుపోయి, ఏదో ఒకటి చేసేద్దామని అనుకోని పాఠకుడు ఉండడు.ఆటపాటల్లో కాలం గడపాల్సిన బాల్యంలోనే రావి శాస్త్రి రచనలు ప్రారంభించాడు. 13వ ఏట ప్రారంభమైన రావి శాస్త్రి రచనా ప్రస్థానం, సాహిత్యం పట్ల ఆసక్తి, 1993 నవంబర్ 10న, తన 71వ ఏట తుదిశ్వాస విడిచేవరకూ కొనసాగింది. 1953లో తన తొలి నవల 'అల్పజీవి'తో విశేష ఆదరణ పొందాడు. సామాజిక స్పృహతో ఆయన నవలా ప్రక్రియకు కొత్త రూపాన్నిచ్చారు. పతితులు, భ్రష్టులు, బాధాసర్పదష్టులకు ప్రతినిధిగా నిలబడడంలో శ్రీశ్రీ సరసనే ఉంటారు రావి శాస్త్రి. 'అల్పజీవి' నవలను శ్రీశ్రీ రాస్తే బాగుండేదని ఆయనే స్వయంగా అంటారు. శ్రీశ్రీది కవితా ఝరికాగా, రావి శాస్త్రిది కథా స్రవంతి. ఇద్దరూ సామాన్యుల పక్షాన నిలబడిన వారే. ధనిక, పెత్తందారీ వర్గాలు, ఆధిపత్య శక్తుల చేతిలో సగటు జీవి విలవిల్లాడే పరిస్థితులను నిరశించారు. అక్షరాలే ఆయుధంగా మలచి, పోరాటాలకు ఊపిరిపోశారు. పోలీసు వ్యవస్థలో లోపాలను, పాలక వర్గాలకు కొమ్ముకాస్తూ, సామాన్యుడిని వేధించే విధానాలను రావి శాస్త్రి సునిశితంగా విమర్శించారు. వాస్తవాలు తెలుసుకొని, మంచిచెడులను విశ్లేషించి, ప్రజలకు మార్గదర్శకం చేసినప్పుడే రచనలకు సార్థకత చేకూరుతుందని ఆయన అంటారు. తాను అనుసరించి చూపారు. తర్వాతి తరాల రచయితలకు మార్గదర్శకులయ్యారు. 'అల్పజీవి' నవల ఆయన కీర్తి ప్రతిష్టలను మరింత ఉన్నత స్థాయికి చేర్చింది.




# పాలస్తీనియన్ల ప్రతినిధి జకారియా

పాలస్తీనా కవి జకారియా మహమ్మద్ వ్యక్తి త్వం, సాహిత్యయాత్ర, స్వేచ్ఛ కోసం జరుగుతున్న ఉద్యమం పట్ల ఉన్న నిబద్ధత అతనికి ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టాయి. జకారియా లక్షలాది మంది పాలస్తీనియన్లకు ప్రతినిధి.. వారు ఎదుర్కొంటున్న అణచివేతను ప్రపంచ దృష్టికి తీసుకెళ్లే వారధి. స్వరాజ్య ఆశల పల్లకీని మోసిన కవి. కొన్ని దశాబ్దాలుగా పాలస్తీనా ఓ రగులుతున్న జ్వాల. దౌర్జన్యాలను ఎదుర్కొంటున్న భూభాగం. అక్కడ వీచేగాలి.. పారే నీరు.. మొలిచే గడ్డి... పెరిగే ప్రాణి... ప్రతిదీ ఆవేదనను అనుభవిస్తున్నవే. అటువంటి నిస్సహాయత, అణచివేత, పోరాటాన్ని తన కలం ద్వారా ప్రపంచానికి పరిచయం చేసినవారిలో జకారియా అగ్రస్థానంలో ఉంటాయి. పాలస్తీనా ప్రజల నమ్మకాన్ని, ఉద్యమ గాథలను కవిత్వంగా వ్యక్తీకరించిన ఆయన రచనలు అక్కడి సాహిత్యంలో ఒక శాశ్వత వెలుగు రేఖలా నిలిచిపోయాయి. నాబ్లస్ సమీపంలోని అల్ జావియాలో, 1951లో జన్మించిన జకారియా అక్కడి అనిశ్చిత పరిస్థితులపై స్పందించి, పాలకవర్గాల ఆగ్రహానికి గురై, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌కు వలస వెళ్లాడు. అక్కడ అరబిక్ లిటరేజర్‌లో పట్టాపొందాడు. సుమారు 25 సంవత్సరాల తర్వాత తిరిగి పాలస్తీనా భూభాగంలోకి అడుగుపెట్టిన అతను, 2023 ఆగస్టు 2న తుదిశ్వాస విడిచాడు. పాలస్తీనియన్ల ఆశలు... ఆకాంక్షలకు అక్షర రూపాన్నిచ్చిన జకారియాను ప్రజావేదనకు రాయబారిగా పేర్కొంటారు. పాలస్తీనా ప్రజల జీవితాన్ని దగ్గరగా గమనించిన జకారియా, రాజకీయ అణచివేతలు, ఇజ్రాయెల్ ఆధిపత్య వ్యతిరేక పోరాటాలు, శరణార్థ శిబిరాల్లో జీవితం వంటి అంశాలను తన కవిత్వంలో నిలిపారు. అతని రచనలు పాలస్తీనా ప్రజల బాధను, నిశ్శబ్దం వెనకున్న ఆక్రోశాన్ని వ్యక్తపరుస్తాయి. కవిత్వం ఆయనకు ఒక ఆయుధంగా, ప్రజల ఆశలకు ప్రతిరూపంగా మారింది. జకారియా కవితల్లో అధికంగా చిన్న వాక్యాలే కనిపిస్తాయి. కానీ వాటి లోతు మాత్రం అనంతం. జకారియా రాసిన తొమ్మిది కవితా సంకలనాలు, నాటికలతో కూడిన ఒక సంకలనం ఇటీవల విడుదలయ్యాయి. పాత్రికేయుడి గా, సంపాదకుడిగా, రచయితగా జకారియా భిన్న పాత్రలు పోషించినప్పటికీ, ప్రతి క్షణం పాలస్తీనియన్ల గురించే ఆలోచించాడు. వారి హక్కుల కోసమే గళం విప్పాడు. వారి ప్రతినిధిగా మారాడు. సమస్యలపై ఎలుగెత్తాడు. అందుకే ఆయన రచనలకు అంతటి ఆదరణ... ప్రత్యేకత.




### 'నేను నా ఇంటిని కోల్పోయాను

కానీ నా కలల్ని కాదు' అనే వాక్యాలే ఆయన శైలిని చెప్పగలవు. పాలస్తీనా ప్రజల సాంస్కృతిక గుర్తింపును నిలబెట్టేందుకు ఆయన కవిత్వం ఒక గొంతుగా మారింది. ప్రతి చెట్టు వద్ద ఒక కవిత.. ప్రతి రాయి వెనక ఒక కథ.. అనే రీతిలో జకారియా ప్రతి అంశాన్నీ తన రచనల్లో ఆవిష్కరించాడు. జకారియా కవిత్వం ఆవేదనను మాత్రమే వ్యక్తీకరించదు... అది మానవత్వాన్ని, నమ్మకాన్ని కూడా పోషిస్తుంది. పాలస్తీనా ఉద్యమాన్ని సరళంగా, కానీ లోతుగా ప్రపంచానికి పరిచయం చేసింది. అతని రచనలు జాతీయతను ప్రతిబింబించాయి. మానవ హక్కులను కూడా పద్యంలో బంధించాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, జకారియా లాంటి కవులు పాలస్తీనా ప్రజల గొంతులు. వారు చెప్పలేని బాధను, ఆశను, విరహాన్ని కవిత్వంగా ప్రపంచానికి అందించినవారు. పాలస్తీనా భూభాగంపై ఆటుపోట్లు తగ్గినప్పుడు కూడా జకారియా కవితలు మారుమూల శిబిరాల్లో, మూతపడిన తాళం గదుల్లో, ఆకలితో తేలిపోయిన హృదయాల్లో జీవించగలవు. ఆయన కవిత్వం స్వాతంత్ర్య ఆశకి ప్రతిరూపం.

# పీటర్ ర్యాబిట్‌కు 'ప్యాటర్' ప్రాణప్రతిష్ఠ

బాల సాహిత్యం అంటే ముందుగా గుర్తుకువచ్చే పుస్తకాల్లో ముందు వరుసను ఆక్రమిస్తుంది 'ది  ది ఆఫ్ పీటర్ ర్యాబిట్'. బాల సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన హెలెన్ బీయాట్రిక్స్ ప్యాటర్ ఈ పుస్తకాన్ని రాయడమేకాదు.... స్వయంగా అందమైన బొమ్మలు వేసి ప్రాణప్రతిష్ఠ చేసింది. 1866, జులై 28న లండన్ (ఇంగ్లాండ్)లో జన్మించిన ప్యాటర్, 1943, డిసెంబర్ 22న తుదిశ్వాస విడిచింది. వందేళ్లకుపైగా ప్యాటర్ రచనలు పిల్లల హృదయాలను అలరిస్తునే ఉన్నాయంటే, ఆమె శైలి, బొమ్మల తీరు ఎంత విలక్షణమైనవో ఊహించుకోవచ్చు. 1902లో విడుదలైన 'ది  ది ఆఫ్ పీటర్ ర్యాబిట్' ఆమెకు ఎనలేని కీర్తిప్రతిష్టలను సంపాదించిపెట్టింది. 'ది  ది ఆఫ్ జమీమా పడల్‌డక్', 'ది  ది ఆఫ్ టామ్ కిట్టెన్', 'ది  ది ఆఫ్ బెంజిమిన్ బన్నీ' తదితర రచనలు బాల సాహిత్యంలో మైలురాళ్లుగా నిలిచి ఉన్నాయి. ఈ రచనలన్నీ చిన్న పిల్లల మానసిక అభివృద్ధికి అనుగుణంగా, జంతువుల పాత్రలతో, బొమ్మలతో పాఠశాల వయస్సులో ఉన్న పిల్లలకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ప్యాటర్ స్వయంగా తన కథలకు అందమైన, ఆకర్షణీయమైన బొమ్మలను కూడా వేసేది. ఆమె బొమ్మల శైలిలో ప్రకృతి, పక్షులు, జంతువులు చాలా సహజంగా, చక్కగా ఉంటాయి. ప్యాటర్ స్వతఃగా ప్రకృతి ప్రేమికురాలు. లేక్ డిస్ట్రిక్ట్ ప్రాంతం అంటే ఆకు ఎంతో ఇష్టం. తన రచనల ద్వారా సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసి, ప్రకృతిని పరిరక్షించేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించింది. నేషనల్ ట్రస్ట్‌కు తనవంతు సహకారాన్ని అందించడం ద్వారా లేక్ డిస్ట్రిక్ట్ ప్రాంతాన్ని ఆక్రమణలు, కాలుష్యం నుంచి కాపాడగలిగింది. శాస్త్రీయ సూక్ష్మ జీవశాస్త్ర పరిశోధకురాలిగా కూడా రాణించింది. నేటికీ చాలా ప్రాంతాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కొనసాగుతునే ఉన్న పురుషాధిక్యత అప్పట్లో మరింత ప్రబలంగా ఉండేది. అందుకే, శాస్త్రవేత్తగా ఆమె ప్రతిభకు తగినంత గుర్తింపు రాలేదు. కానీ, రచయిత్రిగా మాత్రం ఆమె సామర్థ్యాన్ని ఎవరూ అడ్డుకోలేకపోయారు. అనేక టీవీ షోలు, కార్టూన్లు, సినిమాలకు స్ఫూర్తిదాయకమైన 'ది  ది ఆఫ్ పీటర్ ర్యాబిట్' నేటికీ అత్యుత్తమ బాల సాహిత్యంలో కిలకితురాయిగా వెలుగుతున్నది.



పిల్లల సాహిత్యంలో ఆధునిక శకానికి బీజం వేసిన ఒక గొప్ప రచయిత్రిగా ప్యాటర్ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 'పీటర్ ర్యాబిట్' కథ విషయానికి వస్తే, తల్లి నక్క, తన నాలుగు పిల్లలు, ఫ్లోప్సీ, మాప్సీ, కాటన్‌టేల్, పీటర్‌లతో సంతోషంగా ఉంటుంది. పొరపాటున కూడా మిస్టర్ మెక్‌గ్రెగర్ తోటలోకి వెళ్లకూడదని పిల్లలకు హితబోధ చేస్తుంది. స్కాట్‌లాండ్‌కు చెందిన మెక్‌గ్రెగర్ ఏ విధంగా కుందేళ్లను తన తోటలోకి రాకుండా అడ్డుకుంటాడో, అక్కడికి వెళ్లిన తన భర్త ఏ విధంగా చిక్కుకుపోయి, తిరిగి రాలేకపోయాడో వివరిస్తుంది. తల్లి మాటలు పట్టించుకోని పీటర్, తన సహజమైన కుతూహలంతో మెక్‌గ్రెగర్ తోటలోకి జారుకుంటాడు. అక్కడ తనకు ఇష్టమైన ముల్లంగి, క్యారెట్, బీన్స్ తింటూ, ఆనందిస్తుంటాడు. అయితే, మెక్‌గ్రెగర్ హఠాత్తుగా ప్రత్యక్షం కావడంతో, అక్కడి నుంచి తప్పించుకోవడానికి నానా తంటాలు పడతాడు. తోటలు పరుగులు తీస్తున్న క్రమంలో తన కోటు, బూట్లు కోల్పోతాడు. చివరికి ఒక ఎలుక సాయంతో తల్లి వద్దకు చేరుకుంటాడు. జరిగిన ఉదంతాన్ని తెలుసుకున్న తల్లి, ఆ రోజు రాత్రికి టీ మాత్రమే ఇస్తుంది. పీటర్ ఆ రోజు భోజనాన్ని కోల్పోతాడు. పెద్దల మాట వినకపోతే చిక్కుల్లో పడతారన్న నీతితో కథ ముగుస్తుంది. ప్యాటర్ స్వయంగా ఈ కథకు అందమైన బొమ్మలు వేసింది. నీలం రంగు కోటు వేసుకున్న నక్కగా పీటర్ పాత్ర ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈ కథ ఆధారంగా అనేక కార్టూన్లు, టీవీ షోలు, సినిమాలు వచ్చాయి. 2018లో 'పీటర్ ర్యాబిట్' అనే హాలీవుడ్ యానిమేటెడ్ మూవీ విడుదలైంది.

## ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం 2025 కోసం

## విమర్శా గ్రంథాలకు ఆహ్వానం

అరసం వరంగల్ శాఖ ప్రతి సంవత్సరం ఒక్కో సాహిత్య ప్రక్రియకు ఆచార్య వాసిరెడ్డి భాస్కర రావు స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే. 2025 సంవత్సరానికి గాను 'సాహిత్య విమర్శ'కు ప్రదానం చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో, సాహిత్య విమర్శనా గ్రంథాలను ఆహ్వానిస్తున్నారు.

నిబంధనలు

- ☞ 2021 జులై నుండి 2025 జూన్ మధ్యకాలంలో ప్రచురించినవై ఉండాలి.
- ☞ మొదటి ముద్రణలు మాత్రమే పంపాలి.
- ☞ ఒక్కో పుస్తకం నాలుగు ప్రతులు పంపాలి.
- ☞ అన్ని ప్రాంతాల వారు పంపవచ్చును.
- ☞ వివిధ రచయితల కూర్పు లేదా సంకలనాలు పంపరాదు.
- ☞ ప్రతులు చేరవలసిన చివరి తేది 31 ఆగస్టు.
- ☞ ఎంపికైన గ్రంథకర్త కు అక్టోబర్‌లో హనుమకొండలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో, శాలువా, జ్ఞాపికలతో పురస్కారాన్ని ప్రదానం చేసి, నగదు బహుమతి అందిస్తారు.
- ☞ పుస్తకాలు పంపవలసిన చిరునామా

**బూర భిక్షపతి**
**ఇంటి నెంబర్, 2–12–293/20**
**రోడ్ నెంబర్ 2B**
**విజయనగర్ కాలని, గోపాలపురం రోడ్డు**
**హనమకొండ 506009 (తెలంగాణ)**
**ఫోన్: 9866612712**

ఈ వారం కవితలు



## అమ్మా నీకు వందనం

వందనమమ్మా వందనం
అమ్మ నీకు వందనం
మా అమ్మ నీకు వందనం
పాదాభివందనం

పురిటి నొప్పులు తీసినావు
పురుడు నాకు పోసి నావు
మరో జన్మ ఎత్తి నీవు
జన్మ నాకు ఇచ్చినావు

అమ్మ నీకు వందనం
మా అమ్మ నీకు వందనం
పాలిచ్చి లాలిస్తూ..
ఒడినే ఉయ్యాల జేసి

కంటికి రెప్పలా కాపాడిన
తల్లివమ్మా
వందనమమ్మా వందనం
అమ్మ నీకు వందనం

తనువంతా ధారవోసి
కూటి కోసం పని జేసి
నీ ఆకలి సంపుకొని
నా ఆకలి తీర్చినావు

నీ ప్రేమ ఎంత త్యాగమో
నీ మనసు అంత అమోఘం
సుఖ మంటే తెలియకుండా
కష్టాలను ఈదినావునా

చదువుకు నీనగలు అమ్మి
ఫీజు కట్టి నావు అమ్మ నిన్ను
మరువలేను
నన్ను కడుపులో మోసినట్లు
నిన్ను గుండెలో దాచుకున్న
కలకాలం తల్చుకుంటూ..
చిరకాలం పూజిస్తా
అమ్మ నీకు వందనం
పాదాభివందనం

– చంద్రమోహన్ గౌడ్
9866510399

## సాధిద్దాం బిసిల స్వప్నం

పెంకు మీద రొట్టెల్లా కాల్చుకు తిన్నారు
గాని ఒక్కనాడు పెంకు గురించి ఆలోచించలె
బీసీల గురించి పట్టించుకోలే
అరిగిపోయినవి పెంకులు
రొట్టెలు తిన్న ఆరోగ్యంతో అన్నీ ఏలింద్రు

స్వాతంత్ర అమృతోత్సవాలు
ఘనంగా సంబరాలు
సబ్బండులకు స్థానం లేని
స్వాహా స్వాతంత్ర్యం !
కమీషన్లు డిక్లరేషన్లు రిపోర్టులు

తీర్మానాలన్నీ పాడెలమీదే!
రిజర్వేషన్లు నువ్వు తగ్గించావంటే
నువ్వు వంచించావంటే
నువ్వు ముంచావంటే
నువ్వే కుండగొట్టావంటే
ఒకరి మీద ఒకరు దుమ్ముపోసుకోవడమే

గానిదగ్గరికి తీసింది లేదు
సత్యహరిచంద్ర నాటకం కన్నా
బిసి నాటకమే ఎక్కువ

అత్యున్నత అవార్డుకు ఎంపికైన
బిసి రిజర్వేషన్ల నాటకం!
పిల్ల పుట్టనేలేదు కుల్లలు కట్టింద్రు
మొగ్గలు విచ్చుకోనేలేదు మొగులుకు గుల్లాలు
సన్నాసుల సన్మానాలు
రాముడికి హనుమంతునిలా
పటేల్ పట్వారీలకు కావలి కారులా

బిసిల సేవలు జంగిడిలా మలుపుకున్నారు
బిసిలు అంటేబానిసలు కాదు బహుజనంనే
ను సంజీవ పర్వతం ఎత్తకపోతే
మీ రామాయణానికి చోటే లేదు
నేను కలం పట్టకపోతే భారతానికి పుట్టుకెక్కడిది
నేను బొటనవేలు ఇవ్వకుంటే నువ్వు
యుద్ధంలో గెలిచేవాడా అర్జునుడు

అభినందనలు అందుకునే వాడా?
రామా !ఇదేం నీతి
మనమంతా హిందువులం
గంగా, సింధు బిందువులం
అరిచి అరిచి ఎదలు అలిసినవి
మేఘాలు కమ్ముకున్న ప్రతిసారి
ఎక్కడేసిన గొంగడి ఆడ్నే వుంది
బిసిలం హిందువులం కామా

'మమ్మల్ని అడగలేదు 'మమ్మల్ని అడుగుతేనే
9వ షెడ్యూలుకు తోరణం కడ్తాం?
కాషాయంలో కులఅహంకారం
శూద్రులు రాజకీయాలకు శాపమా
బిసిల కన్నీళ్ళు కన్నీళ్లు కావా
బిసిలెప్పుడు మీ కుర్చీలకు కాళ్లేనా
ఇడబ్ల్యుఎస్‌లో ఎవరిని అడిగి
పదిశాతం పెట్టింద్రు
వంచించడానికి అమోదాలుంటాయి
కులగణన క్రెడిట్ నాదేనంటూ
బోనాలెత్తి డోళ్లు కొట్టి డొల్లయింద్రు
అమ్మవారికి బోనం ఎక్కముందే
నైవేధ్యం పులసింది !
నోటికాడి కూటికుండను పగులగొట్టిన
కుట్రలన్నీ బొందపెడ్తాం సాధిస్తాం
బిసిల స్వప్నాలను

– వనపట్ల సుబ్బయ్య
9492765358

## మిర్యాలగూడ సమగ్రాభివృద్ధే నా కర్తవ్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ సమగ్రాభివృద్ధే తన ముందున్న కర్తవ్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న స్పెషల్ డ్రైవ్ పనులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అన్ని రంగాల్లో మిర్యాలగూడను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రజలకు తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు వ్యర్థాలను ఆరుబయట వేయవద్దని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ విషసర్పాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## మహాసభలకు వేలాదిగా తరలుదాం



**ప్రజాపక్షం/ఆలేరు :** ఈనెల 29న వలిగొండలో జరిగే యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ నాలుగోవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆలేరు పట్టణంలో జరిగిన ఆ పార్టీ సమావేశం పోతు ప్రవీణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాసభలలో యాదాద్రి జిల్లాలో నెలకొన్న సమస్యలపై ప్రణాళిక తయారుచేసి సమస్యల పరిష్కారం కై ఉద్యమిస్తామన్నారు. మహాసభలకు మీలాదిగా తరలి వెళ్లి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బుజ్జి శంకరయ్య, పోతే భవాని, యాట ఉపేందర్, యాదమ్మ, ఉన్న బోయిన రవి, సరిత,మహేందర్, ప్రశాంతం ఉన్నారు.



## రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గత ఉమ్మడి రాష్ట్రంలో కార్డుదారులకు కేవలం నాలుగు కిలోల బియ్యంమాత్రమే అందేవనిన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ కెసిఆర్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 6.47 లక్షల కార్డులను పంపిణీ చేసి, ప్రతి లబ్ధిదారునికి ఆరుకిలోల బియ్యం అందజేయడం జరిగిందన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు దారులు ఎక్కడ ఉంటే అక్కడ రేషన్ తీసుకునే వెసులుబాటు కూడా తమ ప్రభుత్వంలో కల్పించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తే ప్రభుత్వాన్ని తప్పక అభినందిస్తామన్నారు. మహిళలకు రూ. 2500 మహాలక్ష్మి పథకం ద్వారా అందిస్తామని చెప్పి ఎందుకు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. రైతుబంధు రెండుసార్లు ఎగొట్టారని అన్నారు. నిరుద్యోగభృతి, మహిళలకు స్కూటీలు ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డు దారులు ప్రభుత్వం అందజేసిన కార్డుల ద్వారా సన్నబియ్యం పొంది తమ ఆకలి తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ పాల్గొన్నారు.

## రుచి కరమైన ఆహారాన్ని పెడుతున్నారా?

### గిరిజన కళాశాల వసతిగృహన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పట్టణంలోని గిరిజన కళాశాల వసతిగృహన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం గిరిజన కళాశాల వసతి గృహాన్ని సందర్శించి హాస్టల్ గల వంటశాల గదిని పరిశీలించారు. వంట సామగ్రిని శుభ్రంగా కడిగి వండాలన్నారు. వంటకు అవసరమైన రేషన్ సరుకులను పరిశీలించారు. నాణ్యమైన సరుకులనే వాడాలన్నారు. పండిన ఆహారాన్ని పరిశీలించడం జరిగింది. మెనూ ప్రకారం విద్యార్థులకి అందించే భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ రుచి కరమైన ఆహారాన్ని పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మీ హాస్టల్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పచ్చని చెట్లే ప్రగతికి మెట్లని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో శ్రీ సత్య సాయి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేమతరవు (మొక్కలు) నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మార్కెట్ సెక్రటరీ ముక్రంతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. కోట్ల రూపాయలతో ప్రభుత్వాలు మొక్కలు నాటుతున్న వాటిని పరిరక్షించడం అధికారులు, ప్రజలందరి బాధ్యత అన్నారు. మానవునికి కావలసిన ఆక్సిజన్ తో పాటు, ఆరోగ్యాలను కూడా మొక్కల ద్వారా అందింపబడుతుందని, అదేవిధంగా ఆ ప్రాంతం కూడా అన్ని విధాల బావుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షులు వంకాయల సుబ్బారావు, జిల్లా యూత్ కోఆర్డినేటర్ శర్విరాల రాంబాబు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, నాయకులు మల్లేష్, వాసు, సాయినేత, మార్కెట్ కమిటీ సభ్యులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఆశావహులకు రిజర్వేషన్లు కలిసొచ్చేనా...

### ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలో ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్‌లకు పదవి కాలం సర్పంచ్‌లకు 2024 ఫిబ్రవరిలో, జెడ్పిటిసి, ఎంపిటిసిలకు 2024 జూలైలో పదవి కాలం ముగిసింది. దీంతో గ్రామాలలకు అప్పటి నుండి ఇప్పటి వరకు స్పెషల్ అధికారుల పాలన కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్, ఎంపిటిసిల పదవి కాలం ముగిసిన ఎన్నికలు నిర్వహించకుండా సంవత్సరం పాటు అధికారుల పాలన కొనసాగిస్తుంది. రాష్ట్రంలో సెప్టెంబర్ నెల కల్లా స్దానిక ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇవ్వడంతో మండలంలో సర్పంచ్‌లకు, ఎంపిటిసిల స్థానాలకు పోటీ చేసే రాజకీయ నాయకులు ఓటర్లను, కుల సంఘాల నాయకులను, ఊర్లో ఉండే పెద్ద మనుషులను ఈసారి తమకు సపోర్ట్ చేయాలని తనను గెలిపించాలని మచ్చికల పర్వం సాగుతుంది. అందులో భాగంగా గత ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు ఈసారి గెలిపించాలని, గతంలో గెలిచిన అభ్యర్థులు ఊరిని అభివృద్ధి చేశానని మరోసారి నాకే అవకాశం కల్పించాలని కోరుకుంటున్నా రు. గతంలో రిజర్వేషన్లు అనుకూలించని నాయకులు, కొత్తగా పోటీ చేసే నాయకులు కూడా మాకు సపోర్టు చేయాలని ఓటర్లను వేడుకుంటున్నారు. రేపో, మాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ఆశతో ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఆ తర్వాత ఆయా గ్రామాలకు వచ్చే రిజర్వేషన్లతో ఆశావాహులకు అవకాశం కలిసి వచ్చేనా వేచి చూడాల్సిందే..

# గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డూ ఇవ్వలే

### ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

### పోలేపల్లిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ




**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం దేవరకొండ నియోజకవర్గంలో షెడ్యూల్ కులాలు, తెగలు, అల్పసంఖ్యాక వర్గాల ప్రజల సంక్షేమానికి తన వంతుగా ఎక్కువ నిధులు అందించి సహకరిస్తానని, నల్గొండ జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర ఎస్సి, ఎస్టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం పోలేపల్లిల్లో లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఏ బాలునాయక్ కోరిన విధంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, రోడ్ల అభివృద్ధికి, ఎస్‌సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు కేటాయించి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, అలాంటిది తమ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదకు రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు ఘనత తమదేఅని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎస్టీ వర్గీకరణతో పాటు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌కు సిఫారస్ చేయడం జరిగిందని, ఎక్కడా లేని విధంగా కులగణన చేశామని, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న కార్యక్రమాలు పేదలకే చేరాలని తెలిపారు. తన మంత్రిత్వ శాఖల ద్వారా తప్పనిసరిగా నియోజకవర్గానికి ఎక్కువ నిధులను ఇచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని అందులో భాగంగానే నియోజకవర్గానికి ఇప్పటి వరకు కొత్తగా 11,736 రేషన్ కార్డులను ఇవ్వడం జరిగిందని, రేషన్ కార్డులలో 15,837 మందిని సభ్యులుగా చేర్చి వారందరికి సన్న బియ్యాన్ని ఇవ్వనున్నామని తెలిపారు. ఈ ప్రాంత చిరకాల వాంఛ అయిన ఎస్‌ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇతర నియోజకవర్గాలతో సమానంగా దేవరకొండను అభివృద్ధి చేస్తానని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గానికి ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు ఎక్కువ కేటాయించాలని, రహదారులు లేని తండాలకు రహదారులకు నిదులు మంజూరు చేయాలని, మైదాన ప్రాంతంలో ఐటిఏ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంఎల్‌సి శంకర్ నాయక్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1800కోట్లతో డిండి ప్రాజెక్టును చేపట్టడం జరిగిందని, దేవరకొండ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని, భూ భారతి, బిసి కులగణన చేపట్టామని, దేవరకొండ లాంటి వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని, చనిపోయిన వారి పేర్లను రేషన్ కార్డుల్లో నుండి తొలగించే విధంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తెలపాలని కోరారు. సన్న బియ్యం పంపిని విషయంలో చౌకధరల దుకాణా డీలర్లు పారదర్శకంగా ఉండాలని, ఈ విషయంలో ఎలాంటి ఆరోపణలున్న తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అన్ని ప్రభుత్వ పథకాలు పొందేందుకు ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని పొందేందుకు రేషన్ కార్డు తప్పనిసరి అని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 62,155 కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, అంతేకాక 80,201 మందిని రేషన్ కార్డులలో కొత్తగా సభ్యులుగా చేర్చడం జరిగిందని తెలిపారు? ఈకార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్‌కుమార్, గిరిజన సంక్షేమ అధికారి చత్రు, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఆర్డీవో రమణా రెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపిడివో లక్ష్మి, సాంఘీక సంక్షేమ శాఖ డిడి శైలజ పాల్గొన్నారు.



## నేత్రదానానికి అనూహ్యస్పందన

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లా కనగల్ మండలం అమ్మగూడెంకి చెంది న మాచర్ల రాములు ఆదివారం మృతి చెందారు. ఈవిషయము తెలిసిన వెంటనే వీరి కుటుంబ సభ్యులు నరసింహ,బుజ్జమ్మ లను లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ చిరునోముల సంప్రదించి నేత్ర దానం విశిష్టతను దాని యొక్క ఆవశ్యకతను వివరించగా వీరి అంగీకారంతో నేత్రదాన సేకరణ చేశారు. ఐ డొనేషన్ సెంటర్ చైర్మన్ లయన్ కె వి ప్రసాద్,డాక్టర్ హరనాథ్,మేనేజర్ డాక్టర్ పుల్లారావులు మాట్లాడుతూ కుటుంబ సభ్యులను కోల్పోవడం ఎంతో బాధాకరమైనప్పటికీ ఈ విషాద సమయంలో కూడా నేత్రదానానికి ముందుకు వచ్చిన వీరి కుటుంబ సభ్యులను అభినందించారు.తమ ఐ డొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఇది 155వ నేత్రదానం అని, వీటి ద్వారా సేకరించిన 310 కార్నియా అనుకంటే పొరల ద్వారా 310 మంది కార్నియల్ అంధులకు కంటిచూపును అందించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ డొనేషన్ సెంటర్ సభ్యులు డాక్టర్ ప్రనూష, డాక్టర్ నితీష, శ్రీమతి ఏచూరి శైలజ, కోట సరిత, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ దామర యాద య్యా, డాక్టర్ కొనకంచి విజయ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ దైవాదినం పాల్గొన్నారు.

## ప్రశాంతంగా లైసెన్స్, సర్వేయర్, గ్రామ పరిపాలన అధికారుల పరీక్షలు



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టం అమల్లో భాగంగా అధికార వికేంద్రీకరణ ధ్యేయంగా గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించుట కోసం లైసెన్స్ సర్వేయర్ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించేందుకు నిర్వహించిన పరీక్షలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆదివారం ప్రశాంతంగా ముగిసాయని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. పట్టణంలోని సూర్యాపేటలోని ఎస్‌వి డిగ్రీ కళాశాలలో జరిగిన లైసన్స్ సర్వేయర్, గ్రామ పరిపాలన అధికారి పరీక్షల కేంద్రంను జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైసన్స్ సర్వేయర్ పరీక్షకి 238 మందికి గానూ 195 మంది హాజరయ్యారని, 43 మంది గైర్హజరయ్యారని, గ్రామ పరిపాలన అధికారి పరీక్షకి 80 మందికి గానూ 77 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హజర్ అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, ఎస్‌డిఎస్‌ఎల్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో వేణుమాదవరావు, సూపరిండెంట్ సంతోష్, కిరణ్, తహసిల్దార్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

### లైసెన్సెడ్ సర్వేయర్ పరీక్షా కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పాలన అధికారి, లైసెన్సెడ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తనిఖీ చేశారు. ఆదివారం నిర్వహిస్తున్న గ్రామ పాలన అధికారులు, లైసెనస్డ్ సర్వేయర్ల నియామకం కోసం భువనగిరి జిల్లా కేంద్రం లోని ( వెన్నల కాలేజీ ఆవరణలో గల ) భువనగిరి కాలేజీ అఫ్ ఎడ్యుకేషన్, అనంతారంలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 37 మంది అభ్యర్థులకు గాను, 34 మంది హాజరయ్యారని, 3 మంది గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెనస్డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ లో 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన పరీక్షకు 145 మంది అభ్యర్థులకు గాను 139 మంది హాజరయ్యారని, 6 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. లైసెన్సెడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి జగన్మోహన్ ప్రసాద్, మధుసూదన్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, శ్యాంసుందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### రెండు పరీక్షలు ప్రశాంతం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రామ పాలనాధికారులు, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి, నల్గొండ ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో నిర్వహించిన ఈ రెండు పరీక్షల వివరాలను పర్యవేక్షించడం జరిగిందని, లైసెన్స్ సర్వేయర్ల పరీక్షకు 378 మంది హాజరు కావలసి ఉండగా, 300 మంది హాజరయ్యారని, 78 మంది గైరాజరైనట్లు తెలిపారు. గ్రామ పాలనా అధికారుల పరీక్షకు 129 మందికి గాను 110 మంది హాజరుకాగా, 19 మంది గైర్హాజరయ్యారని ,పరీక్షల సందర్భంగా ఏలాంటి సంఘటన చోటు చేసుకోలేదని, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు.






## ఏం కొనేటట్లు లేదు? ఏం తినేటట్లు లేదు..

### జీతాలు లేక విలవిలడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

**ప్రజాపక్షం/నందికొండ:** గత మూడు నెలలుగా జీతాలు లేక పోవడంతో పండుగ సమయంలో చేతిలో డబ్బులు లేక నందికొండ మున్సిపాలిటీ పొరుగు సేవల పారిశుద్ధ్య కార్మికులు జీతాలు అందక విలవిల లాడుతున్నారు.దీనికి సంబంధించి పారిశుద్ధ్య కార్మికులు గతంలో చాలాసార్లు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని కూడా అందించమన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఇచ్చే అరకొర జీతాలను కూడా ప్రభుత్వం ప్రతి నెల ఇవ్వటం లేదని అప్పులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ప్రతిరోజు క్రమం తప్పకుండా కష్టపడి రిస్కు తీసుకొని పనిచేస్తున్నా కానీ ప్రభుత్వం జీతం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇలా కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోతే తమ కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని ఇదే పరిస్తితి కొనసాగితే మా బ్రతుకులు ఆగమ్య గోచరంగా మారతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంవత్సరాల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఎక్కువగా పని చేయించుకుంటున్నా ఆ స్థాయి జీతాలు ఇవ్వక కాకపోయినా తమకు వచ్చే అరకొర జీతాలు కూడా ఇవ్వకపోతే ఎలా బతకాలని అంటున్నారు .సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి అన్న సుప్రీంకోర్టు ఆదేశాలు ఏ ప్రభుత్వ శాఖలు అమలు చేయడం లేదని అన్నారు.

## సఫాయి కార్మికులకు గుర్తింపుకార్డులివ్వాలి

**ప్రజాపక్షం/గుండాల:** సఫాయి కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి సఫాయి కార్మికులకు గుర్తింపు కార్డులను, ఈపిఎఫ్ సౌకర్యాలను అందించాలని సఫాయి కార్మికుల సంఘం జేఏసి నాయకులు, గ్రామపంచాయతీ వర్కర్ బుడిద రాములు ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఆదివారం గుండాల మండల పరిధిలోని మరిపడిగ గ్రామంలో ఆయన మాట్లాడుతూ సఫాయి కార్మికులు సేఫ్టీ కిట్స్, మాస్కులు, సబ్బులు, ఆయిల్, షూ, గ్లౌజులు, యూనిఫాంలు తదితర సామాగ్రిని అందించాలని, సఫాయి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అపరిశుభ్ర వాతావరణంలో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు సంవత్సరంలో రెండు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య చికిత్సలను అందించాలని, సఫాయి కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ కార్యాల యాలలో నియమించి ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## తల్లిదండ్రుల రుణం తీర్చలేనిది

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తల్లిదండ్రుల రుణం తీర్చలేనిదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ అందరికి తల్లిదండ్రుల దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సాంకేతిక యుగంలో తల్లిదండ్రులు అందరు పిల్లల్ని చదివించాలనే, వారు ఆరోగ్యంగా ఉండే విధంగా పోషకాహారం అందించాలనే తల్లిదండ్రులకి కోరిక ఉంటుందని ఆ విషయంలో తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉంటుందని తెలిపారు.పిల్లలను భావి పౌరులుగా తయారు చేయడంలో తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉంటుందని,వారి రుణం తీర్చలేనిదని ఈ విషయం లో ప్రతి ఒక్కరు తల్లిదండ్రులకి శిరస్సు వంచి నమస్కరించాలని అన్నారు.పిల్లల చదువు బాగుందా లేదా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఎలా చదువుతున్నారని, పిల్లల హోం వర్క్‌ను ఇంటి వద్ద చేస్తున్నారా లేదా,తరగతి గదిలో మంచిగా ఉంటున్నారా లేరా అని ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరినారు. ఇంటర్, డిగ్రీ చదివే పిల్లలు మత్తు పదార్థాలు లాంటి వాటికి అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని కొన్ని సందర్భాలలో మనం చూస్తున్నామని, అలాంటి వాటికి సంబంధించి తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని, అలాగే యువత కుడా తల్లిదండ్రుల ఆశయాలను సాధించి జిల్లాకి తెలంగాణ రాష్ట్రానికి భారతదేశానికి మంచి పేరు తెచ్చే విధంగా ఎదగాలని అన్నారు.పిల్లల కి ఇష్టమైన రంగాలలో స్థిరపడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, వచ్చే రోజుల్లో పిల్లల వారి జీవితంలో స్థిరపడితే తల్లిదండ్రులు కుడా చాలా సంతోషంగా ఉంటారని, అప్పుడు తల్లి తండ్రుల కష్టానికి సార్థకత ఏర్పడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. ప్రియుడితో జంప్‌కు యత్నం!

### నల్లగొండ బస్టాండ్‌లో కన్న బిడ్డను వదిలి వెళ్ళిన తల్లి

### వెంటనే స్పందించి బాలుడిని రక్షించిన పోలీసులు



**ప్రజాపక్షం/నల్లగొండ :** కనికరం లేకుండా కన్న బిడ్డనే వదిలి వెళ్లిన ఓ హృదయవిదారక ఘటన ఆదివారం నల్లగొండ బస్టాండ్‌లో చోటు చేసుకుంది.ప్రియుడి మోజులో పడిన ఓ మహిళ తన కొడుకును బస్టాండ్ లో వదిలేసి ప్రియుడితో జంప్ అయ్యింది. ప్రయాణికులు బాబును గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నల్లగొండ టూ టౌన్ ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో ఓ మహిళ 15 నెలల బాబును వదిలేసి వేరే యువకుడితో బైక్ మీద వెళ్లింది. పట్టణంలోని పాతబస్తీకి చెందిన ఒక యువకుడితో హైద్రాబాద్‌కు చెందిన నవీన అనే మహిళ ఇన్ స్టాగ్రామ్ లో పరిచయం అయ్యింది. నవీనకు పెళ్లి అయ్యి 15 నెలల బాబు ధనుష్ ఉన్నాడు. ఈ క్రమంలోనే భర్తను,15 నెలల కొడుకును వదిలేసి ప్రియుడితో వెళ్లేందుకు ప్లాన్ వేసింది. డైరెక్ట్‌గా నల్లగొండ ఆర్‌టిసి బస్టాండ్‌కు బాబుతో పాటు వచ్చి ఆ బాబును బస్టాండ్ లోనే వదిలేసి వెళ్ళింది. ఆ తర్వాత బాలుడు తల్లి కోసం వెతుకుతూ ఏడవడం చూసిన ప్రయాణికులు, డిపో సిబ్బంది నల్లగొండ టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ ఎస్‌ఐ సైదులు వెంటనే స్పందించి స్టేషన్ లోని సిబ్బందిని ఆర్‌టిసి బస్టాండ్ కు పంపారు. పోలీసులు బస్టాండ్ లోని అన్ని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా బైక్ మీద వెళుతున్న ఓ మహిళ వీడియోను చూసి ఆ బాలుడు మమ్మీ అంటూ గుర్తించాడు.ఆ బైక్ నెంబర్ ప్లేట్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులకు బైకు యజమాని నుంచి అతని స్నేహితుడు బైక్ తీసుకెళ్లినట్లు తేలింది.. అటువైపుగా విచారణ చేపట్టగా ఇన్స్టాగ్రామ్ లో ఒక యువకుడు పరిచయమై భర్తను పిల్లాడిని వదిలేసి మహిళ వెళ్లేందుకు చేసిన ప్రయత్నమేనని పోలీసుల విచారణలో బయటపడింది. అనంతరం మహిళను,ఆమె ఇన్ స్టాగ్రామ్ ప్రేమికుడిని ఆమె భర్తను పోలీస్ స్టేషన్ కి పిలిపించి వారితో సుదీర్ఘ కౌన్సిలింగ్ నిర్వహించి, చట్టబద్ధంగా బాలుడిని తిరిగి తండ్రికి అప్పగించా రు. నల్లగొండ టూ టౌన్ ఎస్‌ఐ సైదులు గౌడ్, పోలీసు సిబ్బంది పనితీరుపై జిల్లా ప్రజానీకం హర్షం వ్యక్తం చేశా రు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రియుని కోసం ము క్కు పచ్చలారని చిన్నారిని నిర్ధాక్షిణ్యంగా బస్టాండ్లో వదిలి వెళ్ల డం ఏమిటని సదరు మహిళపై నెటిజన్స్ దుమ్మెత్తిపోస్తున్నారు.

## రాచాల యుగంధర్ గౌడ్‌కి డాక్టరేట్ ఇవ్వటం హర్షణీయం

**ప్రజాపక్షం/కొత్తకోట :** బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్‌కి హెచ్ఎస్‌సి యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడంపై జెఏసి మదనాపూర్ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులకు డాక్టరేట్లను ప్రధానం చేయగా, తెలంగాణ రాష్ట్రం నుంచి రాచాల యుగంధర్ గౌడ్ సామాజిక సేవ విభాగంలో ఎంపిక కావడం, వనపర్తి జిల్లాకే కాకుండా రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ముందు ముందు ఇంకా ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేసే ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ఆపరేటర్లకు వేతనాలు ఏవీ?

**ప్రజాపక్షం/మద్దూర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇంకా వేతనాలు అందలేదు. గత సంవత్సరం నవంబర్ 6 నుంచి 28 వరకు ఇంటింటి సర్వే పూర్తి చేసిం ది. సర్వే డాటా ఎంట్రీ నమో దు బాధ్యత లను ఒక్కో దరఖాస్తుకు రూ.30 చొప్పున చెల్లించాల్సి ఉంది. సర్వే అయి 9 నెలలు దాటిన ఇప్పటివరకు చిల్లి గవ్వ ఇవ్వలేదని తాము నిద్రాహారాలు మాని పని చేశామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్ళినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని వారు మీడియాతో వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వే వేతనాలు అందించాలని డేటా ఆపరేటర్లు కోరుతున్నారు.



## మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై మండల పరిధిలోని వల్లభాపూర్ తాండకు చెందిన తూముకుంట సింగిల్ విండో డైరెక్టర్ భాస్కర్ నాయక్‌తో పాటు 20 మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మంత్రి జూపల్లి వారికి సూచించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బాల్యానాయక్ , శంకర్ నాయక్ , శివుడు నాయక్ , బాషా నాయక్ , సూర్య నాయక్ , దుద్యా నాయక్ , మరి కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునాథ్ రెడ్డి, సబావత్ శివనాయక్ , నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలనాధికారి, లైసెన్స్, సర్వేయర్ పరీక్షా కేంద్రం కలెక్టర్ తనిఖీ




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** గ్రామ పాలన అధికారులు (జజిపిఒ), లైసెన్సు సర్వేయర్ల నియామకం కోసం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆదివారం కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 100 మంది అభ్యర్థులకు గాను 88 మంది హజరయ్యారని, 12 మంది గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్సు, సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగిన థియరీ పరీక్షకు 111 మంది అభ్యర్థులకు గాను 97 మంది హజరయ్యారని, 14 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. లైసెన్సుడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ప్లాటింగ్ పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు తో పాటు ఎలాంటి కాపీ జరగకుండా పరీక్షను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు డిపార్ట్‌మెంటల్ అధికారి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి.కిషన్ రావు, ఆర్‌డిఒ నవీన్, అర్బన్ తాహసిల్దార్ ఘన్సిరాం తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్లను పట్టుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/నారాయణపేట :** మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుంటే టాస్క్ ఫోర్స్ మరికల్ పోలీసులు సంయుక్తంగా దాడుల నిర్వహించి రెండు టిప్పర్లను రాంకొండ శివారులో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ డ్రైవ ర్లు సవారి అశోక్, గడ్డం పవన్ కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మరికల్ ఎస్సై రాము తెలిపారు. మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## విజయవంతమైన వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల మండలం పరిధిలోని కొత్త తండా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఆదివారం చేపట్టిరన ఈ కార్యక్రమాన్ని రవి చిల్డ్రన్ ఆసుపత్రి యాజమన్యం డాక్టర్ll శేఖర్ మాట్లాడుతూ వైద్య సేవలు, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు సరఫరా చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా లావణ్య శేఖర్ సౌజన్యంతో సుహార్త్ ఫౌండేషన్ తరపున మహిళలకు ఆరోగ్యపర సూచనలు చేసి శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్త్యావత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ రవి ఫౌండేషన్ అధినేత డాll శేఖర్ ఆదేశాల మేరకు కొత్త తండా యందు ప్రజలకు ఉచితంగా ఆరోగ్యపర సూచనలు చేసి, వైద్య సేవలు అందించి, మందులు సరఫరా చేసినందుకు అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవి ఫౌండేషన్ సిబ్బంది మోహన్ నాయక్, డాll వేణు పెద్ది రెడ్డి, డాll మౌనిక రెడ్డి, రాజు, కళావతి, సుహార్త్ ఫౌండేషన్ సిబ్బంది డాll హితేష్, కొత్తతండా ప్రజలు రవి నాయక్, సుధారక్, రమేష్ నాయక్, పాండు నాయక్, రఘు నాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్‌లో ఫింగర్ ప్రింట్ డి వైస్‌తో తనిఖీలు



**ప్రజాపక్షం/ మక్తల్ :** జిల్లా ఎస్‌పి యోగేష్ గౌత మ్ ఆదేశాల మేరకు ఆదివారం మక్తల్ బస్టాండ్, బ్యాంకుల వద్ద రద్దీ గల ప్రధాన చౌరస్తాల్లో దొంగతనాలు నిర్మూలించడానికి ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పూర్తి స్థాయిలో నిఘా ఉంచి, ఫింగర్ ప్రింట్ డివైస్‌తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ భా గ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ. మక్తల్ బస్టాండ్, బ్యాంక్‌ల వద్ద అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది. బస్టాండ్‌లో ప్రయాణికుల మాటున కొంతమంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వాటికి చెక్ పెట్టడానికి ఆకస్మికంగా త నిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మక్తల్ పరిధిలో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో మక్తల్ పోలీసులు నరేష్, తిరుపతి పాల్గొన్నారు.

# సగరుల అభివృద్ధికి ఎల్లవేళలా తోడ్పాటు

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** రాష్ట్రంలోబిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై సిఎంకు చిత్తశుద్ధి ఉందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సగరుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా తోడ్పాటును అందిస్తానని ఆయన పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆదివారం సంగం ఫంక్షన్ హాల్‌లో సగరుల జిల్లా కమిటీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, జి. మధుసూదన్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వనపర్తి నియోజకవర్గంలో సగరులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, జిల్లా గ్రంథాలయ అధ్యక్షునిగా గోవర్ధనసాగర్‌ని, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా చీర్ల చందర్‌ని పలువురు కౌన్సిలర్లను , నాయకులకు సముచిత స్థానాలు కల్పించి గౌరవిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గడిచిన పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో సగరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రలో అన్ని కులాలకు సంబంధించిన ఇబ్బందులను నేరుగా చూశారని ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగనన ప్రాతిపదికిన సగరులకు దక్కాల్సిన అన్ని రకాల పదవులు దక్కుతాయని ఆయన అన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణంలో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు అందిస్తామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్ , వనపర్తి మా ర్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరవ సత్యం సాగర్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి చం ద్రయుడుసాగర్ , జిల్లా కోశాధికారి సత్యంసాగర్ , రాష్ట్ర సగర సంగం గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికృష్ణసాగర్ , ఆంజనేయులుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

### యువత ఉద్యోగ కల్పనతో పాటు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

నిరుద్యోగ యువత ప్రభుత్వ పరమైన ఉద్యోగ కల్పనపై దృష్టి సారిస్తూనే స్వయం ఉపాధి రంగంలో రాణించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి పట్టణం కొత్త బస్టాండ్ వెనకాల బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమార్ ఏర్పాటు చేసుకున్న మేకప్ స్టూడియో, స్టోర్ రూంను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### వైద్యసేవకు మించిన సేవ లేదు

సమాజంలో వైద్య సేవలు ఎంతో గొప్పవని ఆపత్కాలంలో వైద్య సేవలు అందించే వైద్యులు భగవంతునితో సమానమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలో పాత బస్టాండ్ ఎదురుగా వైద్యుడు వివేక్ నూతనంగా ఏర్పాటు చేసిన గ్యాస్ట్రోలివర్, ఎండోస్కోపి, వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వైద్యశాలలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. వైద్యాన్ని వ్యాపారంగా మార్చకూడదని బాధితులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్లచందర్ , పట్టణ ప్రముక వైద్యులు పగిడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

### మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



**ప్రజాపక్షం/మక్తల్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ద్వారక ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు. అధ్యక్షతన మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అబద్ధాలను ప్రజలకు వివరించాలని గ్రామస్థాయిలో బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. గ్రామస్థాయిలో ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చే గ్రామపంచాయితీ ఎంపిటిసి మున్సిపాలిటీ, జెడ్‌పిటిసి ఎన్నికల్లో అందరూ సమిష్టిగా ఏకమై బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టెం సుచరిత రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజులు ఆశిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు, మాగనూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎంపిటిసి ఎల్లారెడ్డి, మక్తల్ నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఈశ్వర్ యాదవ్ మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ విగ్రహంపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

### సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకండా సినీ హీరో కృష్ణ విగ్రహాన్ని మహబూబ్ నగర్ పట్టణంలో ఏర్పాటు చేశారంటూ సామాజిక కార్యకర్త, నేను సైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్ కుమార్ రాష్ట్ర అత్యున్నత న్యాస్థానంపై హైకోర్టును ఆశ్రయించారు. దింతో కేసు విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని నేనుసైతం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పోరాట ఫలితంగా గతంలో మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేయొద్దని లిఖీత పూర్వకంగా నోటీసు జారీ చేశారన్నారని ఆయన తెలిపారు. ఒక వైపు మున్సిపల్ కమిషనర్ నోటీసు జారీ చేసినా, నోటీసును ధిక్కరించి, నిబంధనలకు విరుద్ధంగా విగ్రహాన్ని మే 31న కృష్ణ ఫ్యాన్స్ ఆవిష్కరించారని ఆయన పేర్కొన్నారు. దీంతో కృష్ణ విగ్రహా న్ని తొలగించాలని మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో పాటు స్పెషల్ ఆఫీసర్ మహబూబ్ నగర్ మున్సిపాలిటీ, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో హైకోర్టులో కేసు వేయడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే హైకోర్టులో న్యాయ వాదలు పెనుబల్లి రమేష్ బాబు, దేవర సంగీతలు వాదనలు వినిపంచగా హై కో ర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. తాము చేస్తున్న న్యాయ పోరాటంపై హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంపై సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హై కోర్టుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## నైపుణ్య శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు అధికం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఎలాంటి ట్రేడ్ లోనైనా నైపుణ్య శిక్షణ పొందిన వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఐటిఐ కళాశాలను ఎటిసి సెంటర్‌గా అభివృద్ధి చేయడమే కాకుండా అందులో సిఎంసి మిషినింగ్ టెక్నీషియన్, ఇంజనీరింగ్ డిజైనింగ్ టెక్నీషియన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, వర్చ్యువల్ అనాలసిస్ అండ్ డిజైనర్ ఎఫ్ఈఎం కోర్సులకు మన మహబూబ్‌నగర్ విద్యార్థుల కొరకు ప్రభుత్వంతో నూతన కోర్సుల నిర్వహణ కోసం అనుమతి తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వెంటనే వారికి ఉద్యోగ అవకాశాలు వివిధ సంస్థల నుంచి వస్తాయని ఆయన చెప్పారు. ఎటిసి సెంటర్ నందు నూతనంగా ప్రారంభిస్తున్న కొత్త కోర్సుల్లో వివిధ అర్హతలతో ప్రవేశాలు కళాశాల వివిధ అర్హతలతో ప్రవేశాలు కళాశాల యజమాన్యం కల్పిస్తుందని ఆయన తెలిపారు. కొత్త కోర్సులే కాకుండా గతంలో ఉన్నటువంటి ఫిట్టర్, ఎలక్ట్రిషన్, మిషినిస్టు , టర్నర్, డీజిల్ మెకానికల్ కోప కోర్సులు సైతం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని తల్లిదండ్రులు వారి పిల్లలను నాణ్యమైన నైపుణ్య శిక్షణ సెంటర్‌లో చేర్పించి వారికి బంగారు భవిష్యత్తు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం మన మహబూబ్‌నగర్‌లో ఉన్నటువంటి ఐటిఐ కళాశాలలో పై ట్రేడ్ నందు ప్రవేశం ఉంది. నిష్ణాతులైన శిక్షకుల ఆధ్వర్యంలో ఉత్తమ నైపుణ్య శిక్షణ పొంది ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆయన సూచించారు.

## అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** దేశాభివృద్ధికి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఎపిజె అబ్దుల్ కలాం ఎనలేని కృషి చేశారని, అబ్దుల్ కలాం సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా.కె. రాజ్ కుమార్ రెడ్డి కోరారు. భారత మాజీ రాష్ట్రపతి దివంగత డాllఎపిజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించా రు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచ పటంలో నిలిపేందుకు శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం ఎంతో శ్రమించారని కొనియాడారు. అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కంకణబద్ధులై పనిచేయాలని సూచించారు. మహనీయుల ఆశయాలను అనుసరిస్తూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మడివల్ అశోక్, రాము, అరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

### జడ్చర్లలో ఎంఆర్‌సి వద్ద



**ప్రజాపక్షం/జడ్చర్ల :** మాజీ భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా జడ్చర్లలో ఎంఆర్‌సి వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర పకీర్ల సంక్షేమ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఫకీర్ జాంగీర్ భాష ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆశయాలు నిర్వహిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బంజారా సీనియర్ నాయకులు రాములు నాయక్ , రాజు నాయక్, పద్మశాలి సంఘం రాఘవేందర్ అరికటిక సంఘం చౌదరి, యాదవ సంఘం అధ్యక్షులు కేతిరెడ్డి పల్లి యాదవ్ , రజక సంఘం అధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పిల్లల మర్రి సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో



భారతరత్న అబ్దుల్ కలాం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల మర్రి సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఘన నివాళులు భారతరత్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా దివంగత అబ్దుల్ కలాం ఆశయాలు నెరవేర్చాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పిల్లలమర్రి జిల్లా సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌వియం హాల్ మెట్టుగడ్డ దగ్గర అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, పద్మావతి, షంషేర్, సాయిబాబా, మంజులత, శరత్ కృష్ణ, ఆనంద్, శ్రీహరి, బషీర్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేయర్ల రాత పరీక్ష ప్రశాంతం



**ప్రజాపక్షం/ వనపర్తి టౌన్ :** జిల్లాలో గ్రామ పాలనాధికారి, లైసెన్సుడు సర్వేయర్ల ఎంపిక కోసం రాత పరీక్ష ప్రశాంత వాతావరణంలో మొదలైనట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కోసం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి హాజరు వివరాలు తెలుసుకున్నారు. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగా 1 గంటల వరకు కొనసాగింది. గంట ముందు నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా పకడ్బందీగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిపిఒ పరీక్ష కోసం మొత్తం 62 మంది అభ్యర్థుల కు 55 మంది హాజరయ్యారని, ఏడు మంది గైర్హాజరయ్యారని చెప్పారు. అదేవిధంగా లైసెన్స్ సర్వేయర్ పరీక్ష కోసం 112 మంది అభ్యర్థులకు 100 మంది హాజరయ్యారని, 12 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. అయితే లైసెన్సుడు సర్వేయర్ల కోసం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మరో పరీక్ష జరగనుంది. ఆర్డీఓ సుబ్రహ్మణ్యం , ఏడి సర్వే బాలకృష్ణ, తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## పాలెం గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభం



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండల పరిధిలోని పాలెం గ్రామంలో చాలా కాలంగా పెండిం గ్‌లో ఉన్నటు వంటిపై గడ్డన ఉన్న పాత రోడ్డు పాలమూరు పార్లమెంట్ సభ్యులు డికె అరుణ మ్మ, ఎంపి నిధుల నుండి సీసీ రోడ్డు శాంక్షన్ కా వడంతో ఆదివారం కొత్తకోట మండల బిజెపి అధ్యక్షులు చీర్ల నర్సింహ టెంకయ్య కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెద్ది సత్యనారాయణ, జెనీగా వెంకటేష్ ,కేశవులు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల ఆయుధాలు ఆశ, అత్యాశే : ఎస్‌పి



**ప్రజాపక్షం/నారాయణపేట్:** డబ్బులు పోయాక బాధపడడం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్త పడండని జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ అన్నారు. విలాసంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పం పుతామని, రకరకాల మాయ మాటలతో ఆఫర్లు పెట్టి, ప్రజల నుండి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరికొంత మందిని సభ్యులు గా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త టెక్నిక్‌లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారని, ఇలాంటి నూతన స్కిం ల పట్ల, నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తం గా ఉండాల్సిన అవసరముందని ఎస్‌పి యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సైబ ర్ నేరాలు జరుగుతున్న తీరు, సైబర్ నేరాలకు ప్ర జలు గురైతున్న విధానం, ప్రజలు సైబర్ నేరాలకు గురి కాకుండా జాగ్రత్త పడాల్సిన అవశ్యాకత ఎంతైనా ఉంది అని తెలిపారు. మొబైల్ కు లేదా సోషల్ మీడియా ప్లాట్ పామ్‌లో అనేక కంపెనీల పేర్లతో ట్యూ లింక్ ద్వారా ఫైల్ వస్తుందని దానిని ఇన్స్టాల్ చేసుకున్నాక అప్లికేషన్‌లో రిజిస్టర్ అ యిన తరువాత ఒక వాట్సాప్ గ్రూపుకు యడ్ చే స్తారని, వారు అంతకు ముందు పెట్టినా ఇన్వెస్ట్మెంట్, వచ్చినా ప్రాఫిట్‌కు సంబంధించిన నకిలీ పత్రాలను గ్రూపులో షేర్ చెయ్యగా వాటిని నమ్మి మొబైల్ వినియోగ దారులు ఇన్వెస్ట్మెంట్ పెట్టడం. జరుగుతుందని, మొదట చిన్నా చిన్న అమౌంట్‌కు లాభాలు వెంటనే ఇస్తారని, ఎక్కువ అమౌంట్ పెట్టాక రెస్పాండ్ కారని, అలాగే ఇంకో విధానంతో నెక్ట్‌లెవెల్ అంటూ ఎక్కువ అమౌంట్‌తో ఎక్కువ సంఖ్యలో ఒకరి క్రింత ఒకరిని జాయినింగ్ చెపిస్తూ, వీక్ ఎండ్‌లలో సక్సెస్ మీటింగ్‌లు పెడుతూ ఎక్కువ మందిని జాయిన్ చేపించిన వారిని సత్కరిస్తూ మరింత ఎక్కువ మందిని జాయిన్ చేసేలా ప్రోత్సహిస్తారని, ఎక్కువ సంఖ్యలో ప్రజలు జాయిన్ అయి భారీగా పెట్టుబడులు పెట్టాక ఒకే సారి కంపని ఎత్తేస్తారన్నారు. మన ఆశ, అత్యాశ వారి ఆయుధాలు, కాబట్టి ఇలాంటి నేరాల పట్ల, మొబైల్ ఫోన్లను చూసే మనకు సోషల్‌మీడియా ద్వారా మీ దృష్టిని ఆకర్షించే ఈ కుట్రలకు ఎట్టిపరిస్థితుల్లో లొంగకండి, తొందరపడి బాధలను, నష్టాలను కొని తెచ్చుకోకండి, ఒక వేళ మీరు అన్ని జాగ్రత్తలను తీసుకున్నా కూడా మోసపోయిన పక్షంలో ఒక క్షణం ఆలస్యం చెయ్యకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కి గానీ, www.cybercrime.gov.in ద్వారా కానీ లేదా మీ సమీప పోలీస్ స్టేషన్‌లో నైనా వెంటనే పూర్తి వివరాలతో ఫిర్యాదు చెయ్యాలన్నారు.

## సమష్టి కృషితో గడప గడపకు కాంగ్రెస్

**ప్రజాపక్షం / కొత్తకోట :** సమిష్టి కృషితో గడప గడపకు కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనాన్ని ఎగురవేయాలని మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ అన్నారు. కొత్తకోట మండలం అమడబాకుల సత్యహళ్లీ గ్రామాలలో గ్రామ పార్టీ అధ్యక్షులు అనుబంధ సంస్థలు, కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం పార్టీ మండల అధ్యక్షులు నాగారపు బీచుపల్లి యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకోవాలని అందుకు అందరం కలిసికట్టుగా సమిష్టి కృషితో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అరుణ శ్రీనివాస్ , పాపయ్య, కృష్ణారెడ్డి, నరేందర్ , కర్ణాకర్ రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## క్రికెట్ కాదు ఉగ్రవాదం అంతమవ్వాలి..

### పాక్‌తో మ్యాచ్‌లపై దాదా..!



భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ ఇక అసాధ్యం అనుకుంటున్న వేళ ఆసియా కప్ షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 14న దాయాదుల మ్యాచ్ ఉందని తెలియడంతో నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. పహల్గాంలో అమాయకులను బలిగొన్న ఉగ్రవాదులను పెంచిపోషించిన పాక్‌తో క్రికెట్టా అని బిసిసి ఐని కడిగిపారేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్‌లు ఒకే గ్రూప్‌లో ఉండడంతో తప్పనిసరిగా లీగ్ మ్యాచ్ ఆడాల్సిన పరిస్థితి. అయితే.. వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ఆఫ్ లెజెండ్స్‌లో మాజీ ఆటగాళ్లు పాక్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసినట్టుగానే ఈ మ్యాచ్‌ను లైట్ తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. డబ్బుల కోసమే బిసిసిఐ ఈ టోర్నీలో ఆడేందుకు అంగీకరించిందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇరుదేశాల మ్యాచ్‌పై సర్వాత్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న వేళ గంగూలీ క్రికెట్ కాదు ఉగ్రవాదం అంతమవ్వాలని తన అభిప్రాయాన్ని చాలా స్పష్టంగా చెప్పాడు. 'పాకిస్థాన్‌తో ఆడడంలో నాకేమీ అభ్యంతరం లేదు. ఎందుకంటే ఇరుదేశాల మధ్య సంబంధాలు ఎలా ఉన్నా ఆట మాత్రం కొనసాగాలి. అదే సమయంలో పహల్గాం వంటి ఉగ్రదాడులు జరగకూడదు. టెర్రరిజం అంతం కావాలి. ఇప్పటికే మనదేశం ఉగ్రవాదంపై కఠినమైన చర్యలు తీసుకుంటోంది. అందుకే.. క్రికెట్ ఆడడంలో విమర్శ తగదు' అని దాదా వెల్లడించాడు.

## శతకాలతో జడ్డూ, వాషీ

### డ్రాగా ముగిసిన నాలుగో టెస్టు





అనూహ్య మలుపులు తిరిగిన మాంచెస్టర్ టెస్టు డ్రాగా ముగిసింది. భారత మిడిలార్డర్ వీరోచిత బ్యాటింగ్‌తో ఇంగ్లాండ్ బౌలర్లు కుదేలవ్వగా.. టీమిండియా సిరీస్‌లో నిలిచింది. ఐదో రోజు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103) ఔటయ్యాక జట్టును గట్టెక్కించే బాధ్యతను భుజాన వేసుకున్న రవీంద్ర జడేజా(107 నాటౌట్), వాషింగ్టన్ సుందర్ (101 నాటౌట్)లు చిరస్మరణీయ సెంచరీతో చెలరేగారు. ఐదో వికెట్‌కు అజేయంగా 203 రన్స్ జోడించిన ఈ ఇద్దరూ స్టోక్స్ సేన ఆశలపై నీళ్లు చల్లుతూ భారత జట్టును సిరీస్‌లో బరిలో నిలిపారు. మాంచెస్టర్ టెస్టులో భారత జట్టు అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. అసమాన పోరాటంతో ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌ను డ్రాగా ముగించి ఔరా అనిపించింది. టీ సెషన్ తర్వాత కూడా రవీంద్ర జడేజా(107 నాటౌట్), వాషింగ్టన్ సుందర్(101 నాటౌట్)లు జిడ్డులా క్రీజునంటుకు పోవడంతో స్టోక్స్ డ్రా చేసుకుందామని షేక్ హ్యాండ్ ఇవ్వబోయాడు. అంపైర్ మీకు ఓకేనా అడగగా ఇద్దరూ తిరస్కరించారు. అప్పటికే ఇద్దరూ శతకానికి చేరువలో ఉన్నారు. కాసేపటికే బ్రూక్ ఓవర్లో బౌండరీతో 95కి చేరుకున్నాడు జడేజా. ఆ తర్వాత సుందర్ సైతం రూట్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో 90కి చేరువయ్యాడు. బ్రూక్ ఓవర్లో సిక్సర్‌తో జడ్డూ ఐదో శతకం సాధించాడు. ఇంగ్లండ్‌పై అతడికిది మూడో సెంచరీ. ఆ కాసేపటికే సుందర్ డబుల్ తీసి కెరీర్లో తొలి సారి వందకు చేరువయ్యాడు.

**గిల్, రాహుల్ స్ఫూర్తితో..**

సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే మ్యాచ్‌లో సున్నాకే రెండు వికెట్లు. కొత్త బంతితో నిప్పులు చెరుగుతున్న ఇంగ్లాండ్ పేసర్లను ఎదుర్కొని నిలుస్తారా? అనే సందేహాలను పటాపంచలు చేస్తున్నారు భారత మిడిలార్డర్ బ్యాటర్లు. నాలుగో రోజు కెప్టెన్ శుభ్‌మన్ గిల్(103), కేఎల్ రాహుల్(90) అసమాన పోరాటంతో ఆదుకోగా.. ఐదో రోజు ఆల్‌రౌండర్లు జట్టను ఒడ్డున పడేసే బాధ్యత తీసుకున్నారు. లంచ్‌కు ముందే రాహుల్, సెంచరీ వీరుడు గిల్ పెవిలియన్ చేరినా.. మేమున్నామంటూ క్రీజులో పాతుకుపోయారు వాషింగ్టన్ సుందర్(107 నాటౌట్), రవీంద్ర జడేజా(101 నాటౌట్)లు. ఇంగ్లాండ్ బౌలర్ల వ్యూహాల్ని చిత్తు చేస్తూ.. బౌన్సర్లను ఎదుర్కొంటూ ఐదో వికెట్‌కు అమూల్యమైన పరుగులు జోడించి టీమిండియాకు ఆధిక్యం అందించిందీ ద్వయం. స్టోక్స్ బౌలింగ్‌లో అర్ధ శతకాలు పూర్తి చేసుకున్న జడ్డూ, వాషీలు టీ బ్రేక్ తర్వాతా అదే పట్టుదలను ప్రదర్శించారు. టీ బ్రేక్ తర్వాత జోరు పెంచిన వీళ్లు సెంచరీకి చేరువయ్యారు. స్టోక్స్ డ్రా రిక్వెస్ట్‌ను తోసిపుచ్చిన తర్వాత ఇరువురు బౌండరీలతో విరుచుకుపడి శతకాలు సాధించారు. ఐదో వికెట్‌కు 203 రన్స్ చేసి టీమిండియా పవర్ చూపించిన ఈ జోడీకి హ్యాట్సాఫ్ చెబుతున్నారు అభిమానులు.


## హంపి, దివ్య రెండో గేమ్ డ్రా!



భారత్‌కు ఖాయమైన ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్ టైటిల్‌ను తమ పరం చేసుకునేందుకు తెలుగు తేజం కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ హోరాహోరీగా తలపడుతున్నారు. తొలి గేమ్‌ను 41 ఎత్తుల్లో డ్రా చేసుకున్న ఈ భారత స్టార్లు.. ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను కూడా డ్రా చేశారు. దాంతో ఫలితం తేల్చేందుకు సోమవారం టై బ్రేకర్ ఆడించనున్నారు. తొలి గేమ్‌లో నల్ల పావులతో ఆడిన కోనేరు హంపి.. ఆదివారం తెల్ల పావులతో బరిలోకి దిగింది. తొలి గేమ్ తరహాలోనే ఈ మ్యాచ్ కూడా హోరా హోరీగా సాగింది. 41 ఎత్తుల తర్వాత ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ డ్రాకు మొగ్గు చూపారు. గేమ్ ప్రారంభంలో దివ్య దేశ్‌ముఖ్ క్వీన్స్ గాంబిట్ ఓపెనింగ్‌తో దూకుడు కనబర్చింది. 14వ ఎత్తులో బిషప్‌ను త్యాగం చేయడం ద్వారా ఆమె అడ్వాంటేజ్ పొందింది. ఇక్కడ దివ్యకు గేమ్ గెలిచే అవకాశం లభించినప్పటికీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆరంభంలో ఇబ్బంది పడిన హంపి 16వ ఎత్తు నుంచి పుంజుకుంది. ఇద్దరు ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి తెలివిగా ఆడారు. 37వ ఎత్తులో దివ్య దేశ్‌ముఖ్.. హంపి యొక్క రూక్‌ను గెలుచుకుంది. అయితే హంపి పట్టుదలతో ఆడి, 41వ ఎత్తులో పర్పెచువల్ చెక్స్ సాయంతో గేమ్‌ను డ్రా అయ్యేలా చేసుకుంది. చివరి గేమ్ సాగే కొద్దీ ఫలితం తేలే అవకాశాలు లేకపోవడంతో దాదాపు మూడు గంటలపాటు జరిగిన ఈ గేమ్ 41వ ఎత్తులో డ్రా అయ్యింది. రెండు క్లాసికల్ గేమ్‌లు డ్రా కావడంతో.. విజేతను నిర్ణయించేందుకు నేడు (సోమవారం) రాపిడ్ బ్లిట్జ్ ఫార్మాట్‌లో టైబ్రేకర్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇందులో గెలిచే వారికే ఫిడే వుమెన్స్ వరల్డ్ కప్ టైటిల్ దక్కుతుంది.

# ఫోకస్ — ఆరోగ్యం

**ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళిక ప్రకారం 2030 నాటికి హెపటైటిస్ రహిత ప్రపంచాన్ని నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్ణయించారు**




## హెపటైటిస్‌కు చికిత్స సాధ్యమే!

### ముందస్తు పరీక్షలే కీలకం

ప్రపంచవ్యాప్తంగా 325 మిలియన్ల ప్రజలకు హెపటైటిస్ సోకిందని కూడా వారికి తెలియదు. ఇలాగే అజాగ్రత్త వహిస్తే 2030 నాటికి మరో 76 మిలియన్ల ప్రజలకు కూడా సంక్రమించే ప్రమాదం లేకపోలేదు. హెపటైటిస్ వైరస్ సోకిందని తెలియని కారణంగా మిలియన్ల అభాగ్యులు అనారోగ్యంతో బాధపడుతూ మరణం అంచున నిస్సహాయంగా కొట్టుమిట్టాడుతున్నారు. విశ్వవ్యాప్తంగా సాలీనా 1.3 మిలియన్ల హెపటైటిస్ కారణ మరణాలు నమోదుతో పాటు ప్రతి రోజు 3,500 మంది హెపటైటిస్ వ్యాధులతో చనిపోవడం జరుగుతున్నది. భారత్‌లో 40 మిలియన్ల ప్రజలకు హెపటైటిస్ 'బి' వైరస్ సోకడం, 12 మిలియన్ల ప్రజలకు హెపటైటిస్ 'సి' వైరస్ సోకడం జరుగుతున్నది. బీహార్, పంజాబ్, హర్యానా, ఎంపీ, ఒడిసా రాష్ట్రాల్లో హెపటైటిస్ రోగులు అధికంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ముందు జాగ్రత్తలతో హెపటైటిస్ వైరస్‌ను కట్టడి చేయని యెడల హెచ్‌ఐవీ, టీబీ, మలేరియా మరణాల కన్న హెపటైటిస్ మరణాలు అధికంగా జరగవచ్చని హెచ్చరిస్తున్నారు. హెపటైటిస్ వైరస్ సోకడం వల్ల సంక్రమించే కాలేయ సంబంధ వ్యాధి పట్ల ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏట 28 జూలై రోజున ప్రపంచ హెపటైటిస్ దినం పాటించడం 2010నుంచి ఆనవాయితీగా మారింది.ప్రపంచ హెపటైటిస్ దినం2025 ఇతివృత్తంగా హెపటైటిస్ : ఈ వ్యాధిని కట్టడి చేద్దాం అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. హెపటైటిస్ 'బి' వైరస్‌ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత 'బి. ఎస్. బ్లూంబెర్గ్' అను శాస్త్రజ్ఞుడి పుట్టిన రోజు 28 జూలై రోజున హైపటైటిస్ దినం పాటించడం పరిపాటి అయ్యింది. టిబీ వ్యాధి తర్వాత అధిక మరణాలను నమోదు చేస్తున్న వ్యాధిగా హెపటైటిస్‌ను గుర్తించారు.

### వైరస్‌ల్లో రకాలు:

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళిక ప్రకారం 2030 నాటికి హెపటైటిస్ రహిత ప్రపంచాన్ని నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్ణయించారు. హెపర్నా వైరిడే కుటుంబానికి చెందిన హెపటైటిస్ వైరస్‌లు 'ఏ', 'బి', 'సి', 'డి', మరియు 'ఈ' అనబడే ఐదు రకాలు ఉన్నాయి. వీటిలో ఏ, బి, సి వైరస్‌లు అతి సాధారణమైనవి. హెపటైటిస్‌ఏ, బి వైరస్‌లకు టీకాలు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 42 శాతం పిల్లలకు మాత్రమే ఈ టీకాలు ఇవ్వబడుతున్నాయి. రోగి మలం, ద్రవాలు, లేదా రక్తం ద్వారా ఈ వ్యాధి ఇతరులకు సోకుతుంది. రోగులతో కలిసి ఒకే ప్లేట్‌లో తినడం, వైరస్ సోకిన వ్యక్తిని స్పర్శించడం లాంటి కారణాలతో కూడా వైరస్ సోకవచ్చు. భారత్‌లో దాదాపు 3 5 శాతం ప్రజలకు హెపటైటిస్ 'బి' వైరస్ సోకిందని తెలుస్తున్నది. 'సి' వైరస్ సోకిన వారికి కాలేయ క్యాన్సర్ కూడా రావచ్చు. 'సి' వైరస్ సోకివదన వారిలో 30 శాతం మందికి చికిత్స లేకుండానే వ్యాధి నయం కావచ్చు. 'బి' వైరస్ సోకిన వారికి కూడా 'డి' వైరస్ సోకే అవకాశం ఉన్నందున 'డి' వైరస్‌ను 'సూపర్ ఇన్‌ఫెక్షన్' అని కూడా అంటారు. కలుషిత ఆహారంతో సోకే హెపటైటిస్ 'ఈ' వైరస్ వ్యాప్తి పేద దేశాల్లో అధికంగా కనిపిస్తున్నది.



### వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు:

హెపటైటిస్ వైరస్ సోకడం వల్ల కాలేయ వాపు, వాంతులు, పచ్చ కామెర్లు, కడుపు నొప్పి, జ్వరం, అలసట, కీళ్ల నొప్పులు, మూత్రం ముదురు పసుపు రంగులో ఉండడం, పసుపు రంగు చర్మం, ఆకలి నశించడం, గర్భిణులకు ఆరోగ్య సమస్యలు రావడం లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. హెపటైటిస్ వ్యాధిని పరీక్షలు చేయించుకొని త్వరగా గుర్తించడం, వైరస్‌లు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం, తరుచుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, తల్లి నుంచి శిశువుకు సోకకుండా జాగ్రత్త పడడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటే హెపటైటిస్ వైరస్‌తో పాటు వ్యాధి కూడా దూరం అవుతుంది. హెపటైటిస్ వైరస్ సోకకుండా ఉండడానికి తీసుకోవలసా జాగ్రత్తల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడం, ఆల్కహాల్ సేవనానికి పరిమితులు విధించుకోవడణ, ప్రమాదకర టాక్సిన్స్‌కు దూరంగా ఉండడం, టీకాలను తీసుకోవడం, సురక్షిత లైంగిక సంబంధాలు, డిస్పోజబుల్ సూదులు వాడడం, తగు చికిత్సలు తీసుకోవడం, వైరస్ సోకిన వ్యక్తి రక్తం మన రక్తంతో కలవకుండా చూసుకోవడం, సురక్షిత తాగు నీటిని తీసుకోవడం, మూఢ విశ్వాసాలను బొంద పెట్టడం, వైద్య సిబ్బందికి తగు శిక్షణలు ఇవ్వడం లాంటి జీవనశైలి మార్గాలను పాటించాలి. బ్లూబెర్రీస్, క్రాన్‌బెర్రీస్, ద్రాక్ష పండ్లు, బీట్‌రూట్ రసం, చేపలు లాంటి పోషకాహారాన్ని అధికంగా తీసుకోవాలి.

ప్రపంచ హెపటైటిస్ దినం వేదికగా వైరల్ హెపటైటిస్ పట్ల అవగాహన కల్పించడం, ఔషధాలను అందుబాటులో ఉంచడం, తరుచుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు తగు చికిత్సలు చేయించుకోవడం, శుభ్రతను పాటించడం లాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. లైంగిక సంబంధాల్లో కండోమ్స్ వాడడం, రక్త మార్పిడి సందర్భంగా తగు జాగ్రత్తలు తీసుకోవడం, డిస్పోజబుల్ సూదులు వాడడం లాంటి విషయాలను పాటించాలి. చెవులు కుట్టించుకోవడం, ముక్కు కుట్టించుకోవడం, పచ్చబొట్టు వేయించుకోవడం లాంటి సందర్భాల్లో వాడే పరికరాలను మరొకరికి వాడకుండా లేదా వాటికి తగు రీతిలో శుభ్రం చేసే విధంగా చూసుకోవాలి. ఐరాస ఆశించినట్లు 2030 నాటికి హెపటైటిస్ రహిత ప్రపంచాన్ని నిర్మించుకునే మహా యజ్ఞంలో మన వంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటాలు

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** రానున్న రోజులలో జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటాలు నిర్వహించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి కార్యకర్తలను కోరారు. ఆదివారం వరంగల్ చింతల్ ఫ్లై ఓవర్ అల్పాహారం ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఐ వరంగల్ మండల మహాసభకు పరికిరాల రమేష్, మేడిది అశోక్, తాళ్లపల్లి రోహేలా అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా ముఖ్యఅతిథిగా హాజరై మేకల రవి మాట్లాడారు. వేలాదిమంది అమరుల త్యాగాలతో లక్షలాది ఎకరాల భూములు పంచిన ఘనత సిపిఐ సొంతమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసి ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుల స్ఫూర్తితో రానున్న రోజుల్లో పోరాటాలను ఉధృతం చేసి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకునేలా చేస్తామన్నారు. జూలై 30,31 తేదీల్లో సిపిఐ వరంగల్ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరుకానున్నారని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మండల మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాష్ మియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, వీరగోని శంకరయ్య, జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, ఎండి అక్బర్, లాదెల్ల శరత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముప్పై రెండు మందితో మండల సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా మండల కార్యదర్శిగా గుండె బద్రి, సహాయ కార్యదర్శిగా జన్ను రవి ఎన్నికయ్యారు.

## 29న సిపిఐ జిల్లా మహాసభ

### కరపత్రాలు విడుదల

**ప్రజాపక్షం/మోత్కూర్ :** ఈనెల 29వ జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో కెఆర్ భవన్‌లో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాలుగవ జిల్లా మహాసభలు ఈనెల 29న వలిగొండలో జరుగుతున్న సందర్భంలో కమ్యూనిస్టు శ్రేణులు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ల శేఖర్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి పుల్కరం మల్లేష్, మోత్కూరు పట్టణ కార్యదర్శి బోయిన ఉప్పలయ్య, పోచం కన్నయ్య, పెండెం వెంకటేశ్వర్లు, వల్లపు అంతయ్య, ఎర్ర బాబు, దొండ ఎల్లయ్య, కొమ్ము రాములు, గొలుసుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## 'సింగరేణి' లాభాల వాటా ప్రకటించాలి

### వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి :** సింగరేణిలో యాజమాన్యం లాభాల వాటా ప్రకటించాలని ఎఐటియుసి గుర్తింపు సంఘంగా కోరడం జరిగిందని, త్వరలోనే లాభాల వాటా ప్రకటిస్తారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. లాభాల వాటా గతంలో 33 శాతం ఇవ్వడం జరిగిందని, ఈసారి 35 శాతం ఇవ్వాలని యాజమన్యాన్ని కోరడం జరిగిందన్నారు. గతంలో టిబిజికెఎస్ గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు ఒక్క స్ట్రక్చర్ మీటింగ్ జరగలేదని, ఇప్పటికే మూడుసార్లు గుర్తింపు సంఘంగా స్ట్రక్చర్ మీటింగులు నిర్వహించడం జరిగిందన్నారు. స్ట్రక్చర్ మీటింగ్‌లో కార్మిక సమస్యలను యాజమాన్యం అంగీకరించి, కొన్నింటికి సర్క్యులర్ జారీ చేసిందని తెలిపారు. అట్లాగే కార్మికుల విద్య, వైద్యం, సొంతింటి పథకం కోసం ఎఐటియుసి కృషి చేస్తుందని, యాజమాన్యం కమిటీ వేసిందని కమిటీ రిపోర్టు రాగానే సొంతింటి కల నెరవేరుతుందని తెలిపారు. విద్య విషయంలో ఆర్ జీ1లో సెంట్రల్ సిలబస్ ప్రారంభమైందని, అట్లాగే శ్రీరాంపూర్, భూపాలపల్లి, కొత్తగూడెంలో సెంట్రల్ సిలబస్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వైద్యం విషయంలో హైదరాబాదులో యాజమాన్యం ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు కోసం యాజమాన్యంతో చర్చించడం జరిగిందన్నారు. డిస్మిస్ కార్మికుల మళ్లీ అవకాశాలు కల్పించాలని, ఐదు సంవత్సరాలు 100 మస్టర్లు ఉండే విధంగా డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. మారుపేర్ల సమస్యను పరిష్కరించి వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం కోసం యాజమాన్యం అంగీకరించిందన్నారు. గుర్తింపు సంఘంగా కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి కార్మికుల పక్షాన పోరాడుతుంటే ఆరున్నర సంవత్సరాలు టిబిజికెఎస్ గుర్తింపు సంఘంగా అధికారంలో ఉండి స్ట్రక్చర్ మీటింగులు, ఎన్నికలు నిర్వహించకుంటే మాట్లాడని ఇతర సంఘాల నాయకులు ఎఐటియుసిపై విమర్శ చేసే అర్హత లేదన్నారు. రాబోయే రోజులలో ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల ప్రతి సమస్యను నెరవేర్చే దిశగా ఎఐటియుసి పోరాడుతుందని వారు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, గంగసరపు శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్ కార్యదర్శి సదయ్య తదితరులు పాల్గొన్నారు.


## పోరాట ఫలితంగానే ఆస్పత్రి కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల

### ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు

**ప్రజాపక్షం/కల్లూరు :** ఆసుపత్రి కార్మికులకు పెండింగ్ వేతనాలు ఎఐటియుసి పోరాట ఫలితంగానే విడుదల అయ్యాయని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు తెలిపారు. కల్లూరులో ఆదివారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వారం రోజులు క్రితం రోజువారి విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు చేయడంతో ప్రభుత్వం దృష్టికి తెచ్చిన ఎఐటియుసి పోరాట ఫలితంగా వేతనాలు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, ఆసుపత్రులలో పరిధిలో ఉన్న కార్మికులకు, వేతనాలు విడుదలయ్యాయన్నారు. వేతనాలు విడుదల కావడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచుకుంటూ ఎఐటియుసి నాయకులకు ధన్యవాదములు తెలిపారు. రాబోయే రోజుల్లో కనీస వేతనం చట్టం అమలుకు ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు తడికమళ్ళ యోబు, దామాల దయాకర్‌రావుతో పాటు ఆసుపత్రి కార్మికులు ప్రమోదు, వంశీ ,సత్యవతి, నాగమణి, రమాదేవి, మేరీ సరోజిని, లక్ష్మి ప్రసన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## గతపాలనలో 'పంచాయతీ'లు నిర్వీర్యం



### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** గత పదేండ్ల బిఆర్‌ఎస్ హయాంలో తండాలను గ్రామపంచాయతీలుగా మార్పుచేసి నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారన్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆరోపించారు. గ్రామపంచాయతీలకు నిధులు రాక ఎంతోమంది గిరిజన సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఎస్టీ ప్లాన్ నిధులను దారి మళ్లించి పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా సమితి సమావేశం స్థానిక వీరభవన్‌లో లావుడియా రాము నాయక్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై విజయ సారథి మాట్లాడుతూ తండాల్లో ఇప్పటికీ సిసి రోడ్లు, సిసి డ్రైనేజీలు లేక ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్నాట్లు అభివృద్ధి ఉందన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామ పంచాయతీలకు నిధు లు కేటాయించి గిరిజన తండాల్లో ఆదివాసీగూడాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పరచాలన్నారు, గిరిజనులకు ఆదివాసీలకు పోడు రైతులకు హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో నాడు ఆందోళన చేశామని వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆగస్టు 2 న గూడూరు మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా మహాసభను విజయవంతం చేయాలని గిరిజన సమాఖ్య మహబూబాబాద్ జిల్లా అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు పిలుపునిచ్చారు. గిరిజన సమాఖ్య మహబూబాబాద్ జిల్లా మహాసభ ఆగస్టు రెండున గూడూరు మండల కేంద్రంలో జరుగుతుందని వారు తెలిపారు. వందలాదిగా గిరిజనులు, ఆదివాసీలు మహాసభలో పాల్గొనాలని గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లావుడ్యా రామునాయక్, ప్రధాన కార్యదర్శి మాలోతు రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, నాయకులు యాక్య నాయక్ బాలాజీ, బిచ్చు నాయక్, రాము, విజయ్, రాగం మల్లయ్య, బావ్ సింగ్, పెరుగు కుమార్ తదితరులు పాల్గొన్నారు

## వ్యవసాయ కార్మికులపై వివక్ష

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కర్ణకుమార్

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం కార్మికుల పట్ల వివక్ష కొనసాగిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ ఆరోపించారు. పెరిగిన నిత్యావసర వస్తువులతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పాలకవర్గాలు కనీసం స్పందించడం లేదని ఆయన విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం తాటి వెంకటేశ్వర రావు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో కర్ణకుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఎన్‌ఆర్‌జిఎస్ పథకంలో పని దినాలకు కోత విధించడమే కాకుండా రోజు వారి వేతనం సైతం గిట్టుబాటు కాకుండా చేస్తుందని ఆరోపించారు. రోజుకు రూ.600గిట్టుబాటు అయ్యేవిధంగా కనీసం 250 రోజులు పని దినాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా క్రింద ఏడాదికి రూ.12వేలు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిందని ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సైతం జమ చేస్తున్నట్లు ప్రకటించారని కానీ ఇంతవరకు అమలు కాలేదన్నారు. రైతు భరోసా మాదిరి కూలీలకు భరోసా కల్పించే పథకాలు అమలు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంపసాటి వెంకన్న, మేళ్లచెరువు వీరబాబు, పిట్టల రాంబాబు, సింగారపు సత్యనారాయణ, గోగుల ఆది, జిల్లా నాగరాజు, మందా ఈశ్వరమ్మపాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ ఆరోపించారు. ఆదివారం షాద్‌నగర్‌లో మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌కు గురై 70మంది విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారిని పట్టించుకునే నాథులు లేకుండా పోయారని వాపోయారు. గురుకుల పాఠశాలల్లో నిత్యం ఎక్కడో ఒక చోట ఫుడ్ పాయిజన్ అవుతుంటే ప్రభుత్వానికి కనువింపు కావడం లేదని ఆరోపించారు. గురుకుల పాఠశాలల్లో విద్యా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ఫుడ్ పాయిజన్‌కు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకునే వరకు వైద్య సేవలు ప్రభుత్వం అంధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంతో విద్యార్థి సంఘాల నేతృత్వంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.


## హైవేపై లారీలు ఆపితే కఠిన చర్యలు

వనస్థలిపురం సిఐ మహేష్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** జాతీయ రహదారిపై లారీలు ఆపితే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం సిఐ మహేష్ హెచ్చరించారు. ఆదివారం రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఆటోనగర్ లారీ డ్రైవర్లతో మాట్లాడారు. హైవేపై అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా లారీలు ఆపిన సంబంధించిన 12 మంది లారీ డ్రైవర్లపైన కేసు నమోదు చట్టరీత్య చర్యలు తీసుకుంటాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ లారీ యాజమాన్యాలు తమ డ్రైవర్లను తగిన సూచనలు చేయాలని సూచించారు. పార్కింగ్ ఉన్న ప్రదేశంలో మాత్రమే వాహనాలు ఆపాలని, రోడ్లపై పార్కింగ్ చేస్తే చర్యలు ఉంటాయన్నారు.

## విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** విద్యార్థులు విద్యా పట్ల ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపకుడు కొండ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం చందానగర్ హుడా కాలనీలో బిటెక్ విద్యార్థిని మనీషాతో పాటు మరో 4గురు విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హోఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్‌తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు 75,000 వెల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు బర్క మల్లేష్, బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సాంబశివ రావు, గాలి కృష్ణ, రెడ్డి ప్రవీణ్ రెడ్డి, దాసరి రాజశేఖర్ పాల్గొన్నారు.

## అన్నదానం అభినందనీయం



**ప్రజాపక్షం/శంషాబాద్ :** భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నెపు ప్రభు తన తల్లి నీలమ్మ 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థంగా అన్నెపు ప్రభు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.యాదగిరి, మండలకార్యదర్శులు నర్రగిరి నందిగామ, గడ్డం జంగయ్య, ఎస్.మల్లేష్, ఎఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.సహకరించినవారిలో ఎల్.అరుణ్, శ్రీనివాస్ చారి,నీరటి శ్రీనివాస్ ముదిరాజ్, దేవులపల్లి ఉదయ్ రాజ్, కావాలి మల్లేష్, శ్రీను నాయక్, పతేంగే ప్రశాంత్,సతీష్ తదితరులు.పాల్గొన్నారు.

## నాణ్యమైన సేవలు అందించాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి అభిరుచికి నాణ్యమైన నగలను అందిస్తూ కస్టమర్ల అభిరుచిని పోందుతూ మరిన్ని బ్రాంచిలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కొండాపూర్ డివిజన్ పరిధీలో గల శ్రీరామ్‌నగర్‌లో నూతనంగా ఆర్ఆర్ జ్యువెలర్స్ షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమిద్ పటేల్, సీనియర్ నాయకులు చాంద్‌పాషాలు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బలరామ్ యాదవ్, గంగాధార్, తిరుపతి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/కొత్తూరు:** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం కొత్తూరు మండల కేంద్రం సమీపంలోని ప్యాపిరోస్పోర్ట్‌లో షాద్‌నగర్ నలంద జూనియర్ కళాశాలకు చెందిన 1999–2001 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సిల్వర్ జూబ్లీని నిర్వహించారు. అప్పటి అధ్యాపకులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వీరభద్రం, వెంకటరమణ, పూర్వ విద్యార్థులు వెంకటదాస్, శేఖర్, సుధారాణి, రాధా, వేణి, ముంతాజ్, జగదీశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సంతోష్, వీరేందర్, గిరిబాబు, గోవర్ధన్, హరిశ్వర్‌రెడ్డి, పవన్, రాఘవేందర్‌లు పాల్గొన్నారు.

## నేడు కొత్త రేషన్ కార్డులు పంపిణీ

**ప్రజాపక్షం/షాబాద్ :** షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ మధు ఆదివారం ఒ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని ప్రజలకు కొత్త రేషన్ కార్డులు పంఫిణి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల కొత్త రేషన్ కార్డు లబ్దిదారులు రావాలని వివరించారు.

# చట్టాలను అందరూ గౌరవించాలి

ఐజి రమేష్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజంలో మన కోసం తయారు చేసుకున్న నియమాలను, చట్టాలను అందరం కలిసికట్టుగా గౌరవించాలని ఐజి. రమేష్ అన్నారు. జాతీయ తెలుగు సరస్వత పరిషత్, తెలంగాణ పోలీస్ శాఖ, జ్యోతి పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మసబ్ ట్యాంక్‌లోని పోలీస్ ఆఫీసర్స్ మెస్‌లో 'పోలీసులు సామాజిక బాధ్యత' అనే అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐజి రమేష్ మాట్లాడుతూ 'ఖాకీ చొక్కా' పదంలో ఖాక్ అంటే మట్టి అర్థం అని, ఆ భూమాతకు ఉన్నంత ఓపిక, సహనం పోలీసులకు ఉంటుందన్నారు. చట్టాల అమలుకు పోలీసులు, ప్రజలందరూ సమిష్టిగా పని చేయాలని కోరారు. రోడ్డు భద్రతా నియమాలను మనం అందరం పాటించాలని సూచించారు. బెట్టింగ్ యాప్‌లు సమాజాన్ని ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా దెబ్బ తీస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు కలిసి యువతను ఈమాయాజాలం నుంచి దూరంగా ఉండేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఇందుకు నియంత్రణలు, అవగాహన కార్యక్రమాలు, కవితల ద్వారా ప్రజలను జాగృతం చేయాలన్నారు. విద్వేషాల పట్ల మన సమాజం దూరంగా ఉండాలన్నారు. సమాజంలో ప్రేమ, అనురాగాలను పెంపొందించడంలో సాహిత్యం ప్రముఖ పాత్ర పోషిస్తుందని తెలిపారు. కవిత్వం నుండి జాలువారే సుభాషితాలు నేటి సమాజాన్ని నడిపిస్తున్నాయన్నారు. కవులు, రచయితలు సామాజిక సమస్యల పట్ల తమ కలాన్ని ఝులిపించాలని, గళాన్ని వినిపించాలని కోరారు. కార్యక్రమంలో సభకు అధ్యక్షత తెలుగు సరస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేశి రాజు రాంప్రసాద్, కలిదిండి విశ్వనాథ రాజు, ముఖ్య కార్యదర్శి చంద్రహాస్, నాంపల్లి వెంకట సాయి, జ్యోతి తెలుగు దినపత్రిక సిఇఒ కె. సుధీర్, విద్య వెంకట్, శ్యామల రాజు, హేమసుందర్, సముద్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి దేవాలయానికి స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తా

గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ తల్లి దేవాలయానికి స్థలం కేటాయించేలా కృషి చేస్తానని గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ తల్లి దేవాలయం కూల్చివేయడంతో స్థానిక బస్తి వాసులు, ప్రజలు ఆదివారం మేయర్‌ను ఆమె నివాసంలో కలిశారు. దేవాలయాన్ని రెవెన్యూ శాఖ వారు కూల్చివేసిన విషయాన్ని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ దేవాలయం విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దు అన్నారు. అమ్మవారి విగ్రహం ప్రతిష్ట తర్వాత తొలగించడం బాధాకరమన్నారు. కూల్చిన చోటనే అమ్మవారి దేవాలయం కోసం ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి స్థలాన్ని ఇప్పిస్తానని బస్తివాసులకు మేయర్ హామీ ఇచ్చారు.



## వీరజవాన్ల త్యాగాలు మరవొద్దు

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ల త్యాగాలను మరిచిపోలేనివని ఎబివిపి జాతీయ మాజీ అధ్యక్షులు, ప్రొఫెసర్ మురళీ మనోహర్ అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని భాగ్యశ్రీ పంక్షన్ హాల్‌లో బిజెవైయం రంగారెడ్డి జిల్లా అర్బన్ నాయకులు గారెల్ల శ్రావణ్‌గౌడ్, సాయిరాం రాకేష్, సుమన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రొఫేసర్ మురళీ మనోహర్ ముఖ్యఅతిధిగా హాజరై బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్‌బినగర్ పార్టీ కన్వీనర్ కొత్త రవిందర్‌గౌడ్, కార్పోరేటర్‌లు బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళిలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తి ఉండాలని, యువత ఈ త్యాగాల నుండి స్ఫూర్తి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్త, డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జెసి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్ ల అర్హత పరీక్షకు సంబంధించి ఆదివారం శంషాబాద్ పాలమాకులలోని పిఎంఎస్‌హెచ్ఆర్ఐ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి, అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆమె సూచించారు. అర్హత పరీక్షకు 403 మంది అభ్యర్థులకు గాను 329 మంది హాజరయ్యారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా సర్వే అండ్ ల్యాండ్స్ అధికారి కె.శ్రీనివాస్,రాజేంద్రనగర్ ఆర్‌డిఒ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ దత్, తదితరులు ఉన్నారు. బాలాపూర్ మండలం జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన గ్రామ పాలన అధికారి పరీక్షా కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఏవో సునీల్ లు తనిఖీ చేశారు. వీరి వెంట మండల తహసీల్దార్ ఇందిరా దేవి ఉన్నారు. గ్రామ పాలన అధికారి పరీక్షకు 111 అభ్యర్థులకు గాను 101 మంది హాజరు కాగా, 10 మంది గైర్హాజరయ్యారు.

## బిసిలు ఆర్థికంగా రాణించాలి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** బిసిలు ఆర్థిక, రాజకీయంగా రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిసిసేన పట్టణ అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మి గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు సదాశివ కాలనీలో నూతన మహిళా కమిటిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాటం భాగ్యలక్ష్మి గౌడ్ మాట్లాడుతూ బిసి మహిళల్లో చైతన్యం వస్తనే అన్ని రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహిళా కమిటీ అధ్యక్షురాలుగా వడ్ల సుకన్య, ఉపాధ్యక్షురాలిగా గాండ్ల రజిత, ప్రధాన కార్యదర్శిగా లతగౌడ్, కార్యదర్శిగా భార్గవి, కోశాధికారిగా అరుణ గౌడ్‌తోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షురాలు అరుణ రాములు గౌడ్‌లు పాల్గొన్నారు.

**నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం...**ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి బిసిసేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ ఆర్థిక సహాయం చేశారు. ఆదివారం నందిగామ మండల కేంద్రానికి చెందిన సప్పిడి నరసింహులుమృతిచెందగా వారి కుటుంబానికి రూ.7వేలు ఆర్థిక సహాయం చేశారు. నర్సింలు కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



## ఆగస్టు 2న సిపిఐ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/షాబాద్ :** ఆగస్టు 2న సిపిఐ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం అన్నారు. ఆదివారం చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని మొహినాబాద్‌లో మహా సభల ఏర్పాటుకు విరాళాలు సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా 17వ సిపిఐ మహా సభలను మొహినాబాద్‌లోని అంజలి గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజల నుండి విరాళాలు సేకరించి ప్రజల చైతన్యం కోసం సిపిఐ మహా సభలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు అండగా సిపిఐ పార్టీ పని చేస్తుందని ప్రజలు నమ్మకంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీను, సీనియర్ నాయకులు సుధాకర్‌గౌడ్ ఉన్నారు.



# రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి




ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మదర్ తెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో సుధీర్‌రెడ్డి నివాసంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చేపూరి శంకర్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, రక్త దానం చేసిన ప్రతి ఒక్కరూ ప్రణాదాతులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తిలక్ రావు, నాయకులు అమర్నాథ్‌రెడ్డి, హరికృష్ణ, రాఘవేంద్ర రావు, శేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, హుస్సేన్, శరత్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

### ఘనంగా ఎల్ బినగర్ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

**హయత్‌నగర్ :** ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మన్సూరాబాద్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, షూస్‌ను దేవిరెడ్డి కమల సుధీర్‌రెడ్డి, మాజీకార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డిల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో దేవిరెడ్డి ప్రితంరెడ్డి, జగదీష్‌యాదవ్, నర్రి వెంకన్న, రాంచంద్రారెడ్డి, రుద్ర యాదగిరి, సాయిగౌడ్ అఖిల్ యాదవ్, విజయభాస్కర్‌రెడ్డి, రవి, నర్సింహాగౌడ్, చంద్రమోహన్, నర్సింహా, శ్రీధర్, శివ,శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా బోనాలు



పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆదివారం మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ హాజరయ్యారు. ఆయా దేవాలయాలలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతలకుంట, హస్తినాపురం, సాహెబ్ నగర్, హయత్ నగర్ తదితర ప్రాంతాలలో నిర్వహించిన బోనాల వేడుకలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, టిపిసిసి కార్యదర్శి గజ్జి బాస్కర్‌యాదవ్, డిసిసి అధికార ప్రతినిధి బద్రీనాథ్, డివిజన్ అధ్యక్షులు దెంది శశిధర్ రెడ్డి, చెన్నగోని రవీందర్, పార్వతి, గణేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కొండోజు శ్రీనివాస్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మహేందర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

**బిఎన్‌రెడ్డి నగర్‌లో...** బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి అశీర్వాదం ఎల్లవేళా ప్రజలందరిపై ఉండాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని నిర్వహించిన కాలనీలల్లో సాహెబ్ నగర్ పొచమ్మ ఎల్లమ్మ దేవాలయం, పద్మావతి కాలనీ, శ్రీనివాస కాలనీ, భవాని ఎంక్లేవ్ కాలనీల్లో కాలనీ వాసులు నిర్వహించిన బోనాల పండుగ ఉత్సవాలల్లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీదర్ రావు, విష్ణువర్ధన్ రెడ్డి, గంగం శివశంకర్, యంజాల బిక్షపతి కాలనీ వాసులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


**సరూర్‌నగర్ :** శ్రీ పోచమ్మ తల్లి దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని టిపిసిసి సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో యువజన కాంగ్రెస్ నాయకులు నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో దేప భాస్కర్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, జనరల్ సెక్రటరీ ఇమ్రాన్‌అలీ, కాలముల సంతోష్, కళ్యాణ్‌యాదవ్, యూనుస్, భార్గవ్ గౌడ్, రవలి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

**తుర్కయంజాల్ :** ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్ ఆకాంక్షించారు. ఆదివారం బోనాల పండుగను పురస్కరించుకొని ఇంజాపూర్, సుందరయ్య కాలనీ లలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తయారు చేసిన బోనం ను ఎత్తుకొని డబ్బు దరువుల నడుమ శివసత్తుల పూలకాలతో అలరిస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనం సమర్పించి మోక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు


**హయత్ నగర్ :** మన్సూరాబాద్,హయత్ నగర్ డివిజన్‌లో ప్రజలు బోనాల పండుగా పురస్కరించుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల వేడుకలలో జిహెచ్‌ఎంసి కార్పొరేటర్‌లు కళ్లెం నవ జీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. హరీష్ రెడ్డి, శ్రీనివాస్ సాయి గౌడ్ శ్రీధర్ గౌడ్, నాయకులు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** నియోజక వర్గం ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆకాక్షించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో జరిగిన బొంగ్రాయి 3వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హజరై బొంగ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీల చైర్మన్‌లు చిలుక మదుసూధన్‌రెడ్డి, కె.గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, నాయకులు మంఖాల దాసు, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.











# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్
GREATER HYDERABAD

## విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మేడ్చల్ జిల్లాలో విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందాయి. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి అసోసియేషన్ కాలనీలో రైతులకు చెందిన రెండు గేదెలు మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రసారిత వైర్ల కింద పక్క పక్కనే పడిపోయాయి. దీంతో విద్యుద్ఘాతానికి గురైన ఆ రెండు గేదెలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వాటి యజమానులైన రైతులు గగ్గోలు పెట్టారు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## జీనోమ్‌వ్యాలీ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం




ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట మండలం తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా విచ్చేసిన ఇన్‌స్పెక్టర్ గురువయ్యను శామీర్‌పేట మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సామాన్య ప్రజల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని నూతనంగా విచ్చేసిన సిఐ గురువయ్యను నర్సింగరావు కోరారు. శాంత భద్రతలపై తగు చర్యలు తీసుకుంటామని సిఐ గురువయ్య తెలిపారు.

## మురికి గుంతతో దుర్వాసన



ప్రజాపక్షం/శామీర్‌పేట : అలియాబాద్ మున్సిపాలిటీలోని మల్లన్న గుడి సమీపంలో మురికి గుంతలో నీరు నిలవ ఉండటం వలన దుర్వాసన వస్తుందని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. కుంట సత్యనారాయణ ఇంటి సమీపంలో మిషన్ భగీరథ నిమిత్తం తీసిన గుంతలో మురికి నీరు నిండిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో చుట్టు పక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు తీసిన గుంత పూడ్చకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని గ్రామస్థులు అంటున్నారు. మున్సిపాలిటి కమిషనర్ వెంటనే స్పందించి గుంతను పూడ్చి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి




ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో అవుషాపూర్ గ్రామంలో బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం సామాన్య స్థాయి నుండి వచ్చిన వ్యక్తి ఆయన ఆలోచనలు ఇప్పటికీ యువతరాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు స్ఫూర్తిని స్తాయి ఆయన తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారని అబ్దుల్ కలాం ఎనలేని సేవల ద్వారా దేశాన్ని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చీమల భాను యాదవ్, కొలిచెలిమి సత్యనారాయణ,ఊదరి కృష్ణ యాదవ్, ఏనుగు లక్ష్మారెడ్డి, ముద్దం లక్షణ్ యాదవ్, ఏనుగు సదానంద రెడ్డి, చిలుకమారి మహేష్, సాయిలు, ఏనుగు రఘురాం రెడ్డి,కాసుల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్




ఘనంగా సన్మానించిన శామీర్‌పేట సిఐ శ్రీనాథ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : నిజాయితీతో వ్యవహరించే ప్రతి ఒక్కరిని పోలీస్ శాఖ గౌరవిస్తుందని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. శనివారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలోఆటో డ్రైవర్ నంద కిషోర్ తన ఆటో(టిఎస్36టిఎ3028)లో ప్రయాణించిన ఓ మహిళా తన హ్యాండ్ బ్యాగును మరిచిపోయింది. ఆటో డ్రైవర్ నిజాయితీతో వ్యవహరించి వెంటనే శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సిఐ శ్రీనాథ్‌కు అప్పగించారు. దీంతో ఇన్స్‌పెక్టర్ సత్వరమే విచారణ జరిపి అల్వాల్‌కు చెందిన నల్లగళ్ల రాణి హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకుందని గుర్తించి బ్యాగును ఆదివారం అందజేశారు. బ్యాగులో విలువైన వస్తువులు, ఫోన్, నగదు పోయాయని తిరిగి అప్పగించిన పోలీసులకు, ఆటో డ్రైవర్‌కు రాణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనాథ్ మాట్లాడుతూ సమాజాంలో మానవత్వం ఇంకా మిగిలి ఉందని ఇలాంటి వారిని చేస్తే అర్థం అవుతుందన్నారు. అనంతరం ఆటో డ్రైవర్ నంద కిషోర్‌ను సిఐ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఐ రాజు, ఎస్ఐ దశరథ, పోలీసులు పాల్గొన్నారు.

## ఘనంగా 'గ్రాడ్యుయేషన్ డే'




ప్రజాపక్షం/నిజాంపేట్ : ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిఆర్డిఓ యు.రాజబాబు డాక్టర్.సుబ్బారావు పావులూరి, రామగురువు శ్రీ వెంకట సింహాద్రి, దగ్గుబాటి సురేష్‌బాబు, కోడె దుర్గ ప్రసాద్‌లు పాల్గొన్నారు. పట్టాను పొందే అర్హత సాధించిన సుమారు 1700 విద్యార్థులు వారు చేసిన ప్రతిభను గుర్తిస్తూ 33 మంది విద్యార్థులకు బంగారు పతకాలను యాజమాన్యం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి భవిష్యత్ సాధించడంలో సంకల్పన ముఖ్యమని ఉద్యోగాలు తెచ్చుకుని పేరుకు మాత్రమే ఇంజనీర్‌గా ఉండిపోకుండా సమస్యలు పరిష్కరించే ఇంజనీర్‌గా ఉండాలని, అందరికీ ఎదిగే అవకాశం పుష్కలంగా ఉన్నాయని, రానున్న రోజుల్లో పట్టభద్రులకు ఎన్నో అవకాశాలుగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా బిసిలు ఐక్యంగా ఉద్యమించాలి

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

మహాసభ పోస్టర్‌లను ఆవిష్కరించిన ఎంపిలు ఈటల రాజేందర్, అసదుద్దీన్ ఒవైసీ, వద్దిరాజు రవిచంద్ర



ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశంలోని బిసిలంతా రాజకీయలకు అతీతంగా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆగస్టు 7న గోవాలో జరిగే జాతీయ ఒబిసి మహాసభను జయప్రదం చేయడం ద్వారా బిసిల ఐక్యతను దేశానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న గోవాలో జరిగే 10వ జాతీయ ఒబిసి మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ బిజెపి లోక్‌సభ సభ్యులు ఈటల రాజేందర్, ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఒవైసీ, బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బిసి ప్రతినిధులతో మహాసభల వాల్ పోస్టర్‌ను వేర్వేరుగా వారి కార్యాలయాలు, నివాసాల వద్ద ఆవిష్కరించారు. మహాసభలకు హాజరుకావాలని ఈటల రాజేందర్, అసదుద్దీన్ ఓవైసీ, ఎంపి ఒద్దిరాజు రవిచంద్రలను స్వయంగా కలిసి, మహాసభలకు అతిథులుగా హాజరుకావాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆహ్వాన పత్రికలను అందచేశారు. అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా రాజ్యాంగ పరంగా న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసం పోరాడుతున్నందున దేశవ్యాప్తంగా బిసిలకు మంచి రోజులు రానున్నాయని ఈటల రాజేందర్, అసదుద్దీన్ ఓవైసీ, ఒద్దిరాజు రవిచంద్రలు అన్నారన్నారు. బిసిల చైతన్యం కోసం నిరంతరం బిసి సంఘాల చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారన్నారు. ఈ చైతన్యాన్ని ఇదే విధంగా ముందుకు కొనసాగించి, బిసిలు తాము కోల్పోతున్న హక్కులు సాధించుకోవాలని, జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో తమ వాటాను సాధించుకోవడం కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా అందరితో కలిసి ముందుకు సాగాలని ముగ్గురు ఎంపిలు సూచించారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆగస్టు 7న గోవా రాష్ట్రంలోని డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో జరిగే జాతీయ 10 మహాసభలకు దేశం నలుమూలల నుండి హాజరై బిసిల ఐక్యతను చాటాలని, ఒబిసి మహాసభలకు తాము కూడా హాజరు అవుతామని ముగ్గురు ఎంపిలు తెలిపారన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేషాచారి, మహాత్మ జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, జాజుల లింగం గౌడ్, పాలకూరి కిరణ్, నాగరాజు గౌడ్, గణం నరసింహ, ఇంద్రం రజక, పవన్ సాయి గౌడ్, బండి గారి భరత్ పాల్గొన్నారు.

## మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

15 రోజుల్లో 198 మంది ఆకతాయిలు అదుపులోకి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొంటున్నామని, బాధితులు తమకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. బాధితులు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో నేరుగా కానీ డయల్ 100 ద్వారా కానీ, దీని కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీటీమ్స్‌కు కేటాయించిన 8712662111 ద్వారా కానీ ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. విద్యాసంస్థలు, బస్‌స్టాపులు, ప్రధాన కూడళ్ల ప్రాంతాల్లో షీ టీమ్స్ బృందాలు మఫ్టీలో సంచరిస్తూ ఆకతాయిలను గుర్తించేందుకు డకాయి ఆపరేషన్లు చేస్తూ వారిని సాక్ష్యాధారాలతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని న్యాయస్థానంలో హాజరుపరచటం, వారిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నామని తెలిపారు. దీంతో పాటు మహిళలు పని చేసే తమ సంస్థల్లో ఎప్పుడైనా వేధింపులకు గురైతే ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తామన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు ఎల్‌బినగర్‌లోని రాచకొండ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ఈ నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు తమకు యువతులను, మహిళలను వేధిస్తున్న 198 మందిని(మేజర్స్ 83, మైనర్లు 115) పట్టుకొని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి ఉషారాణి మాట్లాడుతూ వేధింపులకు సంబంధించి తమకు వచ్చిన 229 ఫిర్యాదుల్లో 40 ఫోన్ సమాచారం ద్వారా, నేరుగా వేధించినవి 104, సోషల్ మీడియా ద్వారా వేధించినవి 85 ఉన్నాయని తెలిపారు. మహిళ నిర్వహిస్తున్న ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తూ తనను పని నుండి తీసేసారన్న కోపంతో అసభ్యకర మెసేజ్‌లు, ఫోటోలు పంపుతూ వేధిస్తున్న నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసామన్నారు. మెట్రో స్టేషన్‌లో పని చేసే ఓ వివాహితను సహచర ఉద్యోగి ప్రేమ పేరిట వేధిస్తున్నాడన్న ఫిర్యాదుతో నిందితుడిని కటకటాల వెనక్కు పంపామని తెలిపారు. ఈ నెలలో కమిషనరేట్ పరిధిలో 73 అవగాహనా సదస్సులు నిర్వహించి 14175 మందికి మహిళా చట్టాలు, వారి హక్కులు, నేరాల, అప్రమత్తత గురించి వివరించామన్నారు.

## ప్రాజెక్టులు, చెరువుల వద్దకు వెళ్లొద్దు

కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ : భారీ వర్షాల వలన ప్రజలు ఎవ్వరు కూడా ప్రాజెక్టులు ,చెరువుల దగ్గరకు వెళ్ళరాదని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అదివారం వికారాబాద్ మండల పరిధిలోని సర్పంన్‌పల్లి ప్రాజెక్టును జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు యొక్క నీటి మట్టం ఎన్ని ఫీట్ల లోతు ఉందని పూర్తి వివరాలు అడగగా 0.25 కెపాసిటీ ఉందని ఫీట్ల నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టు నిండుతుందని తెలిపారు. ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా, క్రింది భాగం వాటర్ ఫ్లో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. చుట్టూ పక్క గ్రామాల వారు ప్రాజెక్టు సమీపంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ ఇఇ మధుసూధన్‌రెడ్డి నరేందర్ పాల్గొన్నారు.

**గ్రామ పాలన అధికారుల, లైసెన్స్ సర్వేయర్ల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

అదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రామపాలన అధికారుల, లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు కొనసాగింది, గ్రామపాలన అధికారులు పరీక్షకు 83మంది అభ్యర్థులకు గాను 66మంది హాజరయ్యారని తెలిపారు. 17మంది గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించిన మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించారు. ఇందులో 139 అభ్యర్థులకుగాను 121మంది హాజరయ్యారని 18మంది గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డిఓ వాసుచంద్ర డిటిడిఓ కమలాకర్‌రెడ్డి, రాజేశ్వరి, తహసీల్దార్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ జైపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/శామీర్‌పేట : ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు మేలు జరుగుతుందని, ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో న్యూకాలనీ యూత్ ఆధ్వర్యంలో జీవికే గ్రీన్ హెల్త్ ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారుగా 72 మందికి బీపి, షుగర్, థైరాయిడ్ లాంటి పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రజలకు అందుబాటులో వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణి చేసినందుకు జీవికే గ్రీన్ హెల్త్ ఆస్పత్రికి, న్యూకాలనీ యూత్‌కు బీమిడి జైపాల్‌రెడ్డి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి కౌన్సిలర్ నర్సింగరావు, ఆర్గనైజర్ కౌడె రూప్‌కిరన్, న్యూకాలనీ యూత్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆ 27 కులాలను బిసి జాబితాలో చేర్చాలి

సిఎం రేవంత్‌రెడ్డికి మీరాకుమార్ విజ్ఞప్తి




ప్రజాపక్షం/ఖైరతాబాద్ : గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిఒ.నం.3 ద్వారా తొలగించబడిన 27 కులాలను తిరిగి బిసి జాబితాలో చేర్చాలని తెలంగాణ 27 కులాల బిసి అసోసియేషన్ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిం ది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ అధ్యక్షులు జి.మీరాకుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.నాయుడు, గౌరవాధ్యక్షులు జి.లక్ష్మి నారాయణ మీడియాతో మాట్లాడారు. 11 ఏండ్లుగా తమ 27 బిసి కులాల విద్యార్థులు రిజర్వేషన్ కోల్పోవడంతో విద్య, ఉద్యో గాలలో తీవ్ర నష్టపోయారని వాపోయారు. 2014లో బిఆర్ఎస్ (అప్పుడు టిఆర్ఎస్) ప్రభుత్వం తెచ్చిన జిఒ 3 రాజ్యాంగ విరుద్ధమన్నారు. తమకు జరిగిన అన్యాయంపై కమిషన్ వేయాలని సుప్రీంకోర్టు, రాష్ట్రపతి , ప్రధానిని కలుస్తామని తెలిపారు. ఉమ్మడి ఎపిలో 75 ఏండ్లుగా ఈ 27 కులాలు రిజర్వేషన్లు పొందుతూ వచ్చాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే జిఒ నం.3 రద్దు చేసి, ఈ విద్యాసంవత్సర ప్రారంభంలోనే ఈ 27 కులాలను బిసి జాబితాలో చేర్చి, రిజర్వేషన్లు అమలు చేయాలని వారు కోరారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్స్ జి.లక్ష్మీ నారాయణ, ఎల్.వెంకటరాజు, సలహాదారులు కె.ఎస్.మూర్తి, విత్తనాల భాస్కర్‌రావు, ఆళ్లసూరి అప్పారావు, రమ్యశ్రీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయానికి స్పీకర్ శంకుస్థాపన

ప్రజాపక్షం/వికారాబాద్ : వికారాబాద్ పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌లో నూతనంగా నిర్మించే పెద్దమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/దోమ: పరిగి నియోజకవర్గంలోని దోమ మండల నూతన ఎస్ఐగా అదివారం వంత్ పదవి బాధ్యతలు స్వీకరించారు. దోమ ఎస్ఐగా విధులు నిర్వహించిన అనంద్‌కుమార్ బదిలీపై వెళ్లగా నూతన ఎస్ఐగా వసంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ అందజేత



ప్రజాపక్షం/దోమ : పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘువేందర్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రోసిడింగ్ అందజేసి ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రోసిడింగ్ అందజేసినట్లు తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నాణ్యతతో ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## కాగ్నా నది బ్రిడ్జికి భారీ రంధ్రం



పరిశీలించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూర్: తాండూర్–కొడంగల్ మార్గంలోని కాగ్నా నది కొత్త బ్రిడ్జికి భారీ రంధ్రం ఏర్పడిన నేపథ్యంలో ఆదివారం సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, సబ్ కలెక్టర్‌తో ఉమా శంకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన కాగ్నా నది కుంగిపోయిందని అన్నారు. నది బ్రిడ్జిపై భారీ రంధ్రం ఏర్పడడం విచారకరమన్నారు. 3 సంవత్సరాలకే బిడ్జికి రంధ్రం ఏర్పడటం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పాడ్డాయి. 16 కోట్లతో నిర్మించిన ఈ వంతనపై భారీ రంధ్రం ఏర్పడంతో కాసులకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్ నాణ్యత పాటించలేదని అన్నారు.

**కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి**
**సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండుత్**

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వంతెన కుంగిపోవడంపై జిల్లా కార్యదర్శి తీవ్రంగా ఖండించారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కమీషన్ల కోసం పని చేసిన పాలకులు నిర్మాణంలో నాణ్యత పాటించలేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## హిందీ ప్రచార సభ హైదరాబాద్ అభివృద్ధికి సహకరిస్తాం



ప్రతినిధుల బృందానికి పలువురు కేంద్రమంత్రుల హామీ

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఆదివారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్‌షాను, నితీన్ గడ్కరీని, కె.రామ్మోహన్‌నాయుడులతో వేర్వేరుగా భేటీ అయింది. ఈ సందర్భంగా హిందీ ప్రచార సభ కార్యక్రమాలను సభ ప్రతినిధులు వివరించారు. హిందీ ప్రచార సభ స్థాపించి, 90ఏండ్లు అయిందని, ఇప్పటివరకు హిందీ ప్రచార సభ పరీక్షల ద్వారా లక్షల మంది విద్యార్థులు హిందీ భాష నేర్చుకొన్నారని వారు కేంద్రమంత్రులకు తెలిపారు. ఈ సందర్భంగా ప్రచార సభ ప్రతినిధులను కేంద్రమంత్రులు అభినందించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా హిందీ పోటీ పరీక్షల బ్రోచర్‌ను కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ న్యాయ సలహాదారులు జె.వెంకట రామనరసింహ రెడ్డి, ఎపి హిందీ ప్రచార సభ అధ్యక్షులు సి.ఎల్.నాయుడు, సభ్యులు రమాదేవి, రవిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రీల్



# అన్నపూర్ణ స్టూడియోలో 'మైసా' సందడి

పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందాన ప్రధాన పాత్రలో 'మైసా' సినిమా పూజ కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభమైంది. అన్న పూర్ణ స్టూడియోలో జరిగిన ఈ షూటింగ్ ప్రారంభోత్సవంలో ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు క్లాప్ కొట్టారు. ఈ సినిమాకు రవీంద్ర పుల్లే ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇచ్చాను హను రాఘవపూడి దగ్గర పని చేశారు. దీన్ని లేడి ఓరియంటెండ్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. అజయ్, అనిల్ సయ్యపురెడ్డి కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శ్రేయాస్ కృష్ణన్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్న ఈ సినిమాను యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో నిర్మిస్తున్నామని నిర్మాతల్లో ఒకరైన అజయ్ తెలిపారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ను విడుదల చేశామని, ఆ పోస్టర్ కు మంచి స్పందన లభించిందని అన్నారు. ఇప్పటివరకు రష్మిక హీరోలతో కలసి చేసిన సినిమాలోని పాత్రల కన్నా ఇందులో చాలా పవర్ ఫుల్ పాత్రను రష్మిక పోషిస్తోందని దర్శకుడు చెప్పారు. యాక్షన్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ సినిమా అని ఆయన అన్నారు. రష్మిక మందాన మాట్లాడుతూ ఇప్పటివరకు చేసిన సినిమాల కన్నా ఇది పూర్తి భిన్నమైన కథ అన్నారు. ఇంతవరకు ఇలాంటి క్యారెక్టర్ చేయలేదన్నారు. ఫస్ట్ టైం యాక్షన్ ఫైట్స్ కూడా చెయ్యబోతున్నా అని చెప్పారు. దర్శకుడు చెప్పిన కథ చాల బాగా నచ్చిందని తెలిపారు.

# 'కింగ్డమ్' ట్రైలర్ విడుదల



తెలుగులో రూపొందుతోన్న భారీ చిత్రాల్లో 'కింగ్డమ్' ఒకటి. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానున్న 'కింగ్డమ్' తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది. తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్ లో 'కింగ్‌డమ్' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'గత సంవత్సర కాలంగా 'కింగ్డమ్' గురించి ఆలోచిస్తున్నాను. నాకు ఒక్కటే అనిపిస్తుంది. మన తిరుపతి ఏడుకొండల వెంకన్న స్వామి నా పక్కనుండి నడిపిస్తే.. చాలా పెద్దోడిని అయిపోతాను. ఎప్పటిలాగే ఈ సినిమాకి కూడా ప్రాణం పెట్టి పనిచేశాను. దర్శకుడు గౌతమ్, సంగీత దర్శకుడు అనిరుధ్, నిర్మాత నాగవంశీ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే అందరూ కూడా ప్రాణం పెట్టి పనిచేశారు. ఇప్పటికీ పనిచేస్తూనే ఉన్నారు. ఆ వెంకన్న స్వామి దయ, మీ అందరి ఆశీస్సులు ఉంటే. ఈ సినిమాతో ఘన విజయం సాధిస్తాను. 31న థియేటర్లలో కలుద్దాం అని అన్నారు.

# 'వన్ వే టికెట్' షురూ



హీరో వరుణ్ సందేశ్ తాజాగా మరో చిత్రం షూటింగ్ ప్రారంభించారు. 'వన్ వే టికెట్' పేరుతో వరుణ్ సందేశ్ హీరోగా కుష్బూ చౌదరి హీరోయిన్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఆదివారం ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ క్లాప్ కొత్తగా, ధమాకా దర్శకుడు నక్కి త్రినాధరావు కెమెరా స్విచాన్ చేశారు. బలగం సినిమా నిర్మాత హర్షిత్ రెడ్డి స్క్రిప్ట్ ను అందజేశారు. మనోజ్ నందన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుననుండి. వైవిధ్యమైన కథతో థ్రిల్లర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని హీరో వరుణ్ సందేశ్ చెప్పారు.


# డైలాగ్ కింగ్ నటనకు 50 ఏళ్ళు



విలక్షణ నటుడు సాయి కుమార్ పేరు వింటే ఎన్నో అద్భుతమైన డైలాగ్లు మన కళ్ల ముందు మెదులుతాయి. హీరోగా, విలన్‌గా, కారెక్టర్ ఆర్టిస్ట్‌గా, డబ్బింగ్ ఆర్టిస్టుగా ఎన్నో అద్భుతమైన చిత్రాలతో దక్షిణాది సినీ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. జూలై 27 ఆయన 65వ పుట్టిన రోజు ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాదితోనే ఆయనకు నటుడిగా 50 ఏళ్లు నిండాయి. ఈ 50ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో గొప్ప చిత్రాలతో మెప్పించిన సాయి కుమార్ ఈ ఏడాది బ్లాక్ బస్టర్ ప్రాజెక్ట్‌లతో బాక్సాఫీస్ వద్ద సందడి చేశారు. 1975 జనవరి 9న 'దేవుడు చేసిన పెళ్లి' చిత్రంతో నటుడిగా అరంగేట్రం చేశారు. ఆచిత్రం కూడా సంక్రాంతికి విడుదలై అప్పట్లో సంచలనం సృష్టించింది. నటుడిగా 50 వ ఏటలోకి అడుగు పెట్టిన సాయి కుమార్ ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' అనే చిత్రంలో నటించి మెప్పించారు. ఆ సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇక ఇదే ఏడాది సాయి కుమా ర్ ప్రధాన పాత్రను పోషించిన 'కోర్ట్' మూవీ కూడా భారీ విజయాన్ని సా ధించింది. కొత్త తరం ఆర్టిస్టులు వస్తున్నా, గట్టి పోటీ ఏర్పడినా.. నటుడిగా 50 ఏళ్లు గడిచినా కూడా సాయి కుమార్ ఇప్పటికీ చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ.. ప్రతీ సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. ప్రస్తుతం ఆయన సాయి ధరమ్ తేజ్ 'సంబరాల ఏటిగట్టు', నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తిక్', కిరణ్ అబ్బవరం 'కే ర్యాంప్', అల్లరి నరేష్ '12ఏ రైల్వే కాలనీ', 'ధర్మస్థల నియోజకవర్గం', 'రాజాధి రాజా', కోన వెంకట్‌తో ఓ సినిమా, ఎస్వీ కృష్ణారెడ్డితో మరో చిత్రం ఇలా ఫుల్ బిజీగా ఉన్నారు.
సాయి కుమార్ కేవలం తెలుగు ప్రాజెక్టులతోనే కాకుండా కన్నడ, తమిళ చిత్రాలతోనూ సందడి చేస్తున్నారు. కన్నడలో 'చౌకీదార్', 'సత్య సన్నాఫ్ హరిశ్చంద్ర', శివ రాజ్ కుమార్ తో ఒక సినిమా చేస్తున్నారు. తమిళంలో 'డీజిల్', విక్రమ్ ప్రభుతో ఒక సినిమాలో నటిస్తున్నారు. ఇక వెబ్ సిరీస్‌లలో కూడా తద్వైనా నటనతో దూసుకుపోతున్నారు. దేవా కట్టా దర్శకత్వంలో తెరకెక్కిన రాజకీయ చిత్రం 'మయసభ', క్రిష్ తెరకెక్కిస్తున్న 'కన్యాశుల్కం'లో పవర్ ఫుల్ పాత్రలను పోషిస్తున్నారు. సాయి కుమార్ తన తనయుడు ఆదితో కలిసి 'ఇన్‌స్పెక్టర్ యుగంధర్' అనే చిత్రంలో నటిస్తున్నారు.

# వేమన పద్యాలకు సంగీత స్వరం

సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ శ్రీకారం



తెలుగు సినిమా సంగీత దర్శకుడు, గాయకుడు బల్లేపల్లి మోహన్ ఒక పక్క సినిమాలకు సంగీతం చేస్తూనే మరోపక్క కొత్త అధ్యాయానికి తెరలేపారు. అందరూ మరచిపోయిన వేమన పద్యాలకు తనదైన సంగీతం సమకూర్చి భవిష్యత్తు తరాలకు సాహిత్య, సంగీత సంపదను అందిస్తున్నారు. మరుగున పడిపోతున్న వేమన సాహిత్య సంపదను యువతకు చేరవేసే మహత్తర ప్రయత్నానికి ఆయన శ్రీకారం చుట్టారు.ఈ క్రమంలో ఇప్పటివరకు 75 వేమన పద్యాలకు పైగా తానే స్వయంగా గానం చేసి, మ్యూజిక్ కూడా పూర్తి చేశారు. వేమన పద్యాలను సామాజిక మాధ్యమాల్లో సంగీత రూపంలో ప్రచారం చేస్తున్నారు. తాత్వికతను, నీతి నిజాయితీలను, విలువల సమాజాన్ని ప్రతిబింబించే గొప్ప వేమన పద్యాలనూ జనాల్లోకి తీసుకుపోవడంతో బల్లేపల్లి మోహన్ విశేషంగా ప్రశంసలు అందుకుంటున్నారు. తమిళనాడు రాజ్ భవన్‌లో ఇటీవల 'కబీర్దాస్ వేమన తిరువళ్లూర్ సాహిత్య సెమినార్' జరిగిన సందర్భంలో బల్లేపల్లి మోహన్ కు ఆహ్వానం పంపించి మరీ ప్రత్యేకంగా వేమన పద్యాలను పాడించారు. వేమన పద్యాలపై ఆయన చేస్తున్న విశిష్ట సంగీత సాధనను మెచ్చుకొని బల్లేపల్లి మోహన్ కు ప్రత్యేక అవార్డు ప్రదానం చేశారు. ఈ క్రమంలోనే ఇటీవల సినీ ప్రముఖుల సమక్షంలో దాసరి ఫిలిం అవార్డును కూడా బల్లేపల్లి మోహన్ కు అందజేసి ఘనంగా సత్కరించారు. వేమన పద్యాలతో పాటు, ఆయన స్వరపరిచిన మరో తాత్విక గీతం 'శిలానీవే – శిల్పంనీవే', 25 చరణాలతో కూడిన ఈ విశిష్ట పాటకు అందించిన సంగీతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మానవీయ విలువలను ఈ పాట గాఢంగా వ్యక్తపరుస్తోంది. ప్రేమ, క్షమ, సహనం, స్వచ్ఛత, కుటుంబ బంధాలు, దేశభక్తి వంటి అంశాలను అద్భుతంగా మేళవించిన ఈ గీతం సమాజ ఔన్నత్యాన్ని పెంపొందించే ధ్యేయంతో రూపొందించబడింది.ఈ పాటను ప్రముఖ రచయిత జయరాజ్ రచించారు. ఇంతేకాదు, ఇటీవల భారత్–పాకిస్తాన్ యుద్ధ సమయంలో భారత సైనికులు చూపిన అపూర్వ వీరత్వానికి నివాళిగా బల్లేపల్లి మోహన్ స్వరపరిచి, స్వయంగా పాడిన ఆపరేషన్ సింధూరం అనే జాతీయ గీతం, ప్రజల్లో దేశభక్తిని రగిలించే స్ఫూర్తిదాయక గీతంగా వెలుగొందుతోంది.
ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ వద్ద శిష్యరికం చేసిన బల్లేపల్లి మోహన్ రేలంగి నరసింహ రావు దర్శకత్వంలో వచ్చిన 'ఎలుక మజాకా' వంటి సినిమాలకు సంగీతం అందించారు. పంచముఖి, అబ్బో వాడా, నువ్వే నేను నేనేనువ్వు సినిమాలకు సంగీతం అందిస్తూనే సమాజంలో తనకు ఓ ప్రత్యేక గుర్తింపు లభించాలంటే తనకు వచ్చిన విద్య సంగీతంలోని ప్రత్యేకతను సాధించాలనే తపనతో వేమన పద్యాలను స్వరపరచి స్వయంగా పడుతున్నానని బల్లేపల్లి మోహన్ తెలిపారు. ఖమ్మం జిల్లా బల్లేపల్లి గ్రామానికి చెందిన మోహన్ తెలంగాణ ఉద్యమం సమయంలోనూ అనేక పాటలకు సంగీతం అందించారు. అంతేకాదు బల్లేపల్లి మోహన్ సంగీత సారధ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ముప్పై మంది తెలుగు సినిమా గాయకుకు పాడిన పాటను కూడా రికార్డ్ చేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే వేమన పద్యాలకు సంగీతం సమకూర్చి జనాల్లోకి తీసుకుపోతుంటే, ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందన చూసి జీవితం ధన్యమైనట్టుగా భావిస్తున్నాను అని మోహన్ సంతోషం వ్యక్తం చేశారు. వేమన పద్యాలకు సంగీత స్వరాన్ని జోడించి జనాల్లోకి తీసుకుపోవడమే ప్రస్తుతం లక్ష్యంగా పెట్టుకున్నానని బల్లేపల్లి మోహన్ చెప్పారు. వేమన కథను సినిమాగా తీసే ఆలోచన కూడా ఉందని, ఏవరైనా అభిరుచి గల నిర్మాత ముందుకు వస్తే వేమన జీవిత చరిత్రను పెద్ద తెర మీద ఆవిషరించాలనుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# 'ఫైటర్ శివ' ఫస్ట్ లుక్



అరుణగిరి ఆర్ట్స్ కౌండిన్య ప్రొడక్షన్స్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మించిన 'ఫైటర్ శివ' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ ను ప్రముఖ దర్శకుడు సంపత్ నంది ఆవిష్కరించారు. ప్రభాస్ నిమ్మల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మణికాంత్ ప్రధాన పాత్రలో నటించగా, ఐరా బన్సల్ కథానాయికగా నటించారు. ఈ చిత్రంలో సునీల్ , వికాస్ వశిష్ట దర్యాప్తు అధికారులుగా ప్రత్యేక పాత్రల్లో నటించారు. మధుసూదన్, యోగి ఖత్రి, దిల్ రమేష్, లక్ష్మ ణ్, అభయ్, ఆనంద్ భారతి, ఘర్షణ శ్రీనివాస్, మాస్టర్ శాన్విత్ నిమ్మల తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

# 'బ్రాట్' నుంచి యుద్ధమే రాని పాట విడుదల

డార్లింగ్ కృష్ణ, మనీషా హీరో హీరోయిన్స్‌గా శశాంక్ దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీ లింగ్వల్ మూవీ 'బ్రాట్'. డాల్ఫిన్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై మంజునాథ్ కందుక్కూర్ ఈ సినిమాని నిర్మించారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి 'యుద్ధమే రాని' సాంగ్ ని రిలీజ్ చేశారు. సిద్ శ్రీరామ్ పాడిన ఈ పాటని సీనియర్ నటుడు డాక్టర్ నరేష్ లాంచ్ చేశారు. అర్జున్ జన్య సంగీతం అందించిన ఈ పాటకు సనారె లిరిక్స్ రాశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మంజునాథ్ మంచి స్నేహితుడు. మంచి వ్యక్తి. ఆడియన్స్ పల్స్ తెలిసిన ప్రొడ్యూసర్. నాతో కన్నడలో సూపర్ డూపర్ హిట్ సినిమా చేశారు. ఈ సినిమా బ్రాట్ తో వస్తున్నారు. ఈ సినిమా ఐదు భాషల్లో చిత్రీకరించి విడుదల చేస్తున్నారు.



# ఆలయంలో తొక్కిసలాట

(మొదటి పేజీ తరువాయి)

ప్రమేంద్ర సింగ్ దోబాల్ పిటిఐకి తెలిపారు. తీవ్రంగా గాయపడన 35 మందిని ఆసుపత్రికి తరలించగా, వారిలో ఆరుగురు మరణించారని ఆయన చెప్పారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఆదివారం కావడంతో 500 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులోని శివాలిక్ కొండలపై ఉన్న ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు గుమిగూడారన్నారు. ఆలయ ఇరుకైన ద్వారం వద్దకు వెళ్తునన పిల్లలు, మహిళలు సహా ప్రజలు అదే విధంగా ఆసుపత్రి వెలుపల ఆందోళన చెందుతూ కుటుంబ సభ్యులు కిక్కిరిసిపోయిన వీడియోల వైరల్‌గా మారాయి. కాగా, ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మెజిస్టీరియల్ దర్యాప్తుకు ఆదేశించినట్లు తెలిపారు. ఒక పుకారు కారణంగా ఉదయం మానసా దేవి ఆలయంలో తొక్కిసలాట జరిగిందని, ఈ ఘటనపై మెజిస్టీరియల్ దర్యాప్తుకు ఆదేశించామని, ఈ పుకారు వ్యాప్తి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ధామి విలేకరులకు తెలిపారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా బాధపెట్టిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. స్థానిక అధికార యంత్రాగం బాధితులకు సహాయం చేస్తోంది' అయని ఆయన ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. ఘటనాస్థలిలో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్), అగ్నిమాపక దళం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి. మృతుల బంధువులకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 ఆర్థిక సహాయాన్ని సిఎం ప్రకటించారు. హరిద్వార్‌లోని జిల్లా ఆసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శించారు. వారి కుటుంబాలకు అన్ని విధాలా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. తొక్కిసలాటలో ఆరుగురు మరణించారని, 28 మంది గాయపడ్డారని, వారిలో ఐదుగురిని రిషికేశ్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్‌కు)కి రిఫర్ చేసినట్లు డెహ్రాడూన్‌లోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఎస్ఇఒసి) తెలిపింది. మృతులను ఆరుష్ (12), షకల్ దేవ్ (18), విక్కీ (18), విపిన్ (18), వకీల్ మరియు శాంతిగా గుర్తించారు. విద్యుత్తు తీగలు తెగిపోయి ప్రవహిస్తోందనే పుకారు తర్వాత తొక్కిసలాట జరిగినట్లు కనిపిస్తోందని జిల్లా మేజిస్ట్రేట్ మయూర్ దీక్షిత్ హరిద్వార్‌లో విలేకరులకు తెలిపారు. ఆ ప్రదేశంలో కొన్ని విరిగిన వైర్లు కనిపించాయని, కొంతమంది వాటిని పట్టుకుని ఆలయానికి మెట్లు ఎక్కడానికి ప్రయత్నించారని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయని ఆయన అన్నారు.

# విలువలతో కూడిన జర్నలిజం మాత్రమే చేయాలి

## తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/ వరంగల్: పాత్రికేయులు సామాజిక బాధ్యతతో విలువలతో కూడిన జర్నలిజాన్ని మాత్రమే చేయాలని తద్వార సమాజంలో ప్రజల ఆదరణ పొందుతామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్ పట్టణంలోని ఉర్స్ కరీమాబాద్ తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజులపాటు శిక్షణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి 'నైతిక నియమాలు మీడియా చట్టాలు' అనే అంశంపై ప్రసంగించారు. మీడియా అకాడమీ నిర్వహిస్తున్న పాత్రికేయుల శిక్షణ తరగతుల వల్ల మరింత జ్ఞానాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వేగంగా వార్తల సేకరణ సులభం అవుతుందని, మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులకు కావలసిన శిక్షణ ఇవ్వడానికి మీడియా అకాడమీ అన్ని చర్యలను చేపట్టి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పాత్రికేయులు నైతిక విలువలు కాపాడుకోవడంతోపాటు పారదర్శకతతో కూడిన వార్తలను ప్రచురించినప్పుడే ప్రజల్లో పాత్రికేయులపై గౌరవం పెరుగుతుందన్నారు. జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవిర్భావం, వర్కింగ్ జర్నలిస్ట్.. నాన్ వర్కింగ్ జర్నలిస్ట్ తదితర అంశాలపై ఆయన విపులంగా తెలియజేశారు. భవిష్యత్తులో పత్రిక నిర్వహణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించబోతుందని, తదనుగుణంగా రాబోవు కాలంలో జర్నలిస్టులకు టెక్నాలజీ, ఫ్యాక్ట్ చెక్ వంటి టెక్నికల్ అంశాలతో కూడిన తరగతులను మీడియా అకాడమీ తరపున నిర్వహిస్తామన్నారు. మాజీ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా, ధోరణులు ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్‌లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లో వెళ్తున్నాయని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్, బ్యూరో ఆఫ్ నెట్‌వర్క్ వెలుగు ఇన్‌చార్జి చిల్ల మల్లేశం భాష, తప్పొప్పులు, దిద్దుబాట్లపై జర్నలిస్టులకు కూలంకషంగా వివరించారు. ఆయా రిపోర్టర్లు వార్తలను డెస్క్‌కు పంపించే సమయంలో వాడుక భాషలో మాత్రమే వార్తలను పంపాలని, అవసరంలేని సాహిత్య పదజాలం, అర్థం కాని తెలుగు పదాలను వార్తలలో ఉపయోగించకూడదన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి సమాచార హక్కు చట్టం 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, టియుడబ్ల్యుజె(ఐజెయు) అధ్యక్షులు శ్రీరామ్ రామ్ చందర్, ప్రధాన కార్యదర్శి మట్టదుర్గా ప్రసాద్, తాళ్ళ పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ డా.వరుణ్, డిపిఆర్ఓ ఆయుబ్ అలీ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య బెదిరింపులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఇద్దరు నాయకులతో తాను మాట్లాడాననీ, వారు కలిసి కాల్పుల విరమణపై మాట్లాడుకునేందుకు ఒప్పుకున్నారని సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. 'మీరు ఇదే విధంగా శత్రుత్వాలు కొనసాగిస్తే మీతో వ్యాపారం చేసేదిలేదని రెండు దేశాలకూ హెచ్చరిక చేశాను, దీంతో కాల్పుల విరమణపై సంప్రదింపులకు అంగీకరించాయి' అని ట్రంప్ పోస్టింగ్ చేశారు. ఐతే ట్రంప్‌తో ఫోన్ సంభాసణ తర్వాత థాయ్‌లాండ్ తాత్కాలిక ప్రధానమంత్రి ఫుంథాన్ వెచాయచాయ్ ఒక ప్రకటన చేస్తూ, 'ట్రంప్ చాలా ఆందోళన వ్యక్తం చేశారు, ఆయనకు చూపిస్తున్న శ్రద్ధకు మా కృతజ్ఞతలు, కాల్పుల విరమణపై చర్చలకు అంగీకరిస్తున్నాం, కానీ మాదొక షరతు, మూడో దేశ జోక్యాన్ని మేం కోరుకోవడంలేదు, కాంబోడియాతో మేం ఇంకా చర్చలు ప్రారంభించలేదు' అన్నారు. కాంబోడియా ప్రధానమంత్రి హన్ మనెట్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన వెంటనే ఒక ప్రకటన చేస్తూ, తమ దేశం తక్షణ, బేషరతుగా కాల్పుల విరమణకు అంగీకరించిందన్నారు. ''దాడులు ఆపేసేందుకు థాయ్‌లాండ్ అంగీకారం తెలియజేసిందని ట్రంప్ నాకు చెప్పారు, ఇది మా రెండు దేశాల సైనికులకు, ప్రజలకు చాలా సానుకూలమైన, మంచి వార్త' అని హన్ మనెట్ చెప్పారు. థాయ్‌లాండ్‌తో తదుపరి చర్చలు జరిపే ప్రక్రియ బాధ్యతలను ఉప విదేశాంగ మంత్రి ప్రాక్ సోఖోన్‌కు అప్పగించామని, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోతో కూడా ప్రత్యక్షంగా మాట్లాడే బాధ్యతలు ఆయనకే అప్పగించామని హన్ మనెట్ చెప్పారు. ట్రంప్ జోక్యం చేసుకున్న కొద్దిసేపటికే రెండు దేశాలూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. కానీ నాలుగోరోజు కూడా ఉద్రిక్తతలు కొనసాగాయి. ఉదయం తెల్లారకముందే సరిహద్దుల్లో దాడులు జరిగాయంటూ కాంబోడియా–థాయ్‌లాండ్ పరస్పర ఆరోపణలు చేశాయి. 'మీరంటే మీరే మొదట దాడులు ప్రారంభించారు' అంటూ రెండు దేశాల ప్రభుత్వాలు గడచిన గురువారం నుండి ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఆదివారంనాడు కూడా అవే ఆరోపణలు కొనసాగాయి. రెండు దేశాలమధ్యా 867 కి.మీ నిడివిగల సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. బేషరతుగా యుద్ధం ఆపేందుకు కృషి చేయాలని భద్రతా మండలికి కాంబోడియా ప్రభుత్వం శనివారం నాడు విజ్ఞప్తి చేసింది. యుద్ధంలో మొత్తం 34 మంది మరణించారు. రెండు దేశాల సరిహద్దు ప్రాంతాల నుండీ దాదాపు 1,68,000 మంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలుక వెతుక్కుంటూ వెళ్ళిపోయారు. ఇలా వెళ్ళినవారిలో థాయ్ ప్రజలే ఎక్కువమంది ఉన్నారు. ప్రభుత్వాలు కూడా సరిహద్దు గ్రామాలను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశాయి. థాయ్‌లాండ్‌లో 20 మంది మరణించగా, కాంబోడియాలో 13 మంది మరణించారు.

# చర్యలు తీసుకుంటున్నాం

(మొదటి పేజీ తరువాయి)

సురేంద్రమోహన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చారిత్రక నిర్ణయం అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఉమ్మడి జిల్లా అధికారులతో పాల్వంచలోని ఐడిఓసిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జల వికాసం పథకం ద్వారా రైతులకు మేలు చేయాలన్నారు. మూడేళ్లలో సం.కు రూ.12,600 కోట్లను ఖర్చు చేసి ఈ పథకం ద్వారా గిరిజన రైతులకు అభివృద్ధి ఫలాలు అందిస్తామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు 25 ఎకరాల్లో నిర్మించి ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాలా పట్ల వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతరం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పేదల సంక్షేమానికి ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్ రవాణా, రూ.500లకే గ్యాక్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు బ్యాంకుల ద్వారా కోట్లాధి రూపాయల రుణాలు ఇచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహిళా సంఘాల ద్వారా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలు స్థాపించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనంతరం ఇంచార్జ్ మంత్రి శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వపథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఆవరణలో ఐదు మొక్కలు నాటే విధంగా చూడాలన్నారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాను రాష్ట్రంలోనే అభివృద్ధి మోడల్‌గా తీర్చిదిద్దేంకు అధికారులు పనిచేయాలన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలను ముందుంచుకుని అధికారులు పనిచేయాలన్నారు. రెవెన్యూ శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. ప్రతీ సోమవారం లబ్దిదారుల ఖాతాల్లో విడతలవారీగా నగదు జమలవుతున్నాయని చెప్పారు.
పంచాయితీరాజ్, ఆర్అండ్‌బి శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వానాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులు, వసతి గృహాల పర్యవేక్షణకు ఒక ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్‌పి రోహిత్ రాజ్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు, భద్రాచలం ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు, ఇల్లెందు ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావు పేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ, సత్తుపల్లి ఎంఎల్ఏ రాగమయి, వైరా ఎంఎల్ఏ రామ్‌దాస్ నాయక్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, టిజిఐడిసి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా అధికారులు తదితురులు పాల్గొన్నారు.

# మాటల యుద్ధం! (మొదటి పేజీ తరువాయి)

అఖిలేష్ యాదవ్‌తో పాటు అనేక మంది ఇతర నాయకులు ప్రభుత్వంపై ఆరోపణలు చేసే అవకాశముంది. శుక్రవారం ఉభయసభలు వాయిదా పడ్డ తరువాత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, సోమవారం లోక్‌సభలో, మంగళవారం రాజ్యసభలో పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ ప్రారంభించడానికి ప్రతిపక్షాలు అంగీకరించాయని చెప్పారు. ఉభయసభల్లోనూ 16 గంటల పాటు జరిగే చర్చకు ఇరుపక్షాలు అంగీకరించాయన్నారు. అనురాగ్ ఠాకూర్, సుధాంషు త్రివేది, నిషికాంత్ దూబే వంటి మంత్రులు, నాయకులతో పాటు, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశం తరపున వాదనను వినిపించడానికి 30కి పైగా ప్రపంచ రాజధానులకు ప్రయాణించిన ఏడు బహుళపార్టీల ప్రతినిధుల నుండి అధికార ఎన్‌డిఏ తమ సభ్యులను చర్చలోకి దింపాలని భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. వారిలో శివసేనకు చెందిన శ్రీకాంత్ షిండే, జెడి(కు)కు చెందిన సంజయ్ ఝా, టిడిపికి చెందిన హరీష్ బాలయోగి తదితరులు ఉన్నారు. అమెరికాతో పాటు ఇతర దేశాలకు ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన శశి థరూర్‌ను కాంగ్రెస్ స్పీకర్‌గా ఎంపిక చేస్తుందా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఉగ్రవాద దాడి తర్వాత ప్రభుత్వం తీసుకున్న చర్యను శశి థరూర్ ఆమోదించడంతో ఆయనకు పార్టీతో ఉన్న సంబంధాలను దెబ్బతీసింది. కాగా, ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడి వెనుక ఉన్న నిఘా లోపాలు, భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలకు సంబంధించి ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేశాయి. ఆపరేషన్ సిందూర్‌లో భారతదేశానికి అంతర్జాతీయ మద్దతు లభించలేదని, పాలక కూటమిని లక్ష్యంగా చేసుకోవడానికి ట్రంప్ తరచుగా మధ్యవర్తిత్వం వహించారని రాహుల్ గాంధీ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని పదే పదే విమర్శిస్తున్నారు. పహల్గామ్ దాడి తర్వాత పాకిస్థాన్, పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకున్న ఆపరేషన్ సిందూర్‌ను మోదీ తన వంతుగా ప్రశంసించారు. ఇదిలా ఉండగా, బిహార్‌లో ఎన్నికల కమిషన్ కొనసాగిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాపై పార్లమెంటులో చర్చ జరగాలనే డిమాండ్ ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి మధ్య మిగిలి వివాదంగా ఉంది. ఈ ప్రక్రియ ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో బిజెపి నేతృత్వంలోని కూటమికి సహాయం చేయడమే లక్ష్యంగా ఉందని పేర్కొంటూ పార్లమెంట్ సమావేశాల మొదటి వారంలో ఐక్య ప్రతిపక్షం ఈ అంశంపై ఉభయసభల్లో ఆందోళన చేపట్టింది. ప్రతి అంశాన్ని ఒకేసారి పార్లమెంటులో చర్చకు తీసుకోలేమని, నిబంధనలకు అనుగుణంగా ఎస్ఐఆర్ చర్చకు ప్రభుత్వం తర్వాత నిర్ణయం తీసుకుంటుందని రిజిజు చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com